

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 31-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 256 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 3.21 తదుపరి విదియ; నక్షత్రం: పూర్వాషాఢ రా. 12.04 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ. 9.35-11.12; దుర్ముహూర్తం: ఉ. 9.00-9.44, రా. 10.04-10.54; అమృతఘడియలు: రా. 7.14-8.51; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 5.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● మంగళవారం 31 డిసెంబరు 2024



ఐసీసీ అవార్డుల రేసులో బుమ్రా

దుబాయ్: అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో అదరగొడుతున్న భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ ఏడాది ఐసీసీ ఉత్తమ క్రికెటర్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. అలాగే టెస్ట్ క్రికెట్‌లో ఉత్తమ ఆటగాడి పురస్కారానికీ అతడు పోటీపడుతున్నాడు. బుమ్రాతోపాటు ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్, ఆ దేశానికే చెందిన యువ ఆటగాడు హ్యారీ బ్రూక్, ఆస్ట్రేలియా హార్డ్ హిట్టర్ ట్రావిస్ హెడ్ 'క్రికెట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో నిలిచారు. ఇక..బుమ్రా, శ్రీలంక ఆల్‌రౌండర్ కమిందు మెండిస్, రూట్, బ్రూక్ ఐసీసీ టెస్ట్ క్రికెటర్ అవార్డు రేసులో పోటీపడుతున్నాడు. ఇంకా భారత్ నుంచి మంధాన (మహిళల వన్డేలు), అర్ష్‌దీప్ సింగ్ (పురుషుల టీ20లు), శ్రేయాంక పాటిల్ (వర్ధమాన క్రికెటర్) కూడా ఐసీసీ పురస్కారాలకు నామినేట్ అయ్యారు.

డబ్ల్యూటీసీలో టీమిండియా పరిస్థితేంటి?


కోహ్లి (5)

నాలుగో టెస్టులో ఓటమితో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్‌ను టీమిండియా అత్యంత సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటికే సౌతాఫ్రికా ఫైనల్‌కు వెళ్లగా ఆసీస్ 61.46 విజయాల శాతంతో రెండో స్థానంలో ఉంది. భారత్ 52.78తో మూడో స్థానంలో ఉండగా మిగిలిన సిడ్నీ టెస్టును కచ్చితంగా నెగ్గాల్సిందే. ఆ తర్వాత శ్రీలంక జట్టు ఆసీస్‌పై 2-0తో గెలిస్తేనే రోహిత్ సేనకు అవకాశముంటుంది.

న్యూజిలాండ్‌దే సిరీస్

మౌంట్‌మాంగనూయ్: శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ ఉండగానే సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన రెండో టీ20లో ఆతిథ్య జట్టు 45 పరుగులతో నెగ్గింది. మొదట న్యూజిలాండ్ 20 ఓవర్లలో 186/5 స్కోరు చేసింది. చాప్‌మన్ (42), రాబిన్సన్ (41), మిచెల్ హే (41 నాటౌట్) సత్తా చాటారు. హసరంగ (2/28) రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ పెరీరా (48), నిస్సాంక (37) మాత్రమే రాణించారు. డఫీ నాలుగు (4/15), శాంట్నర్ (2/22), మ్యాట్ హెన్రీ (2/31) చెరో రెండు వికెట్లు తీశారు.

ఆరేపల్లి ముప్పాళ్లలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు: పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లలో జనవరి 12 నుంచి 17వరకు రైతువిత్ర 33వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. పోటీలలో దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన సుమారు 40 జట్లు పాల్గొనే అవకాశముందని కమిటీ సభ్యులు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి కల్పించనున్నారు. విజేత జట్టుకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.2 లక్షలు, మూడో స్థానం జట్టుకు రూ.లక్ష అందజేయనున్నారు. అలాగే నాలుగునుంచి 12 స్థానాలు సాధించిన ప్రతి జట్టుకూ నగదు బహుమతి అందిస్తారు. ఇంకా ఉత్తమ రైడర్, ఉత్తమ డిఫెండర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీ అవార్డులు ఇవ్వనున్నారు. ఇతర వివరాలు, పేర్ల నమోదు కోసం 9981922533, 9966671306 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కమిటీ సభ్యుడు తల్లపనేని రామారావు తెలిపారు.

కంగారూ 'పంచ్'



కాస్త గట్టిగానే!

- 184 రన్స్ తేడాతో భారత్ పరాజయం
- రెండో ఇన్నింగ్స్ 155
- జైస్వాల్ ఒంటరి పోరాటం
- బాక్సింగ్ డే టెస్టు

లక్ష్యం 340 పరుగులు.. 92 ఓవర్లు.. 11 మంది ఆటగాళ్లు. ఇదీ ఆఖరిరోజు సోమవారం భారత్ ముందున్న పరిస్థితి. ఈ స్థితిలో విజయమో.. లేదంటే డ్రా కోసమో జట్టు ఆడుతుందని అంతా ఆశించారు. కానీ మెల్‌బోర్న్ మైదానంలో జరిగింది వేరు. ముందురోజు ఆసీస్ టెయిలెండర్లు చూపిన తెగువ కూడా భారత బ్యాటర్లలో కనిపించలేదు. జైస్వాల్, పంత్ మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగా, అండగా నిలవాల్సిన రోహిత్, విరాట్ సహా అంతా విఫలమయ్యారు. 34 రన్స్‌కే చివరి 7 వికెట్లను పడగొట్టి ఆసీస్ బౌలర్లు తమ జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు.

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ బాక్సింగ్ డే టెస్టులో భారత జట్టుకు ఘోరపరాభవం ఎదురైంది. సోమవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో రోహిత్ సేన ఏకంగా 184 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఫలితంగా ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. ఆఖరిదైన సిడ్నీ టెస్టు జనవరి 3 నుంచి జరుగుతుంది. 340 పరుగుల ఛేదనలో ఆఖరి రోజు బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 155 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (84), పంత్ (30) నాలుగో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. వీరిద్దరు మినహా మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కమిన్స్, బోలాండ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. లియోన్ 2 వికెట్లు తీశాడు. అంతకుముందు ఆసీస్ ఆఖరి రోజు పది బంతులే ఆడి రెండో ఇన్నింగ్స్‌ను 234 పరుగుల వద్ద ముగించింది. బుమ్రాకు 5, సిరాజ్‌కు 3 వికెట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474, భారత్ 369 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

జైస్వాల్-పంత్ మినహా..: భారీ ఛేదనలో మూడు సెషన్ల ఆట ఉండడంతో డ్రా కోసమైనా భారత ఆటగాళ్లు పోరాడతారనిపించింది. కానీ జైస్వాల్-పంత్ భాగస్వామ్యం మినహా చెప్పుకోవడానికేమీ లేకపోయింది. ఆరంభంలో క్రీజులో ఉన్నంతసేపు కెప్టెన్ రోహిత్ (9) చక్కటి డిఫెన్స్‌ను ప్రదర్శించాడు. కానీ 17వ ఓవర్‌లో కమిన్స్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. అతడి ఫుల్లర్ బాల్‌ను ఫ్లిక్ చేయబోయిన రోహిత్ గల్లీలో వికెట్‌ను సమర్పించుకోగా, రాహుల్ ఓ అద్భుత బంతికి డకౌటయ్యాడు. ఇక అండగా నిలుస్తాడనుకున్న విరాట్ కోహ్లీ (5) లంచ్ బ్రేక్‌కు ముందు మరోసారి ఆఫ్‌సైడ్ ఆవల బంతిని ఆడి పెవిలియన్ చేరాడు. దీంతో 33/3 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. కానీ రెండో సెషన్‌ను జైస్వాల్-పంత్ జోడీ జాగ్రత్తగా ఆడి వికెట్‌ను కోల్పోకుండా ముగించింది. వీరిద్దరు ఆసీస్‌ను దీటుగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పంత్ ఓపికగా క్రీజులో పాతుకుపోయాడు. తన సహజశైలిని పక్కనబెట్టి వికెట్ కాపాడుకునే ప్రయత్నం చేశాడు. అటు జైస్వాల్ అర్ధసెంచరీని పూర్తి చేసుకోవడంతో ఈ సెషన్‌ను జట్టు 112/3తో ముగించింది.

పేకమేడలా..: రెండు సెషన్ల ఆటను చూస్తే భారత్ ఫర్వాలేదనే స్థితిలో కనిపించింది. ఆఖరి సెషన్‌లో మరో 38 ఓవర్ల ఆట మిగిలి ఉండగా చేతిలో 7 వికెట్లున్నాయి. ఈ దశలో డ్రా ఖాయమనిపించింది. కానీ ఇలాంటి కీలక స్థితిలో పంత్ నిర్లక్ష్యపు షాట్ కొంపముంచింది. హెడ్ ఓవర్‌లో భారీ షాట్ ఆడిన పంత్ బౌండరీ లైన్ వద్ద మార్ష్‌కు చిక్కాడు. అంతే.. ఈ వికెట్ తర్వాత ఆసీస్ బౌలర్లు ఒకరి తర్వాత మరొకరిని పెవిలియన్‌కు క్యూ కట్టించారు. ఓవైపు సుందర్ (5 నాటౌట్) ఓపిగ్గా ఆడినా చివర్లో అతడికి సహకారం కరువైంది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474; భారత్ తొలి ఇన్నింగ్స్: 369; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 234.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 84; రోహిత్ (సి) మార్ష్ (బి) కమిన్స్ 9; రాహుల్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; విరాట్ (సి) ఖవాజా (బి) స్టార్క్ 5; పంత్ (సి) మార్ష్ (బి) హెడ్ 30; జడేజా (సి) క్యారీ (బి) బోలాండ్ 2; నితీశ్ (సి) స్మిత్ (బి) లియోన్ 1; సుందర్ (నాటౌట్) 5; ఆకాశ్ (సి) హెడ్ (బి) బోలాండ్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) బోలాండ్ 0; సిరాజ్ (ఎల్బీ) లియోన్ 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 79.1 ఓవర్లలో 155 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-25, 2-25, 3-33, 4-121, 5-127, 6-130, 7-140, 8-150, 9-154, 10-155. **బౌలింగ్:** స్టార్క్ 16-8-25-1; కమిన్స్ 18-5-28-3; బోలాండ్ 16-7-39-3; మార్ష్ 3-2-2-0; లియోన్ 20.1-6-37-2; హెడ్ 5-0-14-1; లబుషేన్ 1-1-0-0.

ఓటమి వేధిస్తోంది

ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాం. ఓటమి మానసికంగా వేధిస్తోంది. ఆఖరిదాకా పోరాడాలని భావించినా లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. ఆసీస్‌ను 90/6తో కట్టడి చేసినా ఆ తర్వాత పట్టు కోల్పోయాం. ఇక చివరి రోజు 340 పరుగుల ఛేదన సులువు కాదని తెలుసు. మా ప్రణాళికలు ఫలించలేదు. పంత్ కీలక సమయంలో అవుటయ్యాడు. ఆ వికెట్ పడ్డాక మా పరిస్థితి దిగజారింది. కానీ అతడు ఆడిన తీరును తప్పుపట్టలేం. ఎన్నో సమయాల్లో అతను జట్టుకు విజయాలందించాడు. కానీ తన నుంచి జట్టుకు ఏం కావాలో కూడా పంత్ అర్థం చేసుకోవాలి. బుమ్రాకు ఇతర బౌలర్ల నుంచి సహకారం అందడం లేదు.

- రోహిత్ శర్మ


రోహిత్ (9)

రోహిత్‌కు సమయం వచ్చేసింది

మెల్‌బోర్న్: టెస్టులనుంచి రోహిత్ రిటైర్మెంట్ తీసుకుంటే మంచిదని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. 'టెస్టుల్లో సుదీర్ఘ కాలంగా రోహిత్ భారీ స్కోర్లు చేయలేకపోతున్నాడు. పైగా ఈ ఫార్మాట్‌లో రోహిత్ టెక్నిక్‌కూడా బాగా లేదు. అతడి పాదాల కదలిక వేగంగా లేదు. బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేస్తున్నాడు. వీటన్నింటి రీత్యా ఈ సిరీస్ తర్వాత అతను రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకోవడం ఉత్తమం' అని శాస్త్రి అభిప్రాయపడ్డాడు.

కోహ్లీ మరో మూడేళ్లు ఆడతాడు: కోహ్లీలో మరో మూడు, నాలుగేళ్లు ఆడే సత్తా ఉందని రవిశాస్త్రి చెప్పాడు. 'విరాట్ ఎలా అవుటయ్యాడన్నది వదిలేయండి. కానీ అతడిలో ఇంకొంత కాలం క్రికెట్ ఆడే సామర్థ్యం ఉంది' అని చెప్పుకొచ్చాడు.

ఆ ఇద్దరి వల్లే..: సీనియర్లు రోహిత్, విరాట్ వైఫల్యమే బాక్సింగ్ డే టెస్టు ఓటమికి కారణమని సునీల్ గవాస్కర్ దుయ్యబట్టాడు. 'మ్యాచ్‌ను కాపాడుకోవాలంటే టాపార్డర్ బ్యాటర్లు చివరి రోజంతా ఆడాలి. కానీ వారు రాణించలేదు. టాపార్డర్ వైఫల్యంవల్లే నాలుగో టెస్టులో భారత్ ఓడింది' అని గవాస్కర్ స్పష్టంజేశాడు.

నీ పనేంటో చూస్కో.

భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జైస్వాల్, ఆసీస్ ప్లేయర్ కాన్‌స్టాస్ మధ్య వాగ్వాదం జరిగింది. సిల్లీ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కాన్‌స్టాస్ అదేపనిగా అరుస్తూ జైస్వాల్ ఏకాగ్రతను దెబ్బతీసేందుకు చూశాడు. దీంతో 'నీ పనేంటో ముందు చూస్కో.. ఎందుకు మాట్లాడుతున్నావ్' అని జైస్వాల్ సీరియస్ అయ్యాడు. అంతేకాకుండా ఆ తర్వాత తాను ఎదుర్కొన్న బంతిని బలంగా అతడి వైపే బాది పగ తీర్చుకున్నాడు.


జైస్వాల్ (84)

జైస్వాల్ అవుటా? నాటౌటా?

భారత్ ఛేదనలో అత్యంత కీలక సమయంలో జైస్వాల్ నిష్క్రమణ వివాదాస్పదంగా మారింది. ఇన్నింగ్స్ 71వ ఓవర్‌లో కమిన్స్ వేసిన బంతిని లెగ్‌సైడ్ ఆడేందుకు జైస్వాల్ ప్రయత్నించాడు. కానీ ఈక్రమంలో బంతి వెళ్లి కీపర్ క్యారీ చేతుల్లో పడింది. అటు ఆసీస్ క్యాచ్ అవుట్ కోసం అప్పీల్ చేయగా, అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. వెంటనే కమిన్స్ డీఆర్ఎస్ కోరడంతో రీప్లేలో బంతి బ్యాట్‌కు, గ్లౌవ్స్‌కు తాకినట్టు స్నికోమీటర్‌లో ఎక్కడా స్పైక్ కనిపించలేదు. కానీ ఆ బంతి ప్రయాణిస్తున్న మార్గంలో మార్పును గమనించి థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించడంతో భారత శిబిరం షాక్‌కు గురైంది. వాస్తవానికి టెక్నాలజీని వాడుతున్నప్పుడు దానికే కట్టుబడి ఉండాలి. కానీ బంగ్లాదేశ్‌కు చెందిన థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా మాత్రం.. బంతి జైస్వాల్ గ్లౌవ్స్‌కు తాకినట్టుగా కనిపిస్తుందంటూ అవుట్ ప్రకటించాడు.



హష్మతుల్లా ద్విశతకం

అఫ్ఘాన్‌తో జింబాబ్వే టెస్టు డ్రా

బులవాయో: భారీ స్కోర్లతో హోరెత్తిన జింబాబ్వే-అఫ్ఘానిస్థాన్ మధ్య తొలి టెస్టు డ్రాగా ముగిసింది. అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌లో రెండు డబుల్ సెంచరీలు నమోదు కావడం విశేషం. మూడో రోజు ఆటలో రహ్మత్ షా (234) ఈ ఫీట్ సాధించగా.. ఆఖరి రోజైన సోమవారం కెప్టెన్ హష్మతుల్లా షాహిది (246) కూడా ద్విశతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 699 పరుగుల భారీ స్కోరు సాధించింది. టెస్టుల్లో ఈ జట్టుకిదే అత్యధిక స్కోరు. అఫ్సర్ జజాయ్ (113) శతకం బాదాడు. నాలుగో వికెట్‌కు షాహిది-అఫ్సర్ 211 రన్స్ జోడించారు. అయితే 20 పరుగుల వ్యవధిలోనే చివరి ఆరు వికెట్లు నేలకూలాయి. ఆ తర్వాత 113 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 142/4 స్కోరు సాధించింది. ఆటకు మరో గంట సమయం ఉండగా ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 586 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఆర్థిక స్థిరత్వానికే ప్రాధాన్యత

- గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ
- కంపెనీల బ్యాలెన్స్ షీట్లు భేష్
- ధరల సెగ తగ్గుతుంది
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



ముంబై: కీలక వడ్డీ రేట్లు తగ్గించాలని ఎవరెంత అరిచి గీపెట్టినా, తమ వైఖరి మారదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి స్పష్టం చేసింది. దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని తేల్చి చెప్పింది. తాజాగా విడుదల చేసిన డిసెంబరు-24 సంచికలో 'ఆర్థిక స్థిరత్వ నివేదిక'కు రాసిన ముందు మాటలో ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వృద్ధి రేటును పక్కన పెట్టి ద్రవ్యోల్బణ కట్టడిపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్లే సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోయిందని ఇటీవల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఈ విషయం స్పష్టం చేయడం విశేషం.

కోలుకుంటోంది..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో మన జీడీపీ వృద్ధి రేటు 6 శాతానికి పడిపోయింది. సెప్టెంబరు త్రైమాసికంలో అయితే ఏడు నెలల కనిష్ఠ స్థాయి 5.4 శాతాన్ని తాకింది. అయితే అంతర్జాతీయంగా కొన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నా ఈ ఏడాది అక్టోబరు నుంచి మన ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పడిందని మల్హోత్రా పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఆర్థిక భవిష్యత్‌పై వ్యాపార సంస్థలు, వినియోగదారుల నమ్మకం పెరగడం ఇందుకు ప్రధాన కారణమన్నారు. కంపెనీల లాభాలు పెరగడంతో పెట్టుబడులూ గాడిన పడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కొన్ని సమస్యలు ఉన్నా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కూడా ప్రస్తుతం ఆశాజనకంగానే కనిపిస్తోందని తెలిపారు.

తగ్గిన ఎన్‌పీఏల భారం: దేశ బ్యాంకింగ్ రంగం ఆర్థిక స్థితి గతులు మరింత మెరుగుపడ్డాయని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశంలోని 37 వాణిజ్య బ్యాంకుల మొత్తం రుణాల్లో స్థూల మొండి బకాయి (జీఎన్‌పీఏ)ల వాటా 12 ఏళ్ల కనిష్ఠ స్థాయి 2.6 శాతానికి పడిపోయిందని పేర్కొంది. ఇందులో టాప్-100 బడాబాబుల వాటా 34.6 శాతమని తెలిపింది. నికర ఎన్‌పీఏల భారమైతే ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు నాటికి 0.6 శాతానికి పడిపోయింది. పరపతి డిమాండ్ పెరగడం, రుణ వసూళ్లు పెరగడం ఇందుకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. అయితే బ్యాంకింగ్ వ్యవస్థలో ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకుల్లో రుణాల కొట్టివేతలు (రైటాఫ్) పెరిగి పోవడంపై మాత్రం ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది.

నిష్క్రియా ఖాతాలపై జాగ్రత్త: దేశ బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలపైనా ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేటుగాళ్లకు చెక్ పెట్టేందుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నిష్క్రియా (మ్యూల్) ఖాతాలపై ఒక కన్నేసి ఉంచాలని కోరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే దేశ బ్యాంకింగ్ రంగంలో 18,461 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ నేరాల ద్వారా సైబర్ నేరస్థులు బ్యాంకు ఖాతాదారుల నుంచి రూ.21,367 కోట్లు కొట్టేశారు.

గత ఏడాది ఇదే కాలంలో కొట్టేసిన రూ.2,623 కోట్లతో పోలిస్తే ఇది ఎనిమిదింతలు ఎక్కువని ఆర్‌బీఐ తెలిపింది. ఖాతాదారులు వీరి బారిన పడకుండా ఉండేందుకు, బ్యాంకులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్‌బీఐ సూచించింది.

ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చెల్లింపులకీ లుక్-అప్ సౌలభ్యం

ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చెల్లింపులకూ 'లుక్-అప్' సౌలభ్యాన్ని విస్తరించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచే ఈ విధానం అమల్లోకి రానుంది. అప్పటిలోగా ఇందుకు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేసి బ్యాంకులకు అందుబాటులోకి తేవాలని భారత జాతీయ చెల్లింపుల సంస్థ ఎన్‌పీసీఐని కోరింది. ప్రస్తుతం యూపీఐ, ఐఎంపీఎస్ చెల్లింపులకు మాత్రమే ఈ లుక్-అప్ సౌకర్యం ఉంది. ఈ విధానంలో ఎవరికి నగదు బదిలీ చేయాలో అతడి బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లింపు ప్రారంభించే ముందే మనకు కనిపిస్తాయి. అది నగదు అందుకునే వ్యక్తి నిజమైన ఖాతా అని నిర్ధారణ చేసుకున్నాకే, నగదు బదిలీ చేయవచ్చు. ఇప్పుడు ఈ విధానాన్ని ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చెల్లింపులకూ విస్తరించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. దీనివల్ల బ్యాంకింగ్ నేరాలకూ చెక్ పడుతుందని భావిస్తున్నారు.

రిటైల్ రుణాలపై పారా హుషార్

చెల్లింపులకు హామీలేని క్రెడిట్ కార్డు, వ్యక్తిగత రుణాల వంటి రిటైల్ రుణాల ఎగవేతలపైనా ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. వీరిలో ఎక్కువ మందికి ఇప్పటికే ఇతర సెక్యూర్డ్ రుణాల చెల్లింపుల భారం ఉంటుందనే విషయాన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గుర్తించాలని కోరింది. కొవిడ్‌కు ముందు ఏటా 14.8 శాతం చొప్పున పెరిగిన కన్స్యూమర్ రుణాలు, ఇప్పుడు ఏటా 20.6 శాతం చొప్పున పెరుగుతున్న విషయాన్ని గుర్తు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	99,900 ▲
విజయవాడ	78,500 ▼	73,300 ▲	89,600 ▲
విశాఖపట్నం	76,800 ▲	70,400 ▲	88,960 ▲
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	89,800 ▼
ప్రొద్దుటూరు	78,500 ▼	72,690 ▼	90,000 ▲
ముంబై	76,194 ▼	69,794 ▼	87,175 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ



హైదరాబాద్	510
వరంగల్	512
చిత్తూరు	563
విజయవాడ	540
గోదావరి	535
విశాఖపట్నం	600

దజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95
వరంగల్	95
కరీంనగర్	95
మహబూబ్‌నగర్	95
కర్నూలు	95
విశాఖపట్నం	105
గోదావరి	106
విజయవాడ	106
గుంటూరు	106
ఒంగోలు	106
చిత్తూరు	97
నెల్లూరు	97
అనంతపురం	97

సంగమం పవర్ ప్రాజెక్ట్స్ చేతికి కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్

ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి బిజినెస్): కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (కేడీఎంఎస్ఎల్), దాని అనుబంధ సంస్థల కొనుగోలుకు సంగమం పవర్ ప్రాజెక్ట్స్ సమర్పించిన రిజొల్యూషన్ ప్రణాళికకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. కేడీఎంఎస్ఎల్ అనుబంధ సంస్థల్లో కార్వీ ఇన్నోటెక్ లిమిటెడ్ (కేటీఐఎల్), కార్వీ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (కేఆర్ఈపీఎల్) ఉన్నాయి. కట్టా సీతారాం రెడ్డి, అన్షుమన్ మోదుగు రెడ్డి నాయకత్వంలోని సంగమం పవర్ ప్రాజెక్ట్స్ సంస్థ 2008 సంవత్సరం నుంచి పునరుత్పాదక ఇంధన విభాగంలో అగ్రగామిగా ఉంది. సోలార్, హైడ్రో, పవన విద్యుత్ రంగాల్లో స్పెషలైజ్ చేసింది. జస్టిస్ వెంకట రామకృష్ణ బదరీనాథ్ నందుల్, చరణ్ సింగ్ సభ్యులుగా గల ఎన్‌సీఎల్‌టీ బెంచ్.. కేడీఎంఎస్ఎల్ కార్పొరేట్ దివాలా ప్రక్రియకు (సీఐఆర్‌పీ) ఆమోదం తెలుపుతూ తీర్పు ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబరులో మొదలైన సీఐఆర్‌పీ ప్రక్రియ అంతటినీ రిజల్యూషన్ ప్రొఫెషనల్ సుహాసినీ అశోక్ పర్యవేక్షించారు. 2008 నుంచి నిర్మించిన కేడీఎంఎస్ఎల్ వ్యాపార వారసత్వాన్ని పునరుద్ధరించి, ఆయా రంగాల్లో కంపెనీకి గల గుర్తింపును సొమ్ము చేయడంపై ఈ రిజొల్యూషన్ ప్రణాళిక ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

మార్కెట్‌కు అమ్మకాల పోటు

సెన్సెక్స్ 450 పాయింట్లు డౌన్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలు, విదేశీ సంస్థల నిధుల తరలింపు నేపథ్యంలో సోమవారం ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తాయి. మార్కెట్ అగ్రగాములైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో భారీ ఎత్తున అమ్మకాలు సాగాయి. ఫలితంగా సెన్సెక్స్ 450.94 పాయింట్ల నష్టంతో 78,248.13 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని షేర్లలో 23 నష్టాలతోనే ముగిశాయి. నిఫ్టీ 168.50 పాయింట్ల నష్టంతో 23,644.90 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో 38 నష్టాల్లోనే ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి.

సెనోరెస్ ఫార్మా దూకుడు: ఇటీవల ఐపీఓ ముగించుకున్న సెనోరెస్ సోమవారం షేరు మార్కెట్లో లిస్టింగ్ అయ్యింది. సెనోరెస్ ఫార్మా షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.391పై 42.65 శాతం ప్రీమియంతో రూ.557.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 55.75 శాతం ప్రీమియంతో రూ.609 వరకు కూడా దూసుకుపోయింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 42.46 శాతం లాభంతో రూ.557.05 వద్ద ముగిసింది.

ఏథర్ ఎనర్జీ ఇష్యూకు సెబీ ఆమోదం: పబ్లిక్ ఇష్యూ జారీ కోసం ఆరు కంపెనీలు చేసుకున్న దరఖాస్తులకు సెబీ ఆమోదముద్ర వేసింది. వాటిలో ఈవీ కంపెనీ ఏథర్ ఎనర్జీ ఇష్యూ కూడా ఉంది. ఈ ఇష్యూ ద్వారా రూ.3,100 కోట్ల విలువ గల తాజా ఈక్విటీ షేర్లు మార్కెట్లో జారీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 2.2 కోట్ల షేర్లను విక్రయిస్తారు. ఇష్యూ ద్వారా సేకరించే నిధులు మహారాష్ట్రలో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటుకు, రుణ భారం తగ్గించుకునేందుకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇష్యూ జారీ కోసం సెబీ ఆమోదం పొందిన ఇతర సంస్థల్లో లీలా ప్యాలెస్ మాతృసంస్థ ష్లాస్ బెంగళూరు, ఓస్వాల్ పంప్స్, ఐవాల్యూ సొల్యూషన్స్, క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్, ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్ ఇష్యూలున్నాయి.

బిజినెస్

adani wilmar

'ఎఫ్‌ఎంసీజీ'కి అదానీ గ్రూప్ గుడ్‌బై

అదానీ విల్మర్‌లో మొత్తం వాటాల విక్రయం
డీల్ విలువ రూ.17,100 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్.. ఎఫ్‌ఎంసీజీ వ్యాపారానికి గుడ్‌బై చెబుతోంది. ఇందుకోసం ఎఫ్‌ఎంసీజీ సంస్థ అదానీ విల్మర్ ఈక్విటీలో తనకు ఉన్న 43.94 శాతం వాటాలో 31.06 శాతం వాటాను సింగపూర్ కంపెనీ విల్మర్ ఇంటర్నేషనల్‌కు విక్రయిస్తోంది. మిగిలిన 12.88 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సాధారణ వాటాదారులకు విక్రయించనుంది. విల్మర్ ఇంటర్నేషనల్ ఈ షేర్లను ఒక్కోటి రూ.305 చొప్పున కొనుగోలు చేయనుంది. ఈ అమ్మకం ద్వారా అదానీ గ్రూప్‌నకు రూ.12,314 కోట్ల నిధులు అందుబాటులోకి వస్తాయి. ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించే 12.88 శాతం వాటాను కూడా పరిగణలోకి తీసుకుంటే ఈ లావాదేవీ మొత్తం విలువ రూ.17,100 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా ఈ లావాదేవీ పూర్తవుతుందని అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) తెలిపింది. ఈ వాటాల కొనుగోలుకు సంబంధించి ఏఈఎల్, అనుబంధ సంస్థ అదానీ కమోడిటీస్ ఎల్‌ఎల్‌పీ, విల్మర్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ లెన్సే పీటీఈ లిమిటెడ్.. ఈ మేరకు సోమవారం నాడు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

1999 జనవరిలో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన అదానీ విల్మర్.. ఫార్చ్యూన్ బ్రాండ్ కింద వంట నూనెలు, ఇతర ఆహార ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీకి దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 23 ప్లాంట్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.51,55.24 కోట్లుగా ఉంది. కాగా సోమవారం బీఎస్ఈలో అదానీ విల్మర్ షేరు స్వల్ప నష్టంతో రూ.329.50 వద్ద క్లోజైంది. సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.42,824 కోట్లుగా ఉంది.

చడీ చప్పుడూ లేకుండా గెంటివేతలు

ఉద్యోగుల ఉద్వాసనకు కొత్త వ్యూహం

ముంబై: సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మకంగా మారిపోతూ ఉండడంతో ఉద్యోగుల ఉద్వాసనకు కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చాయి. ఇంతమందిని తీసేస్తాం...అంత మందిని పంపేస్తాం అనే భారీ ప్రకటనలు ఏవీ లేకుండా...ఉద్యోగులు తమంత తామే ఉద్యోగాలు వదిలిపెట్టి పారిపోయేలా పరోక్షంగా ఒత్తిడి (సైలెంట్ ఫైరింగ్) చేస్తున్నాయి. తాజాగా ఈ ధోరణి బాగా పెరిగిందని స్టాఫింగ్ సొల్యూషన్స్, హెచ్ఆర్ సర్వీసెస్ కంపెనీ జీనియస్ కన్సల్టెంట్స్ తాజా నివేదికలో తెలిపింది. అవసరాన్ని మించి ఉన్న ఉద్యోగులను తొలగించడానికి లేఆఫ్ బాట పడుతున్నట్టు 10% కంపెనీలు తెలిపాయి. 79% కంపెనీలు మాత్రం కొత్త టెక్నాలజీలు అలవరచుకునేలా తమ ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించాయి. పని తీరు సంతృప్తికరంగా లేని వారిపై అధిక పనిభారం వేసి వారు ఉద్యోగం వదులుకుని పోయేలా వ్యూహాన్ని తాము అనుసరిస్తున్నట్టు 6% కంపెనీలు తెలిపాయి. మొత్తం 1,223 కంపెనీలు, 1,069 మంది ఉద్యోగులను ఈ సర్వే సందర్భంగా ప్రశ్నించి నివేదిక రూపొందించారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఆధునిక టెక్నాలజీల వినియోగాన్ని పెంచి ఉద్యోగుల అవసరం కనిష్ఠ స్థాయికి తగ్గించుకోవాలనుకుంటున్నట్టు 39% యాజమాన్యాలు తెలిపాయి. అయితే 31% మంది మాత్రం ఆధునిక టెక్నాలజీలు ఉపయోగించుకుంటూనే సమాంతరంగా మానవ వనరులను వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపాయి.

కొత్త టెక్నాలజీల్లో 10 లక్షల ఉద్యోగాలు

క్వాంటమ్ కంప్యూటింగ్, జెనరేటివ్ ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ రంగాల్లో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని క్వెస్ ఐటీ స్టాఫింగ్ తాజా నివేదికలో అంచనా వేసింది. అదే కాలంలో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, బ్లాక్ చెయిన్ వంటి ఆధునిక టెక్నాలజీలు ఆర్థిక వ్యవస్థకు 15 వేల కోట్ల డాలర్ల (రూ.12.75 లక్షల కోట్లు) వాటాను అందిస్తాయని అంచనా వేసింది. 43.5 శాతం వాటాతో టెక్నాలజీ రంగంలో నియామకాలకు బెంగళూరు కేంద్ర స్థానంగా కొనసాగుతుందని కూడా తెలిపింది. 13.4 శాతం వాటాతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలుస్తుందని పేర్కొంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం 31-12-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

'మహో' కుంభమేళా!



ప్రపంచ స్థాయిలో నిర్వహణ.. 40 కోట్ల మంది వస్తారని అంచనా
లక్షా 60 వేలకుపైగా టెంట్లు.. లక్షా 50 వేల టాయిలెట్స్ నిర్మాణం
1,250 కిలో మీటర్ల పైపులైన్లు.. 4 వేల హెక్టార్లలో మేళా ఏర్పాట్లు
ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 2
జనవరి 13 నుంచి ప్రారంభం.. మకర సంక్రాంతి రోజు తొలిస్నానం



ఉగాది నుంచి ఉచితం

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం
ఉమ్మడి జిల్లా పరిధిలో నో టికెట్
మరో ఎన్నికల హామీ నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధత
ప్రతి నెలా రూ.265 కోట్ల భారం
ఆక్యుపెన్సీ 69% నుంచి 94 శాతానికి
సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో మరో హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. తెలుగు ప్రజల నూతన సంవత్సరం ఉగాది నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మహిళలు నెలలో ఎన్నిసార్లయినా,

మిగతా 11వ పేజీలో...

5,402 కొత్త పింఛన్లు


భర్త చనిపోతే... ఆ పెన్షన్ భార్యకు: మంత్రి కొండపల్లి 11
త్వరలో లక్ష ఇళ్లు అప్పగింత: మంత్రి పార్థసారథి

జలంతో జయం

గోదావరి-బనకచర్ల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి

కృష్ణా నదిలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో 4,114 టీఎంసీల వరద సముద్రంపాలవుతోంది. నదుల అనుసంధానంతో ఇందులో కనీసం కృష్ణాకు 200 టీఎంసీలను తరలించినా కరువు, వరదలను ఎదుర్కోవచ్చు.

బనకచర్లకు గోదావరి నీటిని తీసుకువెళ్లగలిగితే.. రాష్ట్రంలో అంతర్గతంగా నదుల అనుసంధానం పూర్తయినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చినట్లే!
- ముఖ్యమంత్రి చంద్రబాబు



పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నదుల అనుసంధాన ప్రక్రియను వివరిస్తున్న సీఎం చంద్రబాబు

3 ఏళ్లు.. 80,112 కోట్ల వ్యయం
తొలి దశలో రూ.13,511 కోట్లతో పోలవరం - ప్రకాశం బ్యారేజీకి జలాలు
అక్కడి నుంచి బొల్లాపల్లి వరకు
రెండో దశలో 150 టీఎంసీల ఎత్తిపోత
దీని అంచనా వ్యయం 28,560 కోట్లు
మూడో దశలో బనకచర్లకు తరలింపు
38,014 కోట్లతో రోజుకు 2 టీఎంసీలు
మొత్తంగా 368 కి.మీ. ప్రయాణం
పది లిఫ్టులతో నీరు ఎత్తిపోత
కేంద్రం, రాష్ట్రం, ప్రైవేటు భాగస్వామ్యంతో హైబ్రిడ్ పద్ధతిలో అమలు: ముఖ్యమంత్రి

రాయలసీమకు ఇది గేట్‌వే

పూర్తయితే రాష్ట్రానికే గేమ్‌చేంజర్
కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించా
3 నెలల్లో కేంద్రానికి ప్రతిపాదనలు
ఆమోదం లభిస్తే ఆ తర్వాత 2-3 నెలల్లో టెండర్లు

జాతీయ రహదారుల తరహాలో నీటి ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణ బాధ్యతలు కూడా ప్రైవేటు సంస్థలకే అప్పగిస్తాం. రైతులు, తాగునీరు, పారిశ్రామికావసరాల కోసం నీటిని స్వేచ్ఛగా వాడుకోవచ్చు. ఇందుకు ఎలాంటి సెస్సూ వసూలు చేయం.
- చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానంతో కరువును శాశ్వతంగా జయించి... రాష్ట్రానికి జల భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మూడేళ్లలో రూ.80,112 కోట్లతో గోదావరి-బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ అనుసంధానం పూర్తిచేసేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 'తెలుగు తల్లికి జలహారతి' పేరిట చేపట్టనున్న

మిగతా 11వ పేజీలో...

నేను బాగు చేయడం.. వాళ్లొచ్చి నాశనం చేయడం!

సీఎం చంద్రబాబు ఆవేదన
జగన్ లాంటి వాళ్లకు విశ్వసనీయత, నిలకడ ఉండవని వ్యాఖ్య


స్పేడెక్స్ ఉపగ్రహాలతో నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్

కక్ష్యలో కలుద్దాం!

స్పేస్ డాకింగ్ మిషన్‌లో తొలి ఘట్టం విజయవంతం

రోదసిలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు.. సత్తా చాటిన ఇస్రో
15.13 నిమిషాల్లోనే కక్ష్యలోకి చేర్చిన పీఎస్ఎల్వీ-సీ60
డాకింగ్ పూర్తయితే అమెరికా, రష్యా, చైనా సరసన భారత్!

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టి.. ఆపై వాటిని అనుసంధానం చేసే దిశగా చేపట్టిన ప్రయోగంలో తొలి ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. ఈ మిషన్‌లో భాగంగా ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లిన ఇస్రో విజయాశ్వం పీఎస్ఎల్వీ-సీ60.. వాటిని 476 కిలోమీటర్ల దూరంలోని వృత్తాకార భూ కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టింది. ఆ కక్ష్యలో విడివిడిగా తిరుగుతున్న ఈ ఉపగ్రహాలను కొద్దిరోజుల తర్వాత సంక్లిష్ట విన్యాసంతో ఇస్రో శాస్త్రవేత్తలు అనుసంధానం (డాకింగ్) చేయనున్నారు. అది విజయవంతమైతే.. ఇప్పటికే డాకింగ్ సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా చైనా సరసన భారత్ సగర్వంగా నిలుస్తుంది! 2



ఈ విజయం దేశానికి నూతన సంవత్సర కానుక. జంట ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశ పెట్టడం ఈ మిషన్‌లో తొలి భాగం. డాకింగ్ ప్రక్రియకు మరో వారం పడుతుంది. జనవరి 7న జరిగే అవకాశం ఉంది. మన సొంత అంతరిక్ష కేంద్ర నిర్మాణంలో ఇదో మైలురాయి.
- సోమనాథ్, చైర్మన్, ఇస్రో


పవన్ కల్యాణ్‌తో జయమంగళ వెంకటరమణ, చిత్రంలో సామినేని ఉదయభాను

గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు

తొక్కిసలాట ఘటన బాధాకరం

అల్లు అర్జున్ తరఫున వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించాల్సింది
క్షమాపణలు చెబితే బాగుండేది.. సమస్య పెద్దది అయ్యేది కాదు
రేవంత్‌రెడ్డి కక్షసాధింపులకు పోలేదు.. ఎవరున్నా అలాగే చేసుండేవారు
సమస్య పరిష్కారంలో సినిమా టీమ్ ఫెయిల్.. హీరోను ఒంటరిని చేశారు
సంధ్యా థియేటర్ ఘటనపై మీడియాతో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ వద్ద పుష్ప-2 బెనిఫిట్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్టుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిసారి స్పందించారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ సమానమేనని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే అల్లు అర్జున్ తరఫున బాధిత కుటుంబం వద్దకు వెళ్లి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వైసీపీ విధానాల తరహాలో వ్యవహరించలేదన్నారు. రేవంత్ రెడ్డి గట్టి నాయకుడని, కిందిస్థాయి నుంచి ఎదిగారని ప్రశంసించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. "అల్లు అర్జున్ థియేటర్‌కు వెళ్లే ముందు తగిన ఏర్పాట్లు చేసుకుని ఉండాల్సింది. హీరో అభివాదం చేయకపోతే పొగరని అనుకుంటారు. అభివాదం చేయడం

మిగతా 12వ పేజీలో...

ఇక నెలలో 14 రోజులు జనంలోనే..

కార్యాలయంలో కూర్చుంటే సమస్యలు తెలియవు
తనిఖీలు చేసి తిరిగొచ్చేస్తే పెద్ద ఫలితం ఉండదు
అందుకే జిల్లాల పర్యటనకు సిద్ధమవుతున్నా 12
జనసేనలో పనితీరే ప్రామాణికంగా పదవులు
నాకు బంధుప్రీతి ఉంటే నాగబాబుకు మొదట్లోనే పదవి
ప్రస్తుతానికి ఎమ్మెల్సీ చేస్తాం..
మా పాలన సంతృప్తికరం
మీడియాతో పవన్ చిట్‌చాట్

జనసేనలోకి జయమంగళ

గంజి చిరంజీవి దంపతులు కూడా.. పవన్‌కల్యాణ్ సమక్షంలో చేరిక 11

పతనం నుంచి పునరుత్థానం

చరిత్రలో నిలిచిపోయేలా 2024 ప్రజాతీర్పు

విర్రవీగిన వైసీపీకి కోలుకోలేని దెబ్బ
విధ్వంస పాలనకు చరమగీతం
కూటమి రాకతో అభివృద్ధికి రాచబాట
నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు
సీఎం కృషితో పుంజుకున్న రాజధాని పనులు
పోలవరం నిర్మాణానికి కేంద్రం నిధులు
భారీ పెట్టుబడులతో తరలి వస్తున్న పరిశ్రమలు
ఆరు నెలల్లోనే స్పష్టంగా కనిపిస్తున్న మార్పు



2024 నవ్యాంధ్ర చరిత్రలో చిరకాలం నిలిచిపోతుంది. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో విసుగెత్తి పోయిన ప్రజలు 2024లోనే తిరుగులేని తీర్పిచ్చారు. మాకు ఎదురేలేదు అని విర్రవీగిన పాలకులకు ప్రతిపక్షంలో కూడా కూర్చునే అవకాశం కూడా ఇవ్వలేదు. ప్రజలు దాదాపు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పు.. ఆంధ్రప్రదేశ్‌లో నవశకానికి నాంది పలికింది. వైసీపీ అరాచకాలతో అథఃపాతాళానికి పడిపోయిన రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ చొరవతో మళ్లీ ఊపందుకుంటోంది. ఐదేళ్ల పతనం తర్వాత పునరుత్థానం దిశగా నవ్యాంధ్ర పయనం ప్రారంభించింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
2019లో సీఎం పీఠాన్ని అధిరోహించిన జగన్.. ప్రజావేదిక కూల్చివేతతో తన విధ్వంసక పాలన ప్రారంభించారు. మూడు రాజధానులు అంటూ అమరావతి నిర్మాణాన్ని నిలిపేశారు. ఐదేళ్ల పాటు రాజధాని పేరు చెప్పుకోలేని పరిస్థితి కల్పించారు. ఉన్న పరిశ్రమలను వెళ్లగొట్టారు. వచ్చే వాటిని అడ్డుకున్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, కొత్త పెట్టుబడులు నిలిచిపోయాయి. దీంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. నిరుద్యోగులు పెరిగిపోయారు. చదువుకున్న యువత ఉపాధి వెతుక్కుంటూ పొరుగురాష్ట్రాలకు వలస వెళ్లిపోయింది. ఉద్యోగులకు

మిగతా 7వ పేజీలో...

రాష్ట్రానికి కొత్తగా 9 భారీ ప్రాజెక్టులు

మరో 1.82 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు
2.63 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం 11
చంద్రబాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ
సకాలంలో ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశం
మరింతగా పెట్టుబడులను ఆకర్షించాలని నిర్దేశం

గిరిజన గూడేలకు మెరుగైన రోడ్లు

కూటమి ప్రభుత్వ ఆర్నెల్లలో 750 కోట్ల మేర నిర్మాణ పనులు
ఐదేళ్ల వైసీపీ హయాంలో చేసింది రూ.91 కోట్ల పనులే 2

ఫిబ్రవరి 1 నుంచి భూమి రిజిస్ట్రేషన్ విలువ పెంపు



సగటున 15 నుంచి 20 శాతం వరకు..
గ్రోత్ సెంటర్ల ఆధారంగా ఖరారు
జగన్ జమానాలో రిజిస్ట్రేషన్లలో అరాచకం
భూమివిలువను మించిన రిజిస్ట్రేషన్ విలువ
అలాంటిచోట తగ్గిస్తాం.. చరిత్రలోనే తొలిసారి
రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి
రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖపై సమీక్ష

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూమి రిజిస్ట్రేషన్ విలువలు పెరుగుతాయని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఏయే ప్రాంతాల్లో ఎంతెంత పెంచాలి, ఎక్కడ తగ్గించాలి అనే అంశాలపై పూర్తి నివేదికను జనవరి 15వ తేదీ కల్లా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖపై తాడేపల్లిలోని కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల భారం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, అయితే రాష్ట్రానికి రెవెన్యూ కూడా

మిగతా 2వ పేజీలో...


2

జిమ్మీ కార్టర్ కన్నుమూత

1977-81 మధ్య అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు
100 ఏళ్ల వయసులో తుదిశ్వాస

నదిలో పడిన ట్రక్కు.. 71 మంది మృతి

ఇథియోపియాలో ఘోర ప్రమాదం 2

ఎన్నికల్లో పోటీకి సాయం చేయండి

ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ ప్రారంభించిన ఆప్ నేత సిసోడియా

మిగిలేది 'కిక్కే'!

మద్యం విక్రయాలతో ఆదాయం తక్కువే
జగన్ జమానాలో మందుబాబుల జేబులు ఖాళీ
నిషేధం పేరిట ఆ ఐదేళ్లూ మోసం.. తక్కువ అమ్మినా అధిక ఆదాయం
కూటమి కొత్త పాలసీతో సీన్ రివర్స్.. విక్రయాలకు తగ్గట్టు లేని లెక్కలు
రూ.99కే మద్యం, ధరలు తగ్గింపుతో ఖజానాకు తగ్గిన రాబడి



(అమరావతి - ఆంధ్రజ్యోతి)
మద్యం ధరలు షాక్ కొట్టే స్థాయిలో పెంచుతామన్న గత సీఎం జగన్ అన్నట్టుగానే మందుబాబుల జేబులు ఖాళీ చేశారు. నచ్చినట్టుగా మద్యం ధరలు పెంచి వినియోగదారులను దోపిడీ చేశారు. మందు అలవాటున్న రోజుకూలీల కూలి మొత్తం మద్యానికే లాగేశారు. అయితే అదంతా మద్యపాన నిషేధంలో భాగం అని మొదట్లో కలరింగ్ ఇచ్చినా చివరికి నిషేధం లేదని తేల్చేశారు. అయితే, కూటమి ప్రభుత్వంలో సీన్ రివర్స్ అయ్యింది. పెంచిన మద్యం ధరలను తగ్గించి, నాణ్యమైన మద్యం అందుబాటులోకి

మిగతా 12వ పేజీలో...



ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం

» ట్రక్కు అదుపుతప్పి నదిలో పడటంతో 71 మంది మృతి

అడిస్ అబాబా, డిసెంబరు 30: ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి నదిలోకి దూసుకెళ్లడంతో కనీసం 71 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బోనా జిల్లాలో జరిగింది. ఆదివారం సాయంత్రం సిదామా ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న ట్రక్కు అదపు తప్పి రోడ్డు మీద నుంచి నదిలో పడింది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెప్పారు. మృతుల్లో 68 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు తెలిపారు. మరణించిన వారిలో కొందరు ఓ పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం.

అనుమతి లేకుండా నా ఆడియో ఎలా రికార్డు చేస్తారు



» ఇంత దిగజారుతారనుకోలేదు: ఖుష్బూ

చెన్నై, డిసెంబరు 30: తన అనుమతి తీసుకోకుండా తాను మాట్లాడిన విషయాన్ని ఏవిధంగా రికార్డు చేస్తారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఫోన్‌లో చెప్పిన మాటలు వాస్తవమేనని, అయినప్పటికీ ఫోన్ సంభాషణను రికార్డు చేయడం సరికాదన్నారు. తమిళనాడులో జరుగుతున్న పరిణామాలపై స్పందించమని కోరుతూ ఇటీవల ఓ స్థానిక మీడియా సంస్థ ఫోన్ కాల్‌లో ఆమెను సంప్రదించగా.. ఆమె తమిళనాడు బీజేపీ తనను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ ఆడియో రికార్డును సదరు మీడియా సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. దీనిపై తాజాగా ఖుష్బూ స్పందించారు. "నా అనుమతి తీసుకోకుండా ఈవిధంగా నా వాయిస్ ఎలా రికార్డు చేస్తారు? మరి ఇంత దిగజారుతారని అనుకోలేదు. కానీ, నేను నిజమే చెప్పా. బీజేపీ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానించరు. కానీ, నేనేమీ పార్టీ మారడం లేదు" అని ఖుష్బూ పేర్కొన్నారు.

ఎన్నికల్లో పోటీకి ఆర్థిక సాయం చేయరూ

ప్రజలకు సిసోడియా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 30: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆప్ సీనియర్ నేత సిసోడియా ప్రజలకు వినూత్న విజ్ఞప్తి చేశారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు. ఆర్థిక సహాయం అందించేందుకుగాను ఒక ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం పట్పర్‌గంజ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సిసోడియా.. ఈసారి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎన్నికల కోసం ప్రజల నుంచి ఆర్థిక సహాయం కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. మీడియా సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ.. "మీరు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయి ఢిల్లీలో విద్య తదితరాల పురోగతికి దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. కాగా, సిసోడియాకు విరాళాలు కోరుతూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు.

గిరిజన గూడేలకు మెరుగైన రోడ్లు

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక బలహీన గిరిజన సమూహాల(పీవీటీజీ) నివాసిత ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించడంలో ఆర్నెలల్లోనే కూటమి ప్రభుత్వం అద్భుత విజయాలు సాధించింది. గత వైసీపీ సర్కారు 2019-24 మధ్య పీవీటీజీ ప్రాంతాల్లో రోడ్లకు కేవలం రూ.91కోట్లు ఖర్చు పెడితే... సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కార్ ఆర్నెలల్లోనే రూ.750 కోట్ల పనులు చేపట్టింది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పీఎంజీఎస్‌వై కింద రూ.69 కోట్లు, ఏఐబీ ద్వారా రూ.22 కోట్ల పనులు చేయగా.. ఈ ఆర్నెల్లలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పీఎం జన్‌మాన్ నిధులతో రూ.550 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద రూ.150 కోట్లు, డోలీ మోతల నివారణకు రోడ్డు కనెక్టివిటీ కోసం రూ.49 కోట్లతో కలిపి మొత్తం రూ.750 కోట్లు ఖర్చు చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ ఏజెన్సీ ప్రాంతాల్లో మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఫిబ్రవరి 1 నుంచి భూమి రిజిస్ట్రేషన్ విలువ పెంపు

(మొదటి పేజీ తరువాయి)


అవసరమన్నారు. అందువల్లే రిజిస్ట్రేషన్ విలువలు పెంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. గ్రోత్ కారిడార్లు, భూమి రేట్లు బాగా పెరిగిన ప్రాంతాల్లో మాత్రమే పెంపుదల ఉంటుందన్నారు. "గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువల పెంపును శాస్త్రీయ పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా చేసుకుంటూ వెళ్లింది. దీంతో చాలా చోట్ల భూమి విలువ కంటే రిజిస్ట్రేషన్ విలువ అధికంగా ఉందని మా పరిశీలనలో తేలింది. అటువంటి చోట్ల రిజిస్ట్రేషన్ విలువలను తగ్గిస్తాం. ఇలా విలువలు తగ్గించడం చరిత్రలో ఇదే మొదటిసారి అవుతుంది. విలువలు పెరిగే చోట సగటున 15 శాతం నుంచి 20 శాతం వరకు పెంపుదల ఉంటుంది" అని మంత్రి వివరించారు.

రెవెన్యూలోనే ఫిర్యాదులు అధికం

రాష్ట్రంలో వస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూశాఖలోనే వస్తుండగా, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖలో 10 శాతం వరకు గ్రీవెన్స్ వస్తున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వీటన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతేడాదితో పోల్చితే గత ఆరు నెలల్లో సెప్టెంబరును మినహాయిస్తే మిగిలిన అన్ని నెలల్లోనూ అదనపు ఆదాయమే వచ్చిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పెట్టుకున్న పెట్టుకున్న రూ. 9,500 కోట్ల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదిస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. "గత ప్రభుత్వంలో జగన్ తన స్వార్థం కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారాలను చాలా ఇబ్బందులు పెట్టారు. కానీ మేం వారితో స్నేహపూర్వకంగా ఉంటూ సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. భూ వివాదాలను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం. ఇప్పటికి లక్షా 70 వేల ఫిర్యాదులు రాగా, 11 వేల ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించాం" అని మంత్రి తెలిపారు.

తగ్గిన ఆదాయం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖకు ఆదాయం తగ్గింది. సమావేశంలో ఆ శాఖ అధికారులు నెలవారీ ఆదాయ గణాంకాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారిచ్చిన వివరాలను అనుసరించి.. గత ఆర్థిక సంవత్సరంలో శాఖకు రూ.9,546 కోట్లు ఆదాయం వచ్చింది. 21,91,770 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుపుకొన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 26 వరకు రూ.6,156 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే ఆదాయం తగ్గింది. నిజానికి, ఈ ఏడాది రూ. 13,500 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. తొమ్మిది నెలలు పూర్తయినప్పటికీ అందులో సగం ఆదాయం కూడా సాధించలేకపోయారు. ఆగస్టు నెలలో రూ. 850 కోట్లు రాబడి వచ్చింది. సెప్టెంబరులో అతి తక్కువగా రూ. 570 కోట్లు మాత్రమే వచ్చింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.6,874 కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది అదే సమయంలో రూ.6,156 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చింది. జిల్లాల వారీగా అత్యధికంగా విశాఖ పరిధిలో రూ.1,085 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ తర్వాత వరుసగా విజయవాడ పరిధిలో రూ.876కోట్లు, గుంటూరు పరిధిలో రూ.829 కోట్ల ఆదాయం లభించింది. అత్యల్పంగా మన్యం పరిధిలో రూ.27.19 కోట్ల ఆదాయం వచ్చింది.



రాకెట్ మూడో దశ; రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం



కక్ష్యలో కలుద్దాం!

స్పేస్ డాకింగ్ మిషన్‌లో తొలి ఘట్టం విజయవంతం

సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో కీలకమైన 'స్పేస్ డాకింగ్' ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. స్పేస్ డాకింగ్ కోసం భారత అంతరిక్ష పరిశోధనల కేంద్రం ఇస్రో చేపట్టిన జంట ఉపగ్రహాల ప్రయోగం (స్పేడెక్స్)లో తొలి అడుగు ఘనంగా పడింది. ఈ మిషన్‌లో భాగంగా చేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్.. వాటిని జాగ్రత్తగా నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. వాస్తవానికి ఈ ప్రయోగాన్ని సోమవారం రాత్రి 9.58 గంటలకు నిర్వహించాల్సి ఉంది. కానీ.. అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ కారణంగా రెండు నిమిషాలు ఆలస్యంగా నిర్వహించారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 10:15 గంటలకు నింగిలోకి ఎగిరిన రాకెట్.. నిర్ణీత షెడ్యూలు ప్రకారం తొలి ఉపగ్రహాన్ని 15.10 నిమిషాలకు, రెండో ఉపగ్రహాన్ని 15.13 నిమిషాలకు భూమికి 476 కిలోమీటర్ల ఎత్తున, వృత్తాకార కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టింది. దీంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ స్పేడెక్స్ మిషన్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇక ఈ ప్రయోగంలో అసలు సిసలైన ఘట్టం.. డాకింగ్ (రెండు ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ) మిగిలి ఉంది. చందమామపైకి మన వ్యోమగాములను పంపి, అక్కడి మట్టి ఇక్కడికి తీసుకురావాలన్నా, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించుకోవాలన్నా.. ఇలా భవిష్యత్తులో చేపట్టబోయే పలు కీలక ప్రయోగాలకు అత్యంత కీలకమైనది డాకింగ్ పరిజ్ఞానం. ప్రస్తుతానికి అమెరికా, రష్యా, చైనా అంతరిక్ష పరిశోధనల సంస్థల వద్ద మాత్రమే ఈ పరిజ్ఞానం ఉంది.

అనేక ప్రయోగాలకు నాంది..

పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ మోసుకెళ్లిన రెండు ఉపగ్రహాల్లో ఒకటి.. ఎస్‌డీఎక్స్01 (చేజర్) కాగా, మరొకటి ఎస్‌డీఎక్స్02 (టార్గెట్). ఒక్కో దాని బరువు సుమారు 220 కేజీలు. ఈ ఉపగ్రహాలతోపాటు.. పీఎస్ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్) ద్వారా మరో 24 పేలోడ్లను కూడా ఇస్రో రోదసిలోకి పంపింది. ఆ పేలోడ్ల ద్వారా అనేక ప్రయోగాలు చేపట్టేందుకు ఇస్రో ప్రణాళికలు రచించింది.

జనవరిలో మరిన్ని..

వచ్చే ఏడాది జనవరిలో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. పీఎస్ఎల్వీ రాకెట్ నావిగేషన్ రెండో సిరీస్‌లో ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని పంపనున్నామని వెల్లడించారు. జనవరి మూడో వారంలో జీఎస్ఎల్వీ-ఎఫ్15 ప్రయోగం ఉంటుందన్నారు. ఇది కాకుండా.. గగన్‌యాన్-జీ1 ద్వారా మావనరహిత ప్రయోగం ఉంటుందని చెప్పారు. 2025లో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని తెలిపారు. పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోమవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆయన దర్శించుకొన్నారు. పూజలు చేశారు. అంతకు ముందు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో ఇస్రో అధికారులు పీఎస్ఎల్వీ-సీ60 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారత్‌కు ప్రయోజనం ఏమిటి..?

అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే లక్ష్యంతో భారత్ గగన్‌యాన్ ప్రాజెక్టు చేపట్టనుంది. చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి వాటిని భూమి మీదకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2035 నాటికి సొంతంగా అతరిక్ష కేంద్రాన్ని నిర్మించే దిశగా ముందుకు సాగుతోంది. అయితే అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి అవసరమైన వాటిని ఒకేసారి రాకెట్‌లో తరలించడం కుదరదు. కాబట్టి వాటిని విడతలవారీగా కక్ష్యలోకి చేర్చి వాటిని డాకింగ్ ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంటుంది. అంత ర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్ఎస్) ఇలాగే ఏర్పాటు చేశారు. స్పేస్ స్టేషన్లకు వ్యోమగాములను, వస్తువులను తీసుకెళ్లే వ్యోమనౌకలను సైతం డాకింగ్ ద్వారానే అనుసంధానం చేస్తారు. అలాగే కక్ష్యలోని ఉపగ్రహాలకు మరమ్మతులు చేపట్టాలన్నా, ఇంధనం నింపాలన్నా, వాటిని ఆధునీకరించాలన్నా.. డాకింగ్ వ్యవస్థ ఉపయోగపడుతుంది.

ఏమిటీ స్పేస్ డాకింగ్?

ఇల్లు కట్టాలంటే ఇటుకా ఇటుకా పేర్చాల్సిందే! అదే అంతరిక్షంలో అలా ఒక నిర్మాణాన్ని చేపట్టాలంటే? వ్యోమనౌకలను ఒకదానికొకటి అనుసంధానం చేయడం ద్వారా అంతరిక్ష కేంద్రం వంటి నిర్మాణాలను రూపొందించవచ్చు. దీన్నే స్పేస్ డాకింగ్ అంటారు. గంటకు వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వ్యోమనౌకలు.. వాటి వేగాన్ని నియంత్రించుకుంటూ, సమాచారాన్ని పంచుకుంటూ, దగ్గరైన తర్వాత సున్నితంగా అనుసంధానం కావాల్సి ఉంటుంది. కాబట్టి ఇది సాంకేతికంగా సంక్లిష్టమైన ప్రక్రియ. పైగా ఉపగ్రహాల పరిమాణం చిన్నగా ఉండడం సవాలుగా మారనుంది. ఏ మాత్రం తేడా వచ్చినా ఉపగ్రహాలు పరస్పరం ఢీకొనే ప్రమాదం ఉంది.

లక్ష్యం పూర్తికాగానే అన్‌డాకింగ్..

డాకింగ్‌కు సంబంధించిన ప్రయోగాలు పూర్తికాగానే ఈ రెండు ఉపగ్రహాలు విడిపోతాయి. దీన్నే అన్‌డాకింగ్ అంటారు. విడిపోయిన తర్వాత అవి సాధారణ ఉపగ్రహాల మాదిరిగానే పరిశోధనలు సాగిస్తాయి. ఎస్‌డీఎక్స్01లోని హై రిజల్యూషన్ కెమెరా భూ పరిశీలనలకు ఉపయోగపడుతుంది. ఎస్‌డీఎక్స్02లోని మినయేచర్ మల్టీ స్పెక్ట్రల్ పరికరం సహజ వనరుల పర్యవేక్షణ, పచ్చదనంపై అధ్యయనం చేస్తుంది. రేడియేషన్ మానిటర్ పేలోడ్ అంతరిక్షంలో ఎదురయ్యే రేడియో ధార్మికతను కొలుస్తుంది. కాగా, ఈ ఉపగ్రహాల జీవితకాలం రెండేళ్లు.

మస్క్ ఉపగ్రహాల వల్ల ఆలస్యం

ఇస్రో ఈ ప్రయోగాన్ని సోమవారం రాత్రి 9:58 గంటలకు చేపట్టాలని నిర్ణయించింది. కానీ.. స్పేస్ ఎక్స్ చీఫ్, అమెరికన్ కుబేరుడు ఈలన్ మస్క్‌కు చెందిన 'స్టార్ లింక్' ఉపగ్రహాలు కొన్ని అదే సమయానికి ఆ దారిలో వస్తాయని గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని 2.15 నిమిషాలపాటు వాయిదా వేశారు. "అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాకెట్ వెళ్లాల్సిన కక్ష్యలో ఆ సమయానికి ఇతర ఉపగ్రహాల గమనం కారణంగా ప్రయోగాన్ని వాయిదా వేశాం. ప్రయోగాన్ని రాత్రి 9:58 గంటలకు బదులుగా 10 గంటలా 15 సెకన్లకు రీ షెడ్యూల్ చేశాం' అని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు. కాగా.. అంతరిక్షంలో ట్రాఫిక్ కారణంగా రాకెట్ ప్రయోగాన్ని వాయిదా వేయడం ఇదే తొలిసారి కాదు. 2023లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని కూడా ఇలాగే కొన్ని నిమిషాలపాటు వాయిదా వేయాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.

లోకం తీరు



హెజ్‌బొల్లాను ముంచిన కమాండర్ పెళ్లిళ్ల లొల్లి!

బీరుట్, డిసెంబరు 30: హెజ్‌బొల్లా సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఫాద్ షుక్ర్.. పెళ్లిళ్ల గోల చివరకు ఆ సంస్థ పతనానికే దారి తీసింది. ఏళ్లుగా అండర్‌గ్రౌండ్‌లోనే తలదాచుకున్న అతడు.. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా నలుగురు మహిళలను పెళ్లి చేసుకోవాలని తలంచి ఆ ప్రయత్నంలోనే ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ చేతిలో హతమయ్యాడు. ఇది జరిగిన కొద్ది వారాల వ్యవధిలోనే హెజ్‌బొల్లా కీలక నేతలను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. 1983లో లెబనాన్‌లోని బీరుట్‌లో అమెరికన్ మెరైన్ బ్యారక్‌లపై దాడులు చేసి 238 అమెరికన్ సైనికులను చంపిన ఘటన వెనకాల వ్యూహకర్తల్లో షుక్ర్ ఒకడు.. 1985లో టీడబ్ల్యూఏ ఫ్లైట్ హైజాక్‌లోనూ అతడిది కీలక పాత్ర.. ఆ తర్వాత రెండు దశాబ్దాల పాటు ఎవరికీ కనిపించకుండా అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలోనే నలుగురు మహిళలతో ఏకకాలంలో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నాడు. 2024 వరకు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే తాను చేసింది తప్పన్న భావన అతడిని వెంటాడింది. దీంతో హెజ్‌బొల్లాలో అత్యున్నత మత గురువైన హషీమ్ సఫీద్దీన్ సంప్రదించి జరిగిందంతా చెప్పుకొన్నాడు. ఆ నలుగురిని పెళ్లి చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చని.. ఈ తతాంగమంతా ఫోన్‌లోనే జరిగిపోవాలని సఫీద్దీన్ సలహా ఇచ్చాడు. ఆ నలుగురు మహిళలు ఎక్కడెక్కడో ఉన్నా గానీ ఫోన్ కాల్స్‌లోనే పెళ్లిళ్లు జరిపించాడు. మరోవైపు.. 2006 నుంచే షుక్ర్ కోసం వెతుకుతున్న మొస్సాద్‌కు ఈ విషయం తెలిసింది. ఈ క్రమంలోనే బీరుట్‌లోని ఓ పాత భవనంలో అతడు ఉన్నట్లు గుర్తించింది. జూలై 30వ తేదీన పక్కా ప్లాన్‌తో ఓ వ్యక్తి నుంచి అతడికి ఫోన్ చేయించి భవనం పై అంతస్తుకు రప్పించి.. క్షిపణితో దాడి చేసింది. ఈ దాడిలో షుక్ర్‌తో పాటు అతడి భార్య, ఇద్దరు చిన్నారులు మరణించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా బాంబు దాడిలో చనిపోయాడు.

హైకోర్టు జడ్జీలుగా కుటుంబ సభ్యులు వద్దు

» సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 30: హైకోర్టు న్యాయమూర్తుల నియామకం విషయమై సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయాలు తీసుకొంది. ప్రస్తుత/పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు/హైకోర్టు న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లను సిఫార్సు చేయకుండా నిలుపుదల చేయాలని నిర్ణయించింది. కేవలం హైకోర్టు కొలీజియంలు చేసిన సిఫార్సులపైనే ఆధారపడకుండా అభ్యర్థులకు సంబంధించి సొంతంగా వివరాలు సేకరించనుంది. హైకోర్టు న్యాయమూర్తులుగా జడ్జీల బంధువులనే నియమిస్తున్నారంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకొంది. హైకోర్టు న్యాయమూర్తుల్లో 50% మంది ప్రస్తుత/మాజీ జడ్జీలకు బంధువులేనన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బంధువుల పేర్లను సిఫార్సు చేయకుండా విరామం ఇవ్వాలని కొలీజియం ప్రతిపాదించింది. న్యాయవాదవృత్తిలో చేరిన తొలితరం లాయర్లకు ప్రాతినిధ్యం ఇవ్వాలని నిర్ణయించింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ద్వంద్వ ప్రయోజనాలు పొందలేరు

» ప్రమోషన్ల విధానంపై సుప్రీం స్పష్టత

న్యూఢిల్లీ, డిసెంబరు 30: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల విషయమై సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ప్రమోషన్లు, అధిక జీత భత్యాల కోసం అమలయిన రెండు పథకాల కింద ఉద్యోగులు ప్రయోజనం పొందలేరని తేల్చి చెప్పింది. ఒక వేళ అలా లబ్ధి పొందిన ఉద్యోగులు ఉంటే వారి నుంచి అదనంగా పొందిన సొమ్మును తిరిగి వసూలు చేయాలని ఆదేశించింది. పదోన్నతులు కల్పించేందుకు 1999 ఆగస్టు 9 నుంచి 2008 ఆగస్టు 8 వరకు అస్యూర్డ్ కెరీర్ ప్రోగ్రెసెన్ స్కీం (ఏసీపీఎస్) అమలయింది. 2008లో మోడిఫైడ్ అస్యూర్డ్ కెరీర్ ప్రోగ్రెసెన్ స్కీం (ఎంఏసీపీఎస్) అమల్లోకి తెచ్చారు. ఎంఏసీపీఎస్ పాతతేదీ(2006) నుంచి వర్తింపజేయడంతో కొందరు రెండు విధానాల కింద లబ్ధి పొందారు.

'మహో' కుంభమేళా!

» ప్రపంచస్థాయిలో నిర్వహణ

» 40 కోట్ల మంది వస్తారని అంచనా

మహాకుంభ్‌నగర్, డిసెంబరు 30: పరమ పవిత్ర గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద జనవరి 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాకుంభ మేళాకు సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచస్థాయి మహా పర్వంగా ఈ కుంభమేళాను నిర్వహించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. గత రెండు మాసాలుగా రేయింబవళ్లు కార్మికులు ఇక్కడి పనుల్లో నిమగ్నమయ్యారు. దేశవ్యాప్తంగానే కాకుండా పలు ప్రపంచ దేశాల నుంచి కూడా భక్తులు వస్తారన్న అంచనాలతో ఏర్పాట్లను కూడా అదే స్థాయిలో చేస్తున్నారు. రహదారుల వెడల్పు నుంచి సంగమ ఘాట్ల సుందరీకరణ వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా మహా కుంభమేళా నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకం భావిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన 'మన్‌కీ బాత్'లో మహాకుంభ మేళాను.. 'ఐక్యతా మహాకుంభ్'గా అభివర్ణించిన విషయం తెలిసిందే. "ద్వేషం, విభజన వాదాలను పరిత్యజించాలనే దృఢ సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఐక్యతా మహాకుంభ్‌కు తరలి రావాలి" అని మోదీ పిలుపునిచ్చారు. "మహాకుంభ్ సందేశం.. యావత్ దేశాన్నీ ఐక్యంగా ఉంచడమే" అని తేల్చి చెప్పారు. కాగా, మహాకుంభ మేళాకు ప్రస్తుతం ఏర్పాట్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. జనవరి 10వ తేదీనాటికి పూర్తిచేయాలన్న లక్ష్యంతో వడివడిగా పనులు చేస్తున్నట్టు మేళా అధికారి విజయ్‌కిరణ్ ఆనంద్ తెలిపారు. కాగా, ఆక్రమణలు, కోత కారణంగా సంగమం వద్ద గంగా నది 200 నుంచి 500 మీటర్ల వరకు తగ్గిపోయిందని చెప్పారు. ఇదిలావుంటే, 2024 ప్రారంభంలో అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లను మించి మహాకుంభ మేళాకు ఇప్పుడు ఏర్పాట్లు జరుగుతుండడం గమనార్హం. 2019లో కుంభమేళాకు చేసిన ఏర్పాట్ల కంటే రెట్టింపు ఏర్పాట్లను చేస్తున్నారు.

ప్రపంచంలోనే పెద్దది

మతపరమైన కార్యక్రమాల్లో మహాకుంభమేళా ప్రపంచంలో అతి పెద్దదని అధికారులు చెబుతున్నారు. యూపీ ప్రభుత్వ అంచనాల మేరకు సుమారు 40 కోట్ల మంది భక్తులు పవిత్ర సంగమంలో స్నానం చేయనున్నారు. దీనికి తగిన విధంగానే ఏర్పాట్లు కూడా సాగుతున్నాయి.

ఎప్పటి నుంచి ఎప్పటి వరకు?

మహాకుంభమేళా పుష్య పౌర్ణమి తిథినాడు.. అంటే జనవరి 13న ప్రారంభం కానుంది. ఏకంగా 45 రోజుల పాటు కొనసాగిన తర్వాత మహాశివ రాత్రి అంటే ఫిబ్రవరి 26న ముగియనుంది. తొలి పవిత్ర స్నానాలు మకర సంక్రాంతినాడు ప్రారంభంకానున్నాయి. కాగా, మహాకుంభమేళాలో రాయ్‌బరేలీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అధికారులు, సిబ్బంది వైద్య సేవలు అందించనున్నారు.

హరిత-ఆహ్లాద మేళా!

మహాకుంభమేళాను హరిత మేళాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటు చూసినా పచ్చని చెట్లు, నవ్వులు విరబూసినట్టుగా ఉండే పూల మొక్కలతో సంగమ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తంగా 3 లక్షల మొక్కలను ఇక్కడ నాటుతున్నారు. అదేవిధంగా 12 కిలో మీటర్ల మేర అతిపెద్ద ఘాట్‌ను నిర్మిస్తున్నారు. అదేవిధంగా మేళాకు వచ్చే భక్తుల మనసులు దోచుకునేలా సంగమ ప్రాంతంలోని లక్షా 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రామాయణ, మహాభారతాల్లోని పలు అంశాలతో కూడిన కుడ్య చిత్రాలు, తైలవర్ణ చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు స్వాగతాలు పలికే చిత్రాలు కూడా మనసును దోచుకునేలా చిత్రీకరిస్తున్నారు.

అంకెల్లో ఏర్పాట్లు!

టెంట్లు: 1,60,000, టాయిలెట్లు: 1,50,000
పైపులైన్లు: 1,250 కి.మీ.
ఎల్‌ఈడీ లైట్లు: 67,000
సౌర దీపాలు: 2,000
దీప స్తంభాలు: 84, బస్టాండ్లు: 7
మేళా జరిగే విస్తీర్ణం: 4,000 హెక్టార్లు
శానిటేషన్ కార్మికులు: 15,000
నవీకరించిన రహదారులు: 90
తాగునీటి కనెక్షన్లు: 50,000
తాగు నీటి ఏటీఎంలు: 200
'గంగా సేవ' వలంటీర్లు: 150
పార్కింగ్ ప్రాంతాలు: 101
పార్కింగ్ ఏరియా: 1897 హెక్టార్లు

భద్రత కట్టుదిట్టం

మహాకుంభమేళాకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. మొత్తంగా ఏడంచల్లో భద్రతా ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీసులు 13 తాత్కాలిక పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం స్టేషన్ల సంఖ్య 57కు చేరింది. మహాకుంభమేళా జరిగే జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలు సహా విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్ల వద్ద 23 తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాయుధ కానిస్టేబుళ్లు, 4 జాతీయ విపత్తు స్పందనా దళాలను, 21 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. ఒక్క రాష్ట్ర పోలీసులే 10 వేల మంది భద్రతా విధుల్లో ఉండనున్నారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు కార్టర్ మృతి

100 ఏళ్ల వయస్సులో తుది శ్వాస



వాషింగ్టన్, న్యూఢిల్లీ, డిసెంబరు 30: అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్(100) అమెరికాలో జార్జియా రాష్ట్రంలోని ఆయన స్వస్థలం ప్లెయిన్స్ పట్టణంలో ఆదివారం తుది శ్వాస విడిచారు. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన వారిలో నిండు నూరేళ్లు పూర్తి చేసుకొన్నది ఆయనే. 1977-81 మధ్య అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన కార్టర్ ఆ సమయంలో భారత పర్యటనకు వచ్చారు. అప్పుడు హరియాణా రాష్ట్రంలో ఆయన సందర్శించిన గ్రామానికి ఆయన పేరు(కార్టర్ పురి) పెట్టడం విశేషం. ఆయన మృతితో ప్రపంచం, అమెరికా ఒక అసాధారణ నాయకుడిని, రాజనీతిజ్ఞుడిని కోల్పోయాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. ప్రధాని మోదీ కార్టర్ మృతికి సంతాపం తెలియజేస్తూ.. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రపంచ శాంతికి విరామం లేకుండా కృషి చేశారని పేర్కొన్నారు. కార్టర్‌ను భారత స్నేహితుడిగా పరిగణిస్తారు. అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) ఎత్తివేశాక మన దేశానికి వచ్చిన తొలి అమెరికన్ అధ్యక్షుడు ఆయనే. అప్పుడు జనతా పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రంలో అధికారంలో ఉంది. తన పర్యటనలో కార్టర్ మన పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తూ... నిరంకుశ పాలన భారత్‌కు సరిపడదన్నారు. భారత్, అమెరికాల మధ్య స్నేహ సంబంధాలు బలపడడానికి కార్టర్ హయాంలో కృషి జరిగింది. ఒక రైతు, నర్సుల సంతానం అయిన కార్టర్ 1943లో అమెరికా నౌకాదళ కేడెట్‌గా తన కెరీర్ ప్రారంభించారు. 1962లో సెనెటర్‌గా, 1970లో జార్జియా గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 1979లో ఇజ్రాయెల్, ఈజిప్టుల మధ్య చరిత్రాత్మక క్యాంప్ డేవిడ్ శాంతి ఒప్పందం కుదర్చడంలో కీలక పాత్ర పోషించారు. అమెరికా విదేశాంగ విధానంలో మానవ హక్కులకు అగ్ర తాంబూలం ఇచ్చారు. 1980లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రొనాల్డ్ రీగన్ చేతిలో ఓటమి పాలయ్యారు. అధ్యక్ష భవనాన్ని వీడాక ప్రపంచ శాంతి, పర్యావరణం, మానవ హక్కుల కోసం అవిశ్రాంతంగా పనిచేశారు. దీంతో ఆయనకు నోబెల్ శాంతి బహుమతిని ఇచ్చి గౌరవించారు. జనవరి 9న వాషింగ్టన్‌లో అధికారిక లాంఛనాలతో కార్టర్ అంత్యక్రియలు నిర్వహించేందుకు నిర్ణయించారు.

సుచిర్ మరణం.. ఆత్మహత్యలా లేదు: మస్క్

వాషింగ్టన్, డిసెంబరు 30: కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ 'ఓపెన్‌ఏఐ' మాజీ ఉద్యోగి, భారతీయ అమెరికన్ సుచిర్ బాలాజీ(26)ది ఆత్మహత్యగా కనిపించడం లేదని లేదని 'టెస్లా' అధినేత ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. ఆయన మరణం వెనుక ఏదో రహస్యం దాగి ఉందని, ఎఫ్‌బీఐతో దర్యాప్తు చేయించాలని ఆయన తల్లి పూర్ణిమా రామారావు చేస్తున్న డిమాండ్‌ను తాజాగా 'ఎక్స్'లో సమర్థించారు. 'ఓపెన్‌ఏఐ'.. చాట్‌జీపీటీకి చెందిన మాతృసంస్థ. దీని వ్యవస్థాపకుల్లో మస్క్ కూడా ఒకరు. కాలక్రమంలో ఆ కంపెనీతో ఆయన తెగతెంపులు చేసుకున్నారు. సుచిర్ శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్లో గత నెల 26న చనిపోయి కనిపించారు. మరణానికి ముందు.. ఓపెన్‌ఏఐ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారని వైద్యాధికారి తేల్చినట్లు శాన్‌ఫ్రాన్సిస్కో పోలీసులు వెల్లడించారు. అయితే పూర్ణిమ.. ప్రైవేటు దర్యాప్తు సంస్థను నియమించుకుని.. కుమారుడి భౌతిక కాయానికి రెండోసారి పోస్టుమార్టం చేయించారు. అందులో సుచిర్‌ది 'ఆత్మహత్య' కాదని తేలిందన్నారు.



పతనం నుంచి పునరుత్థానం

నాడు నేడు

(మొదటి పేజీ తరువాయి)

రిటైర్మెంట్ తర్వాత ఇవ్వాల్సిన డబ్బును దారి మళ్లించి వారిని ఇబ్బందికి గురిచేశారు. ఇసుక నిలి వేయడంతో పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు వి లవిల్లాడిపోయారు. ఇసుక, మద్యం, గనులు దోపిడీదారులకు రాజమార్గాలయ్యాయి. ప్రైవేట్, ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టారు. సోషల్ మీడియా కార్యకర్తల్ని హింసించారు. ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలను జైళ్లకు పంపి రాజకీ యంగా వేధించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం భవిష్య త్తును నిర్ణయించే ఎన్నికలు ఈ ఏడాది మే నెలలో జరిగాయి. వైసీపీ నేతలు తలెత్తుకోలేని విధంగా ప్రజలు తీర్పిచ్చారు. టీడీపీ నాయకత్వంలోని కూటమి అప్రతిహత మెజారిటీతో అధికార పీఠాన్ని అధిరోహిం చింది. నాలుగోసారి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అధికార మార్పిడి రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా గాలి పీల్చుకొనే వాతావరణాన్ని కల్పించింది.

అభివృద్ధి దిశగా అడుగులు..

కూటమి పార్టీలు ఏకంగా తొంభై మూడు శాతం సీట్లలో విజయం సాధించి చరిత్ర సృష్టించాయి. జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచి నూరు శాతం స్ట్రైక్ రేటు సాధించింది. లోక్‌సభ సీట్లలో కూడా ఇదే మాదిరి ఘన విజయం దక్క డం ఆంధ్రప్రదేశ్‌కు అనుకోని అదృష్టంగా మారింది. కేంద్రం లో ఎన్డీయే ప్రభుత్వానికి టీడీపీ మద్దతు కీలకంగా మారింది. దీంతో ఢిల్లీలో పలుకుబడిని పెంచింది. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులను సాధించడానికి ఈ పరిస్థితిని వినియోగించు కోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారు. దీనితో కొద్ది నెలల్లోనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం మొదలు పెట్టింది.

వేగంగా అమరావతి, పోలవరం పనులు

కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి వంద రోజు ల్లోనే రాజధాని అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్ల మేర ప్రపంచ బ్యాంక్ రుణం మంజూరుకు మార్గం సుగమమైంది. మరో రూ. 16 వేల కోట్లు రుణంగా ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ హడ్కో ముందుకు వచ్చింది. దీనితో రాజధాని నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతు న్నాయి. రాజధాని పూర్తవుతుం దన్న నమ్మకం కూడా పజల్లో కలిగింది. అమరావ తిలో జనవరి నుంచి పనులు ప్రారంభించి మూడేళ్లలో వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కూడా వేగంగా అడు గులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయ త్నాలతో ఈ ప్రాజెక్టు తొలి దశ పూర్తికి రూ. 35 వేల కోట్లు మంజూరుకు కేంద్రం అంగీకరించింది. దీనితో ఈ ప్రాజెక్టు పనులు కూడా పట్టాలెక్కబోతున్నాయి.

పాలనలో స్పష్టమైన మార్పు

పాలనలో కూడా ప్రజలకు ఊరటనిచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. తమపై ఎవరో నిరంతరం నిఘా పెట్టారన్న భయకంపిత వాతా వరణం నుంచి విముక్తమయ్యామని ప్రజలే చెబుతున్నారు. ధాన్యాన్ని అమ్మితే రైతులకు గతంలో మూడు నాలుగు నెలల వరకూ డబ్బులు అందేవి కావు. ఇప్పుడు రెండు రోజుల్లోపే వారికి చేరుతున్నాయి. పేదల పింఛను రూ. నాలుగు వేలకు, దివ్యాంగుల పింఛను రూ. ఆరు వేలకు పెంచారు. రోడ్ల మరమ్మతులకు రూ. వెయ్యి కోట్లు మంజూరు చేసి పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. మద్యంలో నాణ్యత తక్కువగా ఉన్న బ్రాండ్లను తొలగించి పాపులర్ బ్రాండ్లను ప్రవేశపె ట్టారు. ఉచిత ఇసుక విధానం తెచ్చి ట్రాక్టర్ల ద్వారా ఎవరైనా రేవుల్లోకి వెళ్ళి తెచ్చు కొనే అవకాశం కల్పించారు. నిర్మాణ రంగం పుంజుకోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు పెరిగాయి. కేంద్రం నుంచి రూ. లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారులు మంజూరు కావడంతో పలు ప్రాంతాల్లో భూముల ధరలు పెరి గాయి. ఓ పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంతో రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పదాన పరుగులు పెట్టిస్తోంది. రెట్టించిన ఉత్సాహంతో నూతన సంవత్స రంలోకి అడుగుపెట్టబోతోంది.

పెట్టుబడుల వరద

కొత్త ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వర దలా వస్తున్నాయి. ఈ రాష్ట్రంలో తిరిగి అడుగు పెట్టబోనని గత ప్రభుత్వ హయాంలో ప్రతిజ్ఞ చేసి వెళ్లిపోయిన లులూ గ్రూప్ తిరిగి విశాఖలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతోంది. రూ. 95 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లాలోని రామాయపట్నంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు బీపీసీఎల్ ముందుకు వచ్చింది. సౌదీ ఆరాం కో ఇందులో భాగస్వామి కాబోతోంది. ఆర్సెలార్ నిప్పన్ సంయుక్త సంస్థ రూ. 1.40 లక్షల కోట్ల పెట్టుబడితో అనకాపల్లి జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ నెలకొల్పబోతోంది. గూగుల్ సంస్థ విశాఖలో ఏఐకి సంబంధించి డేటా సెంటర్ నిర్మాణానికి ఎంఓయూ కుదుర్చుకొంది. విశాఖలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నట్లు టీసీఎస్ ప్రకటించింది. బిట్స్ పిలానీ, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ అమరావతిలో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. విశాఖ వద్ద కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఒక ఫార్మా సెజ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాయలసీమలోని ఓర్వకల్లు, కొప్పర్తిలో పారిశ్రామిక క్షేత్రాల ఏర్పాటు కానున్నాయి. సుమారుగా ఇరవై రంగాలకు సంబంధించిన విధానాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అసెంబ్లీలో ఆమోదించి పెట్టుబడిదారులకు భరోసా కల్పించింది.

శ్రీవారిసేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, డిసెంబరు 30(ఆంధ్ర జ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమ వారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రతాప్‌రావు జాదవ్ కూడా ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ ఎన్వీ రమణ

నేడు పల్నాడు జిల్లాకు చంద్రబాబు

⏩ యలమందలలో పింఛన్లు పంపిణీ

నరసరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం యలమం దల గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్ర మంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొ నున్నారు. బీసీ వర్గానికి చెందిన వుల్లంగుల ఏడుకొండలు, ఎస్సీ కాలనీలోని ఎస్సీ వర్గానికి చెందిన మహిళ తలారి శారమ్మ ఇళ్లకు వెళ్లి చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేస్తారు. గ్రామస్తులతో ముచ్చటిస్తారు. ఇందు కోసం వేదిక ఏర్పాటు చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్ర తినిధుల సమావేశంలో జిల్లా అభివృద్ధిపై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ప్రముఖ శైవ క్షేత్రం కోటప్ప కొండ శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

జస్టిస్ ఎం.జగన్నాథరావుకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన సుప్రీంకోర్టు, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.జగన్నాథరావుకు హైకోర్టు సోమవారం ఘన నివాళి అర్పించింది. మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మా లపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్య క్షుడు కె.చిదంబరం జస్టిస్ జగన్నాథరావు అందించిన న్యాయసేవలను గుర్తు చేసుకున్నారు. పలు కీలక తీర్పులు ఇచ్చారన్నారు. జస్టిస్ జగన్నాథరావు ఆత్మకు శాంతి చేకూరా లని కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ జగన్నాథరావు కుమారుడు జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, అల హాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, అడిష నల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూ టర్ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, ప్రభుత్వ న్యాయవాదులు, రిజిస్ట్రార్‌లు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న దృశ్యం

'బసవతారకం' ఆస్పత్రికి కోటి విరాళం

⏩ సీఎంకు చెక్కు అందించిన ఎన్నారై దంపతులు

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించనున్న బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రికి ప్రవాసాంధ్రుడు డాక్టర్ నూరపనేని వంశీకృష్ణ, డాక్టర్ ప్రతిభ దంపతులు భారీ విరాళం అందజేశారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరు గ్రామానికి చెందిన వీరు సోమవారం రాష్ట్ర సచి వాలయంలో సీఎం చంద్రబాబును కలిసి, రూ.కోటి చెక్కును అందించారు. వంశీ కృష్ణ, ప్రతిభ దంపతులను సీఎం అభినందించారు. రాజధాని అమరావతి నిర్మా ణంలోనూ ఎన్నారైలు పాలుపంచుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. కాగా, ఈ చెక్కును బసవతారం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు సీఎం అందించనున్నారు. సీఎంను కలిసిన వారిలో డాక్టర్ ప్రతిభ తండ్రి నూతలపాటి సురేంద్రబాబు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి ఆల పాటి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసులపైనా శ్రీవారి దర్శనం

⏩ టి-సీఎం రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ

⏩ సంతోషం వ్యక్తం చేసిన తెలంగాణ నేతలు, భక్తులు

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలపై తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి లేఖ రాశారు. తెలుగుజాతి సత్సంబంధాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ లేఖలో వెల్లడించారు. సోమవారం నుంచి గురువారం వరకు ఏదైనా రెండు రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనం (రూ. 500 టికెట్), ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ. 300 టికెట్) కోసం రెండు లేఖలు చొప్పున కేటాయిస్తామని తెలిపారు. శ్రీవారి దర్శనానికి తమ ప్రజాప్రతినిధుల లేఖలు కూడా అనుమతించాలని కోరుతూ తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాసిన నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నారు. కాగా, అమరా వతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అమరావతి సచివాలయంలో సోమవారం భేటీ అయ్యారు. తిరుమల దర్శనంపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు సంబంధించి చర్చించారు.

చంద్రబాబుకు ధన్యవాదాలు

చంద్రబాబు నిర్ణయం పట్ల తెలంగాణ లో నాయకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు చంద్రబాబుకు, బీఆర్ నాయుడుకు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ధన్యవా దాలు తెలిపారు. చంద్రబాబుకు తెలంగాణ మంత్రి కొండా సురేఖ కూడా ధన్యవా దాలు తెలిపారు. తెలంగాణ భక్తులకు నూతన సంవత్సర కానుకగా అభివర్ణించారు.

బీఎల్వోలకు వేతనాలు.. ట్రెజరీలకు ఆదేశాలు

⏩ లోకాయుక్త చొరవతో సమస్య పరిష్కారం

కర్నూలు లీగల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా గౌరవ వేతనాలు అందక ఇబ్బందులు పడిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు రాష్ట్ర లోకాయుక్త చొరవతో సమస్య పరిష్కారమైంది. వారి వేతనాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీక రించింది. ఈ మేరకు సోమవారం కర్నూలు జిల్లా కేంద్రంలోని రాష్ట్ర లోకాయుక్త ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పని చేస్తున్న 4,638 బూత్ లెవల్ ఆఫీసర్లకు 2021-22 నుంచి గౌరవ వేతనాలు అందలేదు. దీనిపై కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన సోషల్ వర్కర్ జే.శ్రీనివాసగౌడు రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించాలని లోకాయుక్త ఈ ఏడాది సెప్టెంబరు 27న రాష్ట్ర భూపరిపాలన చీఫ్ కమిషనర్‌ను ఆదేశించింది. వివిధ శాఖల ఉన్నతాధికా రులు ఈ ఫిర్యాదుపై విచారించి బూత్ లెవెల్ ఆఫీసర్లకు చెల్లించాల్సిన రూ.58.62 కోట్లను వెంటనే చెల్లించాలని జిల్లా ట్రెజరీ అధికారులను ఆదేశించారు. దీంతో కేసును ముగించినట్టు లోకాయుక్త పేర్కొంది.

మోటుపల్లిలో సహజ నౌకాశ్రయం ఏర్పాటుపై చర్చ

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మారిటైమ్ సెంటర్ వృద్ధికి వివిధ మారిటైమ్ బోర్డులు, అసోసియేషన్లతో పాల్గొనడానికి ఇండియన్ మారిటైమ్ బోర్డు (ఐఎంసీ)లో సభ్యత్వం తీసుకోవాలని ఏపీ మారిటైమ్ బోర్డు నిర్ణయిం చింది. సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో బోర్డు ఛైర్మన్ దామ చర్ల సత్యనారాయణ అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా పోర్టుల అభివృద్ధి, పెట్టుబడుల కోసం కొత్త ప్రాంతాల అన్వేషణతో పాటు వివిధ అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. మోటు పల్లిలో సహజ నౌకాశ్రయం ఏర్పాటు, పెద్దగంజాంలో నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధికి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. కృష్ణపట్నం ఓడరేవులో భద్రత కోసం కోస్ట్‌గార్డుకు జెట్టీ కేటాయింపు, కొండపి నియోజకవర్గం పాకాలలో ఫిష్ ఇన్‌ల్యాం డ్ సెంటర్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు.

ఐఎంఏ అభివృద్ధికి డాక్టర్ నరేంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయం

⏩ జాతీయ ఉత్తమ కార్యదర్శి అవార్డు ప్రదానం



అశోకన్ నుంచి అవార్డు అందుకుంటున్న నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అభివృద్ధికి డాక్టర్ నరేంద్రరెడ్డి అందించిన సేవలు అభి నందనీయమని ఐఎంఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, డాక్టర్ అనిల్‌కుమార్ జే నాయక్ ప్రశంసించారు. ఐఎంఏ జాతీయ ఉత్తమ కార్య దర్శిగా సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రతిష్ఠాత్మక అవార్డు అందు కున్నారు. 2023-24 సంవత్సరానికి గాను గుంటూరు ఐఎంఏ బ్రాంచ్‌ను అన్ని వి భాగాల్లో ఉత్తమ పని తీరు కనబర్చేలా తీర్చిదిద్దినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఐఎంఏ జాతీయ సమా వేశాల్లో భాగంగా శనివారం రాత్రి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ జే నాయక్ చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ నరేంద్రరెడ్డి అందు కున్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ నేతలు బూసిరెడ్డి సేవలను కొనియాడారు. గుంటూరు బ్రాంచ్ చరిత్రలో నిలిచిపోయేలా డాక్టర్స్ దివాళీ సెలబ్రేషన్స్, ఇఫ్తార్ విందు, ఆర్‌జీ కర్ కాలేజీపై నిరసన కార్యక్రమాలు చక్కగా నిర్వహించారని గుర్తు చేశారు. విజయవాడ వరద బీభత్స సమయంలో డాక్టర్ నరేంద్ర రెడ్డి నేతృత్వంలో గుంటూరు బ్రాంచ్ అందించిన ఆర్థిక, మౌలిక సేవలు మైలురా ళుగా నిలిచిపోతాయని ప్రశంసించారు. డాక్టర్ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఐఎంఏ సభ్యుల సహకారంతోనే తాను గుంటూరు బ్రాంచ్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు సాధించినట్టు తెలిపారు.

సాకులు చెప్పడం మీకు అలవాటైపోయింది

⏩ సీసీటీవీ ఫుటేజీ ఇవ్వకుండా ఏవేవో కారణాలు చెబుతారా?

⏩ పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

⏩ పల్నాడు జిల్లా మాచవరం ఎస్‌హెచ్‌వోపై అసహనం



అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పౌరుల అక్రమ నిర్బంధం విషయంలో వాస్త వాల నిర్ధారణకు సీసీటీవీ ఫుటేజ్ సమర్పించా లని తాము ఆదేశించిన ప్రతిసారీ సాంకేతిక కారణాలు, ఏవో సాకులు చెప్పి పోలీసులు ఆయా ఫుటేజ్‌లను కోర్టు ముందు ఉంచడం లేదంటూ పోలీసులపై హైకోర్టు తీవ్ర అస హనం వ్యక్తం చేసింది. పోలీసులకు ఇది అల వాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ అక్రమ నిర్బంధం కేసులో పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను సంబంధిత కోర్టు ముందు ఉంచాలని తామిచ్చిన ఆదేశాలు అమలు చేయకుండా.. సాంకేతిక కారణాలు చూపుతూ అఫిడవిట్ దాఖలు చేసిన పల్నాడు జిల్లా, మాచవరం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పై ఆగ్రహం వ్యక్తం చేసింది. సీసీ టీవీ మ రమ్మతులకు చర్యలు తీసుకున్న వి వరాలేవీ లేవని అందులో పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గద ర్శకాలను అనుసరించి సీసీటీవీ ఫుటేజీని భద్ర పరచాల్సిన బాధ్యత సంబంధిత ఎస్‌హెచ్‌వోపై ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆ ఎస్‌హెచ్‌వోపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవా ల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సుమోటోగా కోర్టుధిక్కరణ కింద చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో వివరణ ఇవ్వా లంటూ ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. ఈ మేర కు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘు నందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన సోదరుడు కటారి గోపిరా జును పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆయనను కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీ సులను ఆదేశించాలని కోరుతూ కటారి నాగ రాజు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గతంలో విచా రణ జరిపిన ధర్మాసనం నవంబరు 2 నుంచి 8 వరకు సీసీటీవీ ఫుటేజ్‌ను పెన్‌డ్రైవ్‌లో ఉంచి సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ వ్యాజ్యం సోమ వారం మరోసారి విచారణకు రాగా ఎస్‌హె చ్‌వో దాఖలు చేసిన కౌంటర్‌ను ధర్మాసనం పరిశీలించింది. ఎస్‌ఎంపీఎస్ కాలిపోయిందని, సీసీటీవీ ఫుటేజ్ రిట్రీవ్ చేయడం సాధ్యపడనం దున ఫుటేజ్‌ను కోర్టు ముందు ఉంచలేకపో యామని కౌంటర్‌లో ఎస్‌హెచ్‌వో పేర్కొన డాన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది.

నగర శివార్లకు సంచార రైతుబజార్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రధాన పట్టణాల్లోని శివారు ప్రాంతాల ప్రజలకు సంచార రైతుబ జార్లను సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు ఏపీ రైతుబజార్ల సీఈవో తెలిపారు. 'సంచార రైతుబజార్ల ఏర్పాటు ఎప్పుడో?' శీర్షికన ఈ నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై రైతుబజార్ల సీఈవో స్పందించారు. ప్రస్తుతమున్న 16 వాహనా లను రిపేరు చేయించి, విశాఖ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం నగర శివారు ప్రాంతాలతో పాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంచార రైతుబజార్లుగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో మరిన్ని సంచార రైతుబజార్లను అందుబాటులోకి తేవటానికి మార్కెటింగ్ శాఖ ప్రతిపాద నలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపుతున్నట్లు వివరించారు.

రైతుల్లో మానసిక ధైర్యం నింపాలి

⏩ వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్

విపత్తులతో వ్యవసాయం ఆటుపోట్లకు గురవుతున్న పరిస్థితుల్లో రైతులు మనోధైర్యం కోల్పోయి, ఆత్మహత్యలకు పాల్పడకుండా, వారిలో మానసిక ధైర్యం పెంచేలా బ్యాంకర్లు భరోసా కల్పించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సూచించారు. సోమ వారం జిల్లాల లీడ్ బ్యాంక్ మేనేజర్లు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల అధిపతు లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్న విషయంపై రైతులకు అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీ రావు మాట్లాడుతూ ఎలాంటి పూచీకత్తూ లేకుండా పంట రుణాలను రూ.లక్షా60వేల నుంచి రూ.2లక్షలకు పెంచిన దానిపై రైతులకు అవగా హన కల్పించాలన్నారు. రైతులకు పూర్తిగా మానవీయ కోణంలో సహకా రం అందిస్తామని బ్యాంకర్ల రాష్ట్ర కన్వీనర్ భాస్కరరావు భరోసా ఇచ్చారు.

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

విశాఖపట్నం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): భూమధ్య రేఖకు సమీ పాన హిందూ మహాసముద్రానికి ఆనుకుని దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అయితే ఇది బలపడినా శ్రీలంక తీరం దిశగా వెళుతుంది తప్ప ఏపీపై ప్రభావం ఏమీ ఉండదని వాతావరణ నిపుణుడొకరు అభిప్రాయపడ్డారు. కాగా కోస్తా శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది.

ఆదాయానికి మించిన ఆస్తులు కేసులో విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారికి జైలు శిక్ష

⏩ ఆయన భార్యకు కూడా

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి వి ుంచి ఆస్తులు సంపాదించిన కేసులో విశ్రాంత ఐఆర్‌ఎస్ అధి కారి, గతంలో కాకినాడ సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖ అసి స్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన రాయభరపు వెంకట లక్ష్మీనరసిం హారావుతోపాటు ఆయన భార్య రాయభరపు గౌరీరత్నానికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.రెండు లక్షలు చొప్పున జరిమానా వి ధిస్తూ విశాఖలోని సీబీఐ కేసుల న్యాయస్థానం ప్రధాన న్యాయ మూర్తి సీఎన్ మూర్తి సోమ వారం తీర్పు వెలువరించారు. నరసింహారావు సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖలో పనిచేస్తు న్నప్పుడు 2007 జూలై నుంచి 2011 ఆగస్టు వరకు అక్రమంగా ఆస్తులు సంపాదించారనే ఆరోప ణలు వచ్చాయి. దీనిపై సీబీఐ అధికారులు స్పందించి నరసిం హారావుతోపాటు ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న స్థిర, చరాస్తుల వివరాలను సేక రించారు. నరసింహారావు తన వాస్తవ ఆదాయం కంటే అద నంగా రూ.31,20,080 విలువైన స్థిర, చరాస్తులను కొనుగోలు చేసినట్టు నిర్ధారణ అయింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దౌత్య పరీక్ష

'ఆమెను తిరిగిపంపకూడదన్న రాజకీయ నిర్ణయం ఇప్పటికే జరిగిపోయింది' అంటూ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సలహాదారు ఆదివారం మీడియా సమక్షంలో ఓ వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం మన దేశంలో ఆశ్రయం పొందుతున్న బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత విషయంలో అధికారికంగా భారత్ ప్రతిస్పందించకముందే పొరుగుదేశం పాలకులు ఇలా హడావుడి నిర్ధారణలు చేయడం సరికాదు. హసీనాను తమకు అప్పగించాలని ఢాకా ఇటీవల దౌత్య ప్రక్రియ ద్వారా భారత ప్రభుత్వానికి సందేశం పంపింది. ఆ విషయాన్ని మన విదేశాంగ శాఖ ధ్రువీకరించింది తప్ప, దానిపై మరెలాంటి వ్యాఖ్య చేయలేదు. కానీ, అభ్యర్థించిన స్వల్పకాలంలోనే సమాధానాన్ని కూడా ఎదుటిపక్షం వారే ఇలా సిద్ధం చేసుకుంటున్నారు. హసీనా అప్పగింతకు భారత్ అంగీకరించకపోయే అవకాశాలే అధికంగా ఉన్నప్పటికీ, అభ్యర్థన ప్రక్రియ అన్నిదశలూ పూర్తయ్యేవరకూ ఇటువంటి వ్యాఖ్యలు చేయకూడదు.

దేశం విడిచి వెళ్ళిపోయేందుకు హసీనాను మిలటరీ అనుమతించినప్పటికి ఆమె మీద కేసులేమీ లేవు. అప్పుడు అందరికీ కావాల్సింది ఆమె ఉన్నపళంగా నిష్క్రమించడమే. ఆ తరువాత తాత్కాలిక ప్రభుత్వం ఆమెమీద కేసులు పెట్టింది, న్యాయస్థానం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. నేరస్థుల అప్పగింతపై భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం హసీనాను తిరిగి పంపించాలని ఢాకా కోరుతున్నది. ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించే లక్ష్యంతో చేసుకున్న ఒప్పందమది. అయితే రాజకీయ సంబంధిత అభియోగాలు ఎదుర్కొంటున్నవారికి ఈ ఒప్పందం వర్తించదని అందులోని నిబంధన 6 స్పష్టం చేసింది. ఈ నిబంధన అంతర్జాతీయ న్యాయసూత్రాలకు అనుగుణమైనది. ఐక్యరాజ్యసమితి విశ్వ మానవ హక్కుల ప్రకటన ఆ నిబంధనకు ప్రాతిపదిక. 'రాజకీయ అభిప్రాయాలు, చర్యల కారణంగా శిక్షను తప్పించుకునేందుకై ఇతర దేశాలలో ఆశ్రయాన్ని కోరేందుకు, పొందేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉందని' విశ్వ మానవ హక్కుల ప్రకటన పేర్కొంది. నేరస్థుల అప్పగింతపై ఐక్యరాజ్యసమితి నమూనా చట్టం ప్రకారం అప్పగించిన వ్యక్తిపై న్యాయవిచారణ నిష్పాక్షికంగా జరిగి తీరాలి. అందుకు ఆస్కారం లేదని భావించిన పక్షంలో అభ్యర్థనను తిరస్కరించే హక్కు సంబంధిత దేశానికి ఉంటుంది. బంగ్లాదేశ్ న్యాయవ్యవస్థ ఇటీవల తీసుకున్న వివిధ నిర్ణయాలు హసీనాపై నిష్పాక్షిక విచారణ జరగగలదనే భరోసానివ్వడం లేదు. గతంలో అసోంలో తీవ్ర హింసాకాండకు పాల్పడి, ఆ తరవాత బంగ్లాదేశ్ లో ఆయుధాలను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ వేర్పాటు వాద సంస్థ ఉల్ఫా నేత పరేష్ బారువాకు విధించిన మరణశిక్షను యావజ్జీవ శిక్షగా కుదించడం జరిగింది. అలాగే హసీనాపై హత్యాయత్నం కేసులో మరణ శిక్షను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కి చెందిన మాజీ మంత్రి లఫోజ్జమన్ బాబర్ ను ఇటీవలే పూర్తిగా విడిచిపెట్టారు. ఇక, మైనారిటీ హిందువుల పక్షాన రంగంలోకి దిగిన చిన్మోయ్ కృష్ణదాస్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఆయన తరఫున వాదించేందుకు ఏ న్యాయవాది ముందుకు రావడం లేదన్నది సాకు. ఈ పరిస్థితులలో హసీనాను అప్పగించినా ఆమెపై విచారణ నిష్పాక్షికంగా జరిగేందుకు ఆస్కారం లేదన్నది స్పష్టం.

షేక్ హసీనాను ఎలాగైనా స్వదేశానికి రప్పించి ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించే అవకాశం లేదు. అయితే ఆమెను అప్పగించాలన్న ఢాకా అభ్యర్థన భారత్‌కు దౌత్య పరీక్షగా పరిణమించనున్నది. ఏ కారణం చేతనైనా హసీనాను అప్పగించాలన్న బంగ్లా ప్రభుత్వ డిమాండ్‌ను అంగీకరించిన పక్షంలో భారత్ విశ్వసనీయతను కోల్పోతుంది. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే బంగ్లాలో ఇప్పటికే తీవ్రస్థాయిలో ఉన్న భారత్ వ్యతిరేకత మరింత ఉధృతమవుతుంది. హసీనాకు బాసటగా నిలుస్తూనే బంగ్లాదేశ్‌తో సుస్థిర సత్సంబంధాలను పునరుద్ధరించుకోవడం ఇప్పుడు భారత్ ముందున్న విషమ సమస్య. ఈ దౌత్య సంకటాన్ని అధిగమించడంలో ఎటువంటి పొరపాటు చేసినా దక్షిణాసియాలోనే కాకుండా విశాలప్రపంచంలో కూడా సంక్లిష్ట పర్యవసానాలను ఎదుర్కోవలసిన అగత్యం భారత్‌కు ఏర్పడుతుంది. భారత్‌లో ఉంటూ, బంగ్లాదేశ్ వ్యవహారాలమీదా, మహ్మద్ యూనుస్‌కు వ్యతిరేకంగానూ ఆమె వరుసగా చేసిన వ్యాఖ్యలు ఈ పరిణామానికి ఒక కారణం. భారత్‌లో ఉండదల్చుకుంటే, ఆమె మౌనంగా, తన ప్రపంచంలో తానుండటం మంచిది. ఆమె నోరువిప్పనంతకాలం బంగ్లాపాలకులు కూడా ఆమె జోలికి రాకపోవచ్చు. ఆమెకు, రెండుదేశాలకు కూడా ఇది క్షేమకరమైన మార్గం.

...ఇవన్నీ వైఫల్యాలేనా?

సీపీఐ 99వ జన్మదినోత్సవాన ఆంధ్రజ్యోతిలో మిత్రులు చెరుకూరి సత్యనారాయణ వ్యాసం వచ్చింది. సారాంశం "భారతదేశంలో కమ్యూనిస్టులు సాయుధపోరాటంలో విఫలమయ్యారు." ఇందులో వాస్తవం ఎంత? పరిశీలించడానికి ఇది సరైన సమయం.

అక్టోబర్ విప్లవం ఇచ్చిన ఉత్తేజంతో ప్రపంచంలో అనేక దేశాలలో లాగే భారత్‌లో కూడా 1925 డిసెంబర్ 26న సీపీఐ ఆవిర్భవించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం పెట్టిన అనేక 'కుట్ర కేసుల్లో' పార్టీ నాయకులు సుదీర్ఘ జైలు శిక్షలు అనుభవించారు. ప్రజాసంఘాలు ఏర్పాటు చేసి శ్రామికులు, రైతులు, మేధావులు, కళాకారులు, విద్యార్థుల సమస్యల మీద పోరాటాలు నడిపింది. అనేక హక్కులు సాధించారు. విజయాలు సాధించారు. నేను వాటి వివరాల్లోకి వెళ్ళటం లేదు.

హైదరాబాద్ సంస్థానంలో సాయుధ పోరాటాన్ని సీపీఐ 1947 సెప్టెంబరులో ప్రారంభించింది. అది సోషలిస్టు విప్లవం కోసం ఇచ్చిన పిలుపు కాదు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నిజాం హైదరాబాదు సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటిస్తే, దానిని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, వెట్టిచాకిరి రద్దు చేయాలని, భూస్వామ్య వ్యవస్థ రద్దు కావాలని పోరాటం జరిగింది.

సాయుధ పోరాటంలో లక్షలాది మంది పాల్గొన్నారు. 4500 మంది మరణించారు. ప్రధానంగా సాయుధ పోరాట ఫలితంగా యూనియన్ సైన్యాలు 'పోలీసు యాక్షన్' పేరుతో హైదరాబాదును స్వాధీనం చేసుకున్నాయి. నిజాం భారత యూనియన్‌లో విలీనమౌతున్నట్లు ప్రకటించాడు. తిరువాన్కూర్ కొచ్చిన్ సంస్థానంలో సీపీఐ సాయుధ పోరాటం నడిపింది. సంస్థానం రద్దయింది. భారత యూనియన్‌లో విలీనమైంది.



కమ్యూనిస్టులుగా మేము తప్పులు చేయలేదని కాదు. కొన్ని తప్పులు జరిగాయి. చారిత్రక పొరపాట్లు జరిగాయి. ఇప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత సాధించలేకపోతున్నాం. నూతన తరం వీటిని సవరించుకుని ముందుకు సాగిపోవాలి. ఇంకా అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాల్సి ఉండింది.

తెలంగాణ సాయుధ పోరాటం 1948 సెప్టెంబరు తర్వాత కొనసాగించడం సరైంది కాదు. సాయుధ పోరాట లక్ష్యం నెరవేరింది. దాని విజయాలను అతిగా భావించుకొని ఇతర ప్రాంతాలకు విస్తృతం చేయడం సరైంది కాదు. సాయుధ పోరాటం ద్వారా భూకేంద్రీకరణ బద్దలైంది. కానీ పేద ప్రజలకు న్యాయమైన భూమి దక్కలేదు. కౌలు రైతులకు న్యాయం జరిగింది. యూనియన్ సైన్యాలు రజాకార్లకు నామమాత్రపు శిక్షలు వేసి, కమ్యూనిస్టులపై వేట సాగించడంతో, పోరాటం తక్షణం విరమించలేని పరిస్థితి ఏర్పడింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా అధికారంలోకి రావడానికి ప్రయత్నించడంతో పాటు, చట్టబద్ధ పద్ధతుల్లో ప్రజా ఉద్యమాలు నడపడం, ప్రజల గొంతుక వినిపించడం అంతే ప్రధానమైనవి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్న పరిమితుల్లో సీపీఐ అనేక విజయాలు సాధించింది. మొదటి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షమైంది. ప్రజల వాణి సమర్థంగా వినిపించింది.

ప్రపంచంలో మొదటిసారి బ్యాలెట్ ద్వారా కేరళలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత పార్టీ చీలి నష్టపోయింది. అయినా కమ్యూనిస్టులు పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారు. 140 కోట్ల ప్రజలున్న దేశంలో యునైటెడ్ ఫ్రంట్ ద్వారా అధికారంలో భాగస్వామ్యం వహించి హోం, వ్యవసాయ శాఖల మంత్రిత్వ బాధ్యత తీసుకుంది.

రాజభరణాలు రద్దు చేయడంలో, బ్యాంకులు, బొగ్గు గనుల జాతీయకరణలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రధానపాత్ర నిర్వహించాయి. ప్రభుత్వరంగ పరిరక్షణలో ముందు భాగాన నిలబడ్డాయి. యూపీఏ–1 హయాంలో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఆహారభద్రతా చట్టాన్ని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని, గృహహింస నిరోధక చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని సాధించింది. అలీన విదేశీ విధానాన్ని కొనసాగించడంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. కార్మికుల హక్కులకై, విద్యార్థి యువజన హక్కులకై పోరాడింది. భాషాప్రయుక్త రాష్ట్రాలు సాధించింది. ఫాసిస్టు తరహా పాలనను ఎండగట్టేందుకు సెక్యులర్, ప్రజాతంత్ర వామపక్షాల ఐక్యత కోసం పోరాటం నడిపింది. ఇవి కొన్ని మాత్రమే.

ఇవన్నీ వైఫల్యాలా? మీరే ఆలోచించుకోండి. కమ్యూనిస్టులుగా మేము తప్పులు చేయలేదని కాదు. కొన్ని తప్పులు జరిగాయి. చారిత్రక పొరపాట్లు జరిగాయి. ఇప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత సాధించలేకపోతున్నాం. మరికొన్ని తప్పులుండవచ్చు. చెప్పండి. ఆలోచిద్దాం. నూతన తరం వీటిని సవరించుకుని ముందుకు సాగిపోవాలి. ఇంకా అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాల్సి ఉండింది. మరింత మిలిటెంట్ పోరాటాలు నడపాల్సి ఉండింది. వినమ్రతతో అంగీకరిస్తాం. ఇవన్నీ నా వ్యక్తిగత అభిప్రాయాలు. మా పోరాటాలలో ఎర్రజండాతో సాగిపోతాం.

ఈనాడు దేశ ప్రజలను భయభ్రాంతులకు లోను చేస్తూ శ్రామికవర్గ వ్యతిరేక, అభివృద్ధి నిరోధక చట్టాలను చేస్తున్న ఆరెస్సెస్, కార్పొరేట్ చేతుల్లో ఉన్న కీలుబొమ్మ ప్రభుత్వం నుండి ప్రజలను రక్షించుకోవడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి కలిసి వచ్చే అన్ని శక్తులతో కలిసి పోరాటాలు చేయడానికి పునరంకితమవుదాం. ఈ బాధ్యతలు నిర్వహించగల మరొక సిద్ధాంతం, రాజకీయ శక్తులు దేశంలో ఉన్నాయా? చర్చించుకుందాం. నిరాశావాదం వద్దు. ఉజ్వలమైన లక్ష్యాల వైపు విశ్వాసంతో సాగిపోదాం. కమ్యూనిస్టు సిద్ధాంతం అజరామరం.

● సురవరం సుధాకర్‌రెడ్డి
పూర్వ ప్రధాన కార్యదర్శి, సీపీఐ

'సంస్కర్త' హృదయంలో సామాన్యుడు


నన్ను ఆర్బీఐ (భారతీయ రిజర్వ్ బ్యాంక్) గవర్నర్‌గా సెప్టెంబర్ 2008లో నియమించారు. ఈ నియామకం సమయంలో నేను న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్నాను. ముంబైకు వెళ్లే ముందు, నా మీద నిండు నమ్మకంతో ఈ బృహత్తర బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపేందుకై ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లాను. ఆయనతో నా సమావేశం క్లుప్తంగా– కేవలం 15 నిమిషాల పాటే జరిగింది. దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, ప్రభుత్వ ద్రవ్య విధానానికి సంబంధించిన సవాళ్లు, ఇంకా ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రూపాయి విలువను కాపాడడంలో ఆర్బీఐకి ఎదురయ్యే సమస్య గురించి మేము మాట్లాడుకున్నాం.

డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎదుటి వ్యక్తి చెప్పేది శ్రద్ధగా వినే వ్యక్తి. ఈ గుణ విశేషం తక్కువ మందిలో ఉంటుంది, నాయకులలో కొద్దిమందిలో మాత్రమే ఉంటుంది. ఆయనకు అప్పటికే తెలిసిన విషయాన్ని చెప్పినా చాలా ఓర్పుగా వింటారు. తెలిసిన విషయమైనా మీ వివరణలో ఏమైనా సున్నిత సూక్ష్మాలూ, కొత్త దృక్కోణాలు ఉన్నాయేమోనని ఆయన శ్రద్ధ చూపుతారు. ఆయనలో నేను అభిమానించే విషయాలలో ఇది ఒకటి.

పది నిమిషాల పాటు మాటా మంతీ అయినాక నేను ఇలా అన్నాను: 'సర్, మీరూ ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు. నాకు ఏమైనా సలహా ఇవ్వగలరా?' ఆయన స్వాభావికంగా ఒక అస్ఫుటమైన చిరునవ్వు (ఈ మందహాసాన్ని మీరు మన్మోహన్ పెదవులపై కంటే ఆయన కళ్లలోనే ఎక్కువగా చూడగలరు)తో విముఖత తెలిపారు. 'సుబ్బారావు, మీకు నేను ఏమి సలహా ఇవ్వగలను? మీరు ఐఏఎస్‌లో ఉన్నారు. మీకు దేశం తెలుసు, ప్రభుత్వం తెలుసు. ఆర్బీఐ వ్యవహారాలు మీకు సుపరిచితమే. ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు, పురోగతికి ఏది అత్యుత్తమమని మీరు భావిస్తారో అదే చేయండి. మీరు మన ఆర్థిక వ్యవస్థకు తప్పక మేలు చేస్తారనడంలో నాకు సందేహం లేదు' అని మన్మోహన్ అన్నారు.

రెండు నిమిషాల అనంతరం ప్రధానమంత్రితో నా సంభాషణని ముగించాను. వెళ్లేందుకు లేచి నిలబడగా ఆయన తన కుర్చీ నుంచి లేచి వచ్చి నాకు వీడ్కోలు చెప్పేందుకు ద్వారం దాకా వచ్చారు. ద్వారం వద్ద నా భుజం చుట్టూ తన చెయ్యి వేసి ఇలా అన్నారు: 'సుబ్బారావు, ఇంతకు ముందు మీరు నా సలహా కోసం అడిగారు. మీకు ఒక సలహా ఇవ్వదలుచుకున్నాను. మీరు ఐఏఎస్ నుంచి ఆర్బీఐకి వెడుతున్నారు. అదొక పెద్ద మార్పు. ఐఏఎస్‌లో వలే కాకుండా ఆర్బీఐలో మీరు ద్రవ్యోల్బణం, వడ్డీ రేటు, ద్రవ్య సరఫరా, ఋణ పెరుగుదల అంకెల అరణ్యంలో చిక్కుకుపోయే ప్రమాదం ఉన్నది. ఆర్బీఐ తీసుకునే నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజలకు, వారి జీవనాధారాలకు ఎంత ముఖ్యమో మీరు మరచిపోవచ్చు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని మీ నిర్ణయాలు, చర్యల ఫలితంగా నెలకొనే పరిస్థితులను తెలుసుకునేందుకు సదా జాగరూకతతో ఉండండి'.

ముంబైకు వెళ్లే ముందు ఢిల్లీలో ముగించవలసిన అనేక పనుల విషయం నా మనస్సునిండా ఉండడంతో ఆ సలహా, నేను ప్రధానమంత్రి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన నిమిషంలోగానే నా మనసు నుంచి అదృశ్యమయింది. ఆ తరువాత కొద్ది నెలల్లో ఆర్బీఐ గవర్నర్‌గా నా బాధ్యతల నిర్వహణలో నేను తలమునకలుగా ఉండగా మన్మోహన్ సలహాలో ఇమిడి ఉన్న భావం, దాని ప్రాముఖ్యత నాకు తెలిసివచ్చాయి. ఈ విషయాన్ని చూడండి. ప్రతి త్రైమాసికంలోను ద్రవ్య విధాన సమీక్ష జరుగుతుంది. ఇందుకు సన్నద్ధంగా సంబంధిత వ్యక్తులు, సంస్థలు– ఆర్థికవేత్తలు, బ్యాంకులు, బ్యాంకేతర ఫైనాన్స్ కంపెనీలు, మార్కెట్ల ప్రతినిధులు అందరితో సంప్రదింపులు జరుగుతాయి. ఏ ఆర్బీఐ గవర్నర్ కూడా ఎప్పుడూ ఇలా చెప్పలేదు : 'ఓకె, ఇప్పుడు వీధుల్లో ఉన్న 25 మంది సామాన్య పౌరులను తీసుకురండి. ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు తదితర ప్రధానమైన ఇతర అంశాల గురించి వారిని నేను సంప్రదించదలుచుకున్నాను'. చెప్పవచ్చిన దేమిటంటే ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తాయి. ద్రవ్యోల్బణమనేది ఒక తిరోగామి పన్ను. అది సంపన్నుల కంటే పేదవారిని ఎక్కువగా నష్టపరుస్తుంది. కనుక పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నదే మన్మోహన్ న్యూఢిల్లీలో నాకు వీడ్కోలు చెప్తూ ఇచ్చిన సలహా.



డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప శ్రద్ధాళువు. ఎదుటి వ్యక్తి చెప్పేది తెలిసిన విషయమే అయినా ఆ వివరణలో సున్నిత సూక్ష్మాలూ కొత్త దృక్కోణాలు ఉన్నాయేమోనని ఆయన ఆసక్తి చూపుతారు. ఆర్బీఐ స్వతంత్ర ప్రతిపత్తిని మన్మోహన్ సంపూర్ణంగా సమర్థించేవారు. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తాయి. ద్రవ్యోల్బణం సంపన్నుల కంటే పేదవారిని ఎక్కువగా నష్టపరుస్తుంది. కనుక పేదల సంక్షేమాన్ని సదా దృష్టిలో ఉంచుకోవాలని ఆయన గట్టిగా చెప్పేవారు.

ఆర్బీఐ పట్ల మన్మోహన్ సింగ్‌కు గొప్ప గౌరవం ఉన్నది. దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడవలసిన అవసరాన్ని ఆయన బాగా అర్థం చేసుకున్నారు. ఆర్బీఐ స్వతంత్రంగా, స్వేచ్ఛగా వ్యవహరించగలిగేందుకు ఆయన చేయగలిగినదంతా చేశారు. గతంలో ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన మన్మోహన్ అది తన విశ్వసనీయతను కొనసాగించుకోవాలని సదా ఆకాంక్షించేవారు. ఆర్థిక మంత్రిగా ద్రవ్య విధానం విషయంలో ఆయన ఎటువంటి జోక్యం చేసుకోలేదు. విధాన నిర్దేశాలు, లక్ష్యాల విషయంలో ప్రభుత్వం, ఆర్బీఐ మధ్య విభేదాలు ఏ ఒక్క ప్రభుత్వానికి గానీ లేదా ఏ ఒక్క ఆర్బీఐ గవర్నర్‌కు గానీ పరిమితమైనవీ కావు, ప్రత్యేకమైనవీ కావు. ఒక విధంగా అవి వ్యవస్థలోనే ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ ఆ అభిప్రాయ బేధాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలోను ఆ భిన్నాభిప్రాయాలు బాగానే ఉన్నాయి. ఇది సహజం మీరు వాటిని ఆమోదించకపోయినా ఆ విబేధాలు తలెత్తుతూనే ఉంటాయి. ఆర్థిక వ్యవస్థ పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పుడు ఈ విబేధాలు మరింత తీవ్రంగా ఉండడం కద్దు. యూపీఏ రెండో ప్రభుత్వ హయాం (2009–14)లో ఇదే జరిగింది ప్రభుత్వంలోనే అంతర్గతంగా విధాన వైకల్యం ఏర్పడిందని ఆనాడు అందరూ భావించారు. అంతే కాకుండా శ్టాగ్‌ఫ్లేషన్ (స్తబ్దతా ద్రవ్యోల్బణం– గిరాకీలో గానీ, ఉద్యోగితలో గానీ పెరుగుదల లేకుండా ద్రవ్యోల్బణం ఏర్పడిన స్థితి) గురించి భయాలు కూడా ముమ్మరంగా నెలకొన్న రోజులవి. విధాన నిర్దేశాలు, లక్ష్యాల విషయమై నాటి ఆర్థిక మంత్రులు –ప్రణబ్ ముఖర్జీ, పి.చిదంబరం–తో నాకు విభేదాలు ఉన్నాయి. విధాన సమీక్ష, మార్పుల చేర్పుల విషయంలో మన్మోహన్ ఎన్నడూ జోక్యం చేసుకోకపోవడం ఆయన గొప్పదనానికి ఒక తార్కాణం. విధాన సమీక్ష విషయమై ఆయనకు వివరించేందుకు వెళ్లినప్పుడు ఆర్థిక మంత్రితో మీ విభేదాలు పరిష్కరించుకున్నారని నేను ఆశిస్తున్నానని అనేవారు. ఆయన ఈ వ్యాఖ్య నాకు ఎంత మాత్రం సంతృప్తినిచ్చేది కాదు. అయినప్పటికీ ఆర్థిక మంత్రి అభ్యంతరాల గురించి ఆయనకు చెప్పేవాణ్ణి ఆ విషయం అంతటితో ముగిసేది.

కేంద్ర బ్యాంకుతో సంబంధం లేని విషయాలపై కూడా తన భావాల మంచి చెడ్డలను తెలుసుకునేందుకు ఆయన ఆర్బీఐని ఉపయోగించుకునేవారు. సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గ్రామీణ ఉపాధి హామీ పథకం విస్తరణ, భూసేకరణ బిల్లు మొదలైన వాటిపై మా అభిప్రాయాలను అడిగి తెలుసుకునేవారు. ఇలా ఆర్బీఐకి సంబంధం లేని విషయాలపై మాతో సంప్రదించడం, సలహాలు తీసుకోవడం ఆర్బీఐ పట్ల ఆయన గౌరవానికి, విభిన్న వర్గాల వారి భావాలు, అభిప్రాయాలు తెలుసుకోవడంలో ఆయన శ్రద్ధాసక్తులకు నిదర్శనాలుగా చెప్పి తీరాలి. నా స్వరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యల గురించి కూడా ఒకసారి ఆయన నన్ను అడిగారు. క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవడానికి ఆయన విశేష శ్రద్ధ చూపేవారు. ఇది ఆయనలో ఉన్న ఒక ప్రశంసనీయమైన గుణ విశేషం. ఒకసారి అనుకోకుండా తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో బ్యాంకులు పని చేస్తున్నాయా అని ఆయన అడిగారు. ఈ విషయాన్ని తరచి చూడాలన్న ఆలోచన నాకు ఎన్నడూ రాలేదు. ఈ కారణంగానే ఆయన హఠాత్తుగా అడిగిన ప్రశ్న నన్ను ఇబ్బంది పెట్టింది.



డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రి అయినప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖలో నేను మధ్యస్థాయి అధికారిగా ఉన్నాను. ఆర్థికమంత్రికి నాలుగు లేదా ఐదు స్థాయిల దిగువన ఉన్నాను. ఈ కారణంగా నేను అప్పుడు ఆయనతో పెద్దగా మాట్లాడడం జరగలేదు. అయితే ఆయన మా మంత్రి గనుక కొన్ని సమావేశాల్లో ఆయన్ను చూస్తుండేవాణ్ణి. మన్మోహన్ ఆర్థికమంత్రిగా రావడానికి మూడు సంవత్సరాల ముందు నుంచీ నేను ఆ శాఖలో ఉన్నాను. తొలుత నేను 1983 నుంచి 1993 దాకా ఆర్థిక వ్యవహారాల విభాగానికి డైరెక్టర్‌గా ఉండేవాణ్ణి. చెల్లింపుల సమతౌల్యత, వ్యవహారాల పర్యవేక్షణ నా బాధ్యతగా ఉండేది. ఆ తరువాత డాక్టర్ సి. రంగరాజన్ అధ్యక్షతన గల ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలికి కార్యదర్శిగా ఉన్నాను. అప్పుడు ప్రధానమంత్రితో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొనేవాణ్ణి. ఉన్నతస్థాయి విధాన నిర్ణయ సమావేశాలకు హాజరయ్యే అవకాశం నాకు లభించింది. మన్మోహన్ గొప్ప శ్రద్ధాళువు. ఆర్బీఐ స్వతంత్ర ప్రతిపత్తిని సంపూర్ణంగా సమర్థించేవారు. అప్పట్లో దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నది. భావి అవసరాలకు నయాపైసా సైతం మిగుల్చుకోవడానికి లేని దుస్థితి. విదేశీ మారకద్రవ్య నిల్వలు అడుగంటిపోయిన విపత్కర రోజులవి. మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటి వారంలోనే రూపాయి విలువను రెండు దశల్లో తగ్గించారు. ఈ చర్య గొప్ప సత్ఫలితాన్నిచ్చింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ఎట్టకేలకు మనకు సహాయమందించడానికి సంసిద్ధత తెలిపింది.

మన దేశ చరిత్రను మౌలికంగా మార్చివేసిన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. 'ఒక భావానికి ఎప్పుడో అప్పుడు సమయం వస్తుంది. అప్పుడు దాని ప్రభావశీలతను ఈ ధరిత్రిపై ఏ శక్తీ అడ్డుకోలేదు' అని ఫ్రెంచ్ మహారచయిత విక్టర్ హ్యూగో చెప్పిన సత్యాన్ని మన్మోహన్ సింగ్ 1991 జూలై 24న తన బడ్జెట్ ప్రసంగంలో ఉటంకించారు. మన ఆర్థిక చరిత్రలో గొప్ప మార్గదర్శక ప్రసంగమది. ఆ ప్రసంగాన్ని మన్మోహన్ సింగే స్వయంగా సిద్ధం చేసుకున్నారు. సమకాలీన విమర్శకులు, వ్యాఖ్యాతల కంటే చరిత్ర తన పట్ల దయా భావంతోను, ఉదారంగాను ఉంటుందని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా తన చివరి విలేఖరుల సమావేశంలో అన్నారు. మన దేశానికి హుందాగా, గౌరవపూర్ణంగా సేవలు అందించిన ఈ విద్వత్ పరుడు, వినమ్రశీలి, మృదుభాషి తనను గురించి తాను చెప్పుకున్న విషయంలో నూటికి నూరు పాళ్లు నిజం ఉందనడంలో సందేహం లేదు.

■ దువ్వూరి సుబ్బారావు
భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్

డిటెన్షన్ విధానం సరికాదు

2009 విద్యా హక్కు చట్టాన్ని సవరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలులో ఉన్న నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ 5, 8 తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానుంది.

విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్ 16 ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో 8వ తరగతి వరకు ఏ విద్యార్థినీ కూడా అదే తరగతిలో మళ్ళీ కొనసాగించేందుకు లేదా పాఠశాల నుంచి తొలగించేందుకు వీలులేదు. దీనినే నో డిటెన్షన్ విధానం అంటారు. పరీక్షలలో ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా విద్యార్థులు పై తరగతులకు వెడతారు. ప్రాథమిక స్థాయిలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ పెంచడం, ఆహ్లాదకరమైన అభ్యసనం, పరీక్షల పట్ల భయం తగ్గించడం, డ్రాప్ ఔట్స్ కాకుండా చూడటం నో డిటెన్షన్ పాలసీ ప్రధాన లక్ష్యాలు.

అయితే ఈ విధానం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, అసెర్ నివేదికలు తెలుస్తున్నాయి. విద్యార్థులలో అభ్యసన పట్ల శ్రద్ధ తగ్గిందని, ఫలితాలకు ప్రాధాన్యత లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడం లేదని విమర్శకుల వాదన. అదే విధంగా 9, 10 తరగతుల్లో డ్రాప్ ఔట్స్ అధికం అవుతున్నాయని వీరి విమర్శ. ప్రాథమిక స్థాయిలో 100 శాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండగా, 9, 10 తరగతుల్లో డ్రాప్ ఔట్ శాతం 17గా ఉండటం గమనార్హం.

నో డిటెన్షన్ విధానం వల్ల అభ్యసన సామర్థ్యాలు తగ్గుతున్నాయని, దానిని మార్చవలసిందిగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విజ్ఞప్తులు అందాయి. దేశంలో 23 రాష్ట్రాలు డిటెన్షన్ విధానాన్ని తీసుకురావాలని ప్రతిపాదించాయి. 2018లో విద్యా హక్కు చట్టానికి సవరణలు తెచ్చాక 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిటెన్షన్ విధానం అమలులోకి వచ్చింది. అయితే ఉభయ తెలుగు రాష్ట్రాలు నో డిటెన్షన్ విధానమే కొనసాగిస్తున్నాయి. మరి కొన్ని రాష్ట్రాలు ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

నూతన విధానం ప్రకారం 5, 8వ తరగతి విద్యార్థులు సంవత్సరాంతంలో నిర్వహించే పరీక్షల్లో ఖచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. ఉత్తీర్ణత సాధించని వారికి రెండు నెలల పాటు శిక్షణ అందించి, మళ్ళీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. రెండవసారి కూడా ఉత్తీర్ణత సాధించకుంటే అదే తరగతిలో కొనసాగిస్తారు. అదే తరగతిలో కొనసాగించినపుడు విద్యార్థి అభ్యసన లోపాలు గమనించి వాటిని పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. 8వ తరగతి పూర్తి చేయకుండా ఏ విద్యార్థినీ బడిలో నుంచి తొలగించరాదని కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొంది. అందరికీ విద్య అందాలి, కానీ అదే సమయంలో విద్యార్థులు ఆశించిన సామర్థ్యాలు పొందేందుకు నూతన విధానం దోహదపడుతుందని, అభ్యసనలో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని కేంద్రం వాదన.

కానీ డిటెన్షన్ విధానం తిరోగాత్మక చర్యగా విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రాథమిక విద్యకు కూడా దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యాహక్కు చట్టం ఉద్యమకారులు వాదిస్తున్నారు. డిటెన్షన్ విధానం వల్ల పిల్లల్లో పరీక్షల పట్ల భయం పెరిగే అవకాశం ఉంది. ఫెయిల్ అయిన విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉంది. వారిలో న్యూనతాభావం ఏర్పడుతుంది. మళ్ళీ అదే తరగతి చదవాల్సి రావటం వారిలో నిరాసక్తతను పెంచుతుంది. బాలకార్మికులు పెరిగే ప్రమాదం ఉంది. డిటెన్షన్‌ను అధిగమించేందుకు పరీక్షలలో అనైతిక విధానాలకు పాల్పడే అవకాశం ఉంది. ప్రాథమిక స్థాయిలో ఆహ్లాదంగా జరగాల్సిన అభ్యసనం ఆందోళనాయుతంగా ఉంటుంది. డిటెన్షన్ విద్యావిధానం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై, మొదటి తరం అభ్యాసకులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణుల అభిప్రాయం.

నో డిటెన్షన్ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి. విద్యార్థుల అభ్యసనం, ఉపాధ్యాయుల బోధన అభివృద్ధిచెందేందుకు పర్యవేక్షణ ఉండాలి. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావాలి. నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించకుండా, డిటెన్షన్ ద్వారా అవరోధాలు సృష్టించడం వారిని శాశ్వతంగా విద్యకు దూరం చేస్తుంది. అందుకని డిటెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పునః సమీక్షించాలి.

– డాక్టర్ అనుమాండ్ల వేణుగోపాలరెడ్డి

సినీ మా(యా) పరిశ్రమ

సినిమా నటులంటే బతుకుతెరువు కోసం లేదా వారికున్న నటనా వ్యామోహంతో నటించడానికి వస్తారు. ప్రజలు ఓహో అనేలా నటించవచ్చు. నిజమే అనుకునేంతగా భ్రమింపజేయవచ్చు, తమ నటనతో ప్రేక్షకులను కట్టి పడేయవచ్చు. దానికి తగిన పారితోషికం తీసుకుని వారి నటనలో వైవిధ్యాలను జోడిస్తూ కొత్త కొత్త నటకౌశలాలను ప్రదర్శించి మెరుగులు దిద్దుకోవచ్చు. అంత మాత్రాన వాళ్ళు దైవాంశ సంభూతులు అయిపోరు. అభిమానం ఉండొచ్చు, కానీ కని పెంచిన తల్లితండ్రులను, కష్టసుఖాల్లో ఆదుకునే తోడబుట్టినవాళ్ళు, కలిసి పనిచేసే సహోద్యోగులు, అవసరాల్లో ఆసరా అయ్యే మన చుట్టుపక్కల వారి కన్నా వాళ్ళే గొప్పనుకునేంత శృతిమించిన దురభిమానంలోకి యువత జారిపోవటం దురదృష్టకరం.

మనిషికి అవసరం వినోదం. ఆ వినోదం శత్రువులను చెండాడే దేశభక్తికి, సమాజాన్ని ఉద్ధరించేందుకు అలాగే తనను తాను ఉద్ధరించుకునేందుకు తోడ్పడాలి. ఈ రోజున టీవీ షోలు మొదలుకుని సినిమాలు, సోషల్ మీడియా మాత్రమే కాదు, చివరికి ఒకటి, రెండు సంవత్సరాల వయసున్న చిన్నపిల్లల్ని కూడా అశ్లీల బట్టలతో నాట్యం చేయిస్తూ పైపెచ్చు... బట్టలెందుకు చూస్తారు, టాలెంట్ చూడండి అంటూ నిర్లజ్జగా సమర్థించుకోవడం కనిపిస్తుంది. పూర్వం అభిమానం సహజంగా పుడితే, నేడు సోషల్ మీడియా వేదికగా 'వైరల్' అనే వైరస్ జొరబడి కల్పించుకున్న అభిమానులకు.. తమకు తామే సృష్టించుకునే స్టార్‌డమ్‌ల వరకు ఎదిగి ఎదిగి... వందలు వేలల్లో ఉన్న పారితోషికాలు కోట్లల్లోకి వెళ్ళింది. అయితే, దర్శక నిర్మాతలు మాత్రం 'మేము సమాజంలో జరిగే నిజాల్ని జనాలకు చూపిస్తున్నాం' అంటూ తేనెపూసిన మాటలెన్ని మాట్లాడినా... ఒక హత్యో, అత్యాచారమో జరిగిందని తెలపడానికి, దాన్ని ఎలా తప్పించుకోవచ్చో కూడా జతచేసి వివరంగా సినిమా తీసి జనాల్లోకి వదలటం వల్ల పిల్లలు, యువత ప్రేరేపితమై చెడుదారి పట్టే అవకాశం కల్పించడానికి చాలా తేడా ఉంటుందని తెలిసి కూడా ధనవ్యామోహంతో ముందుకెళ్తున్నారు. ఒక సెలబ్రిటీగానో, ప్రజానాయకుడిగానో గుర్తింపు పొందిన పౌరులు సమాజం పట్ల మరింత బాధ్యతగా ప్రవర్తించడం, మాట్లాడటం తమకు తామే అలవరుచుకోవాలి. ఎందరికో జీవనోపాధిని ఇస్తున్నామన్న పేరుతో సినిమానొక పరిశ్రమగా చేసి, వ్యాపారంగా మార్చామంటూ సమర్థించుకోవడం అంతకన్నా సరికాదు. జనం కూడా పాత కాలంలో లాగా తెరవెనుక నటులుంటారని, జరిగేదంతా నిజమనుకునే భ్రమ నుంచి తేరుకుని తామే నటులై సోషల్ మీడియాలో రాజ్యమేలుతూ కూడా, సినిమా నటుల్ని ఆకాశానికెత్తేస్తూ మొదటిరోజే సినిమా చూడకుంటే ప్రాణం పోతుందన్నంత మూర్ఖత్వంతో బతకడం శోచనీయం.

సమాజమా గుర్తించు... ఎవరి స్వార్థప్రయోజనాల కోసమో తయారై ప్రయోగించబడుతున్న మాయల ఉచ్చులోకి నిన్ను నువ్వే తోసేసుకుని నశించి పోకుండా జాగ్రత్తపడు. సైబర్ నేరాలు మాత్రమే కాదు అంతకు మించిన మాయ వలలు మనచుట్టూ అల్లుకుని ఉన్నాయని గుర్తెరిగి మసలుకుంటే కుటుంబాలు, దేశం బాగుంటాయి. దానివల్ల నీ జీవితమూ సుఖమయమౌతుంది.

– డేగల అనితాసూరి, హైదరాబాద్

అన్నం పెట్టిన పథకం అక్రమార్కుల పాలు!

పేదవాడికి పట్టెడు అన్నం పెట్టలేనప్పుడు రాజకీయాలు ఎందుకంటూ– ఎన్.టి. రామారావు 1983 జూలై 6న రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ప్రారంభించడం అప్పట్లో ఒక సంచలనం. ఈ రెండు రూపాయలు బియ్యం పథకంతో ఎన్టీఆర్‌ను పేద ప్రజలు దేవుడుగా కొలిచారు. ఆ రోజుల్లో వరి అన్నాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అందరూ తినే పరిస్థితి లేదు. పల్నాడులో, రాయలసీమ చాలా జిల్లాల్లో, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో జొన్నలు, సజ్జలు, కొర్రలు తినేవారు. అందరికీ వరి అన్నం లభించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ఆ రోజున ప్రవేశపెట్టిన రెండు రూపాయలకు కిలో బియ్యం ఇప్పటికి 42 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నది. ఈ పథకాన్ని తీసే సాహసం రాష్ట్రంలోని ఏ ప్రజా ప్రభుత్వమూ చేయలేదు. యావత్ దేశాన్ని ఆకర్షించిన ఈ పథకాన్ని వివిధ రాష్ట్రాలు అనుసరించాయి.

కానీ నేటి రోజుల్లో ఏ స్కాం చూసినా బియ్యం చుట్టూ తిరుగుతున్నది. బియ్యం కోసం కాకుండా కేవలం ప్రభుత్వ పథకాల కోసమే తెల్లరేషన్ కార్డులు పొందుతున్నవారు ఆ బియ్యాన్ని అమ్మేసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇప్పటికీ తెల్ల రేషన్ కార్డే ప్రామాణికం అని, తెల్లకార్డు లేదంటే అన్ని పథకాలు రద్దవుతాయని చాలామంది లబ్ధిదారుల్లో ఆందోళన ఉంది. చాలా పథకాలకు రేషన్ కార్డుతో సంబంధం లేదని అధికారులు చెబుతున్నా అంతిమంగా ఆ కార్డునే లెక్కలోకి తీసుకుంటున్నారు. బియ్యం తీసుకోపోతే కార్డు రద్దవుతుందనే భయంతోనే చాలా మంది లబ్ధిదారులు వారికి అవసరం లేకున్నా బియ్యం తీసుకొని అది బ్లాక్‌మార్కెట్‌కి తరలిపోవడానికి కారణమవుతున్నారు. రేషన్ బియ్యం తీసుకునే వాళ్లలో సుమారు సగం మంది వాటిని కిలో రూ.15–18కి హోటళ్లకు, వీధి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని వాళ్లు మళ్ళీ దళారులకు రూ.25కు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. పెద్దమొత్తంలో బియ్యాన్ని పోగు చేసి క్వింటాళ్ల లెక్కన తిరిగి రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి (పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చించి) నేరుగా కాకినాడ వంటి పోర్టుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. ఈ విధంగా పేదల కోసం ప్రభుత్వాలు పంపిణీ చేసే ఉచిత బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. కాకినాడ వంటి పోర్టులు కేంద్రంగా వేల టన్నుల పీడీఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) బియ్యం నౌకల ద్వారా విదేశాలకు తరలిపోతోందంటూ వచ్చిన ఆరోపణల దృష్ట్యా పేదలకు పంచే ఈ బియ్యం అక్రమ రవాణా మూలాల శోధన కోసం సీనియర్ ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. మొన్న కాకినాడ పోర్టులో అక్రమంగా ఎగుమతి చేస్తున్న కొన్ని వందల టన్నుల పేదల బియ్యాన్ని కలెక్టర్ పట్టుకోగా, స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సివిల్ సప్లయ్ మినిస్టర్ నాదెళ్ల మనోహర్ వెళ్లి తనిఖీ చేశారు. అలానే మాజీ మంత్రుల గోడౌన్‌లో కూడా పట్టుకున్న పరిస్థితి. లోపభూయిష్టమైన ఈ పథకం వలన కొన్ని వేల మెట్రిక్ టన్నుల పేదల బియ్యం అక్రమ రవాణా జరుగుతుంది. అసలు బియ్యం పథకం ఉన్నది పేదలకు ఇవ్వడానికా ఎగుమతులు చేయడానికా అనే స్థితికి ఈ పథకం చేరింది. పేద ప్రజల కోసం పెట్టిన ఈ పథకం ఇలా రంగు మార్చుకుని అవినీతికి ఆలవాలంగా మారిపోవడం బాధాకరం.

గత ప్రభుత్వ హయాంలో డీలర్ల వ్యవస్థను పక్కనపెట్టి ఇంటి వద్దకే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండియుల) ద్వారా బియ్యం పంపిణీ చేసే కొత్త వ్యవస్థకు తెరలేపి, కొంత మంది మధ్యవర్తులు, ఎండియుల ద్వారా అక్రమ రవాణా జరిపారని విమర్శలు ఉన్నాయి. గత సంవత్సర కాలంలో రాష్ట్రంలో సుమారు 6.43 లక్షల క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది.

గడచిన 42సంవత్సరాల చంద్రబాబు హయాంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా జరిగినటువంటి గొప్ప సంస్కరణ– ప్రజా పంపిణీ వ్యవస్థని ePOS మెషిన్ ద్వారా ఇచ్చి, ముఖ్యంగా మరణించిన లబ్ధిదారులను, నకిలీ లబ్ధిదారులను గుర్తించి, కొంతమంది డీలర్ల ద్వారా జరిగే అక్రమాలను అడ్డుకట్ట వేయడం, ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం. కానీ ఇప్పుడు కొంతమంది ఉచిత బియ్యం అవసరం లేని లబ్ధిదారులే ఈ బియ్యం అడ్డదారులు తొక్కడానికి పరోక్ష కారకులు అవుతున్నారు. ఆహార భద్రత చట్టం ప్రకారం, రేషన్ బియ్యం అనేది లేకుంటే మార్కెట్‌లో బియ్యం ధరలు కూడా ఆకాశాన్నంటే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం కేజీకి రూ.43 వరకు వెచ్చించి పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తుంటే, రాష్ట్రంలో ఎక్కువ శాతం లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని వాడకుండా, బియ్యాన్ని దోశల్లోకి, బియ్యపు పిండికి, కోళ్లకి దాణాగా అధికంగా వాడుతున్నారు. పేదలకు ఇచ్చే ఉచిత బియ్యం పథకంలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఈ దేశంలో పేదవాడికి వరమైన ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా అరికట్టవలసిన అవసరం చాలా ఉంది. రాష్ట్రంలో నాలుగు దశాబ్దాల పైబడి అమలవుతున్న బియ్యం పథకంపై సమీక్ష, చర్చ జరిపి పరిష్కారం కనుక్కోవడం అత్యవసరం. ఎన్డీఏ ప్రభుత్వం, చంద్రబాబు సారథ్యంలోనే ఈ సమస్యకు పరిష్కారం సాధ్యం.

○ యార్లగడ్డ వెంకట్రావ్
ప్రభుత్వ విప్ & గన్నవరం శాసనసభ్యులు



ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ..? 2024 మొదట్లో అందరి మదిలో మెదిలిన ప్రశ్న ఇది. 12 నెలలు గిర్రున తిరిగిన తర్వాత కానీ తెలియలేదు ఆ ప్రశ్నకు సమాధానం. ఎన్నో సంఘటనలు.. కొన్ని ఉత్సాహం కలిగించేవే, మరికొన్ని ఊహాకందనివే. అయినా కళ్లు మూసి తెరిచేలోపు అన్నీ చకచకా జరిగిపోయాయి. ఐదేళ్ల ప్రజా వ్యతిరేక పాలన నుంచి బయటపడి టీడీపీ కూటమి విజయం సాధించి, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం ఉత్సాహం కలిగించినదే అయినా.. ఎన్నడూ లేనంతగా బుడమేరు వి రుచుకుపడి విజయవాడ నగరాన్ని ముంచేయడం ఊహాకందని సంఘటన. స్వరాజ్యమైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ వి గ్రహావిష్కరణ 2024లోనే జరగ్గా, కూటమి ప్రభుత్వం వచ్చాక మొట్టమొదటి అంతర్జాతీయ డ్రోన్ సమ్మిట్‌కు విజయవాడ వేదిక కావడం శుభపరిణామాలే. ఇక ఇంద్రకీలాద్రి నుంచి శ్రీశైలానికి సీ ప్లేన్ సేవలకు సీఎం చంద్రబాబు ట్రయల్ రన్ నిర్వహించగా, ఐదేళ్ల పాటు వెనుకపడిన అభివృద్ధి పనులకు అడుగులు ముందుకు పడి కొత్త ఆశలు రేపాయి. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా.. వంటి ప్రముఖుల పర్యటనలకు ఈ ఏడాది వేదికైంది. ఐదేళ్లలో వైసీపీ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ ప్రస్తుతం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తుండగా, కొత్త ఏడాది అమరావతి 2.0కు శ్రీకారం చుడుతూ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకోవడంతో పండుగ వాతావరణం ఏర్పడింది. ఏదిఏమైనా గత అనుభవాలను ఆవాహనం చేసుకుంటూ ముందుకు సాగుతూనే.. ఈ కొత్త ఏడాదిలో కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిద్దాం.



మే 7న నగరంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబు, ...



2024 కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

ఉమ్మడి కృష్ణాలో సంచలనాలకు వేదికగా 2024

- ఎన్నికల విజయనామ సంవత్సరంగా పేరు
- రెండు జిల్లాల్లోనూ టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్
- వైసీపీని చాపచుట్టేసిన కృష్ణావాసులు
- కొల్లు రవీంద్రకు దక్కిన మంత్రి పదవి
- బెజవాడను నిండా ముంచేసిన బుడమేరు
- పెను విషాదం మిగిల్చిన వరదలు
- ఏడాది ప్రారంభంలో జిల్లాలో ప్రధాని పర్యటన
- కలకలం రేపిన ముంబై నటి జెత్వానీ కేసు
- అంతర్జాతీయ డ్రోన్ సమ్మిట్‌కు విజయవాడ వేదిక
- ఇంద్రకీలాద్రి-శ్రీగిరి సీప్లేన్ సేవలకు అంకురార్పణ
- ఒక్కొక్కటిగా మొదలవుతున్న అభివృద్ధి పనులు
- బయటపడుతున్న వైసీపీ అవినీతి, అరాచకాలు

● అమరావతి 2.0కు కొత్త ఏడాదిలో శ్రీకారం



సెప్టెంబరులో బుడమేరు వరద



అక్టోబరులో జరిగిన డ్రోన్ సమ్మిట్



అక్టోబరులో ఇంద్రగిరి టూ శ్రీగిరి సీప్లేన్ ట్రయల్ రన్

నగరంలో అద్భుతాల ఆవిష్కరణ

2024, జనవరి 19న నగరంలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్టోబరు 22, 23న అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు నగరం వేదికైంది. ఈ సమ్మిట్‌లో భాగంగా కృష్ణానది తీరాన 5,500 డ్రోన్లతో ఏర్పాటుచేసిన షో అబ్బురపరిచింది. అలాగే, నగరవాసులకు సీప్లేన్ సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. డిసెంబరు 9న సీఎం చంద్రబాబు సీప్లేన్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. త్వరలో ఇంద్రకీలాద్రి నుంచి శ్రీశైలం వరకు తొలి దశలో సీప్లేన్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి.

- కథనం 8లో

ఈ-ఏడాది

2024లో పెరిగిన సైబర్ నేరాలు

- రూ.15 కోట్లు స్వాహా చేసిన నేరగాళ్లు
- ఎన్నడూలేనట్టు 41 శాతం పెరుగుదల
- రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం పెంపు
- కొట్లాట కేసులు కూడా ఎక్కువే..
- వార్షిక గణాంకాలు విడుదల చేసిన సీపీ

2024 ఈ-ఏడాదిగా మారింది. సైబర్ నేరాలు ఈసారి టాప్‌గేర్‌లోకి వెళ్లాయి. సాధారణ నేరాల కంటే ఈ నేరాలే బాగా పెరిగాయి. గడిచిన ఏడాది కంటే ఈ ఏడాది 41 శాతం సైబర్ నేరాలు పెరిగాయి. ఆ తర్వాత స్థానంలో రోడ్డు ప్రమాదాలు ఉన్నాయి. ఈ ఏడాది రోడ్డు ప్రమాద మరణాలు 20 శాతం పెరిగాయి. 2024 వార్షిక నేర గణాంకాలను బందరు రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీషాలి, తిరుమలేశ్వరరెడ్డి, మహేశ్వరరాజు, ఏడీసీపీలు ప్రసన్నకుమార్, జి.రామకృష్ణ, ఎం.రాజారావు వెల్లడించారు. ఆ వివరాలు.. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

● 2024 ఏడాదిని సైబర్ నేరాలు కమ్మేశాయి. 2023లో 3,329 సైబర్ నేరాలు జరిగితే, ఈ ఏడాది ఆ సంఖ్య 4,702కు చేరింది. గడిచిన ఏడాది కంటే ఈ ఏడాది సైబర్ నేరాలు 41 శాతం పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలో సైబర్ నేరగాళ్లు రూ.15 కోట్ల వరకు ప్రజల సొమ్మును కొల్లగొట్టారు. గత ఏడాది ఈ సొమ్ము రూ.10 కోట్లుగా ఉంది. డిజిటల్ అరెస్టు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వంటి నేరాల్లో ఈ డబ్బులు కాజేశారు. కేసుల నమోదులో గత ఏడాది కంటే ఈ ఏడాది 3.20 శాతం పెరుగుదల కనిపించింది. గత ఏడాది సైబర్ పోలీసులు 3,329 రశీదులు జారీ చేయగా, 63 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ ఏడాది 4,702 రశీదులు జారీ చేయగా, వాటిలో 155 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన పెంచడంతో ఒక నెలలో 69 మందిని డిజిటల్ అరెస్టు కాకుండా కాపాడారు.

● రోడ్డు ప్రమాదాల్లో ఈ ఏడాది 20 శాతం పెరుగుదల కనిపించింది. 2023లో మొత్తం 356 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 375 మంది ప్రాణాలు కోల్పోయి, 148 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 394 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 421 మంది ప్రాణాలు కోల్పోయి, 133 మంది గాయపడ్డారు.

● ఎన్నికల ఏడాది కావడంతో తీవ్రమైన కొట్లాటల కేసులు నమోదయ్యాయి. గడిచిన ఏడాది ఈ కేసులు 25 జరగ్గా, ఈ ఏడాది ఆ సంఖ్య


మిగతా 6లో..

రోడ్డు ప్రమాదాలు

2023	356 కేసులు	375 మరణాలు
2024	394 కేసులు	451 మరణాలు



సమావేశంలో సీపీ రాజశేఖరబాబు



ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2023-2024లో నేర వివరాలు

పేర్ని నాని కేసులో విచారణ ముమ్మరం



- పోలీస్ విచారణకు పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ హాజరు
- ఇప్పటికే పోలీసుల అదుపులో గోడౌన్ మేనేజర్
- టోల్ గేట్ల రికార్డుల ఆధారంగా దర్యాప్తు వేగవంతం

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల నుంచి 387 టన్నుల పీడీఎస్ బియ్యం మాయం కేసులో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కోటిరెడ్డిని పిలిచి విచారిస్తున్నారు. ఇప్పటికే పేర్ని గోడౌన్‌ల మేనేజర్ మానస్ తేజను అదుపులోకి తీసుకుని మరిన్ని వివరాలు రాబడుతున్నారు. టోల్‌గేట్ల వద్ద నమోదైన లారీల వివరాల ఆధారంగా దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మాజీ మంత్రి పేర్ని నాని భార్య పేర్ని జయసుధ పేరుతో పొట్లపాలెంలో ఉన్న బఫర్ గోడౌన్‌ను ప్రతి నెలా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేసి బియ్యం స్టాక్ మొత్తం ఉందా, నాణ్యత చెడిపోకుండా తీసుకుంటున్న చర్యలపై పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. ఇందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలను పంపుతూ ఉండాలి. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్‌గా కోటిరెడ్డి రెండేళ్లుగా పనిచేస్తున్నారు. పొట్లపాలెంలోని బఫర్ గోడౌన్‌లో తనిఖీలు సక్రమంగా చేశారా లేదా అనే అంశంపైనా పోలీసులు విచారణ చేస్తున్నారు. తనిఖీ చేసిన సమయంలో రికార్డులలో నమోదు చేసిన లెక్కల వివరాలను పరిశీలిస్తున్నారు.

మిగతా 6లో..

విజయవాడ పశ్చిమ బైపాస్ చకచకా

ఆంధ్రజ్యోతి, విజయవాడ : ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల వివాదం ప్రశాంతంగా ముగియటంతో.. విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే 95 శాతం మేర విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 5 శాతం పనులలో నాలుగు చోట్ల వెహికల్ అండర్ పాస్ (వీయూపీ)ల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. గొల్లపూడి దగ్గర లో లెవల్ సమస్య ఉంది. పెండింగ్ ఉన్న వాటిలో ఇప్పటికే రెండు వీయూపీల దగ్గర చకచకా పనులు జరుగుతున్నాయి. దాదాపుగా పూర్తి కావస్తున్నాయి కూడా ! వెదురుపావులూరు దాటిన తర్వాత రెండు చోట్ల ఈ వీయూపీ పనులు పురోగతిలో ఉన్నాయి. నైనవరం దగ్గర కొత్తూరు వెళ్ళే వైపు వీయూపీ దగ్గర గడ్డర్లు ఏర్పాటు చేయటంతో పాటు స్లాబ్ పోర్షన్ మిగిలిపోయింది టవర్ల అలైన్‌మెంట్ కారణంగా రైతుల ఆందోళనలతో ఈ పనులు నిన్నటి వరకు ఆగిపోయాయి. ఈ సమస్య పరిష్కారం కావటంతో ఈ పనులను కూడా చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. గొల్లపూడి దగ్గర లో లెవల్ విద్యుత్ లైన్ల సమస్య కూడా పరిష్కారం కావటంతో దీనికి సంబంధించిన పనులు చేపడుతున్నారు. మార్చి మూడో వారంలో విజయవాడ వెస్ట్ బైపాస్ ను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

పంటల పరిహారం పక్కదారి!

- శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీ యజమానికి, ఆయన కోడలికి పరిహారం జమ
- గౌడ సొసైటీ భూముల్లో పసుపు, అరటి పంటలు సాగు చేస్తున్నట్టు సృష్టి
- భూములే లేనివారికి వరదల పరిహారం రూ. 96,075 రావడంపై ఆగ్రహం
- ఇంకా వందల మంది బోగస్ రైతులు ఉన్నట్టు అధికారులకు ఫిర్యాదు

● ఆయన పేరు దండ భాస్కరరావు. శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీస్ అధినేత. తోట్లవల్లూరులో పురుగుల మందు, ఎరువుల వ్యాపారం చేస్తున్నారు. ఈయన తోట్లవల్లూరు నివాసి కాదు. ఈయనకు తోట్లవల్లూరు లంకల్లో ఎలాంటి భూములు లేవు. కానీ ఈయన సెప్టెంబరులో కృష్ణానది వరదలకు పంటలను నష్టపోయినట్టు రూ.48,615 పరిహారం ఆయన బ్యాంకు ఖాతాలో జమయింది.

● ఆమె పేరు వనజ. దండ భాస్కరరావుకు కోడలు. ఈమె కూడా తోట్లవల్లూరు నివాసి కాదు. ఈమెకు తోట్లవల్లూరు లంకల్లో ఎటువంటి భూములు లేవు. అయినా ఆమె సెప్టెంబరులో కృష్ణానది వరదలకు పంటలను నష్టపోయినట్టు రూ.47,460 పరిహారం ఆమె బ్యాంకు ఖాతాలో జమయింది. పైన పేర్కొన్న ఇద్దరూ గౌడ కులస్తులు కానప్పటికీ ఆ సొసైటీ భూములను సాగు చేసినట్టుగా పంట నష్టపరిహారం రావడం వ్యవసాయ అధికారి అవినీతికి అద్దం పట్టింది.



కృష్ణాజిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న బాధిత రైతు అశోక్‌కుమార్

తోట్లవల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరులో సంభవించిన కృష్ణానది వరదలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయారు. ఈ రైతులకు ఎన్యూమరేషన్ చేసి ప్రభుత్వం బాధిత రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. అయితే వ్యవసాయాధికారి, సిబ్బంది అవినీతికి పాల్పడి అక్రమార్కులకు పంట నష్టపరిహారం వచ్చేలా చేశారని ఆరోపణలు బలంగా వచ్చాయి. తోట్లవల్లూరులో శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీ యజమాని డి.భాస్కరరావుకు, ఆయన కోడలు వనజకు అక్రమంగా పంట నష్టపరిహారం జమయిన వివరాల జాబితా సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి లభించింది. సర్వే నెంబరు 331/1లోని గౌడ ఫీల్డు లేబర్ సొసైటీ భూముల్లో భాస్కరరావు 0.595 ఎకరాల్లో అరటి సాగు చేసి పంట నష్టపోయినందుకు రూ.20,825, 0.794 ఎకరాల్లో పసుపు సాగు చేసి నష్టపోయినందుకు రూ.27,790, కోడలు వనజకు 331/1లో 0.567 ఎకరాల్లో అరటి సాగు చేసినందుకు రూ.19,845, 0.789 ఎకరాల్లో అరటి సాగు చేసినందుకు రూ.27,615 వారిద్దరి బ్యాంకు ఖాతాల్లో రూ.96,075 జమయ్యాయి. ఈ విషయం రైతులకు తెలిసి అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఇతను వ్యాపారం నిమిత్తం తోట్లవల్లూరు రాగా, సెంటు భూమి కూడా లేదని, లంకల్లో ఎక్కడా వ్యవసాయం చేయటం లేదని, వారికి పంటనష్టపరిహారం ఎలా జమయిందని ప్రశ్నిస్తున్నారు.

పరిహారం విషయం ఏవోను అడగండి : శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీ యజమాని

పరిహారం విషయమై శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీ యజమాని డి.భాస్కరరావును సోమవారం వివరణ అడగ్గా.. ఆ విషయాన్ని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావును అడగమని చెప్పారు. తాను పురుగుమందుల వ్యాపారి కావడంతో తమ బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్లు వ్యవసాయాధికారి వద్ద ఉంటాయని, ఆయన ఏమి చేశారో ఆయన్నే అడగాలన్నారు.

ప్లీజ్ వార్త రాయొద్దు : వ్యవసాయ అధికారి

పరిహారం పక్కదారి పట్టించిన విషయంపై మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావును వివరణ కోరగా, వార్త రాయొద్దని వేడుకున్నారు. పురుగు మందుల వ్యాపారి అంతా మీరే చేశారని ఆరోపిస్తున్నారని తెలపగా, అన్ని విషయాలు తర్వాత చెబుతానని నాగేశ్వరరావు చెప్పటం ఆయన తప్పిదాన్ని ఎత్తి చూపిస్తోంది. తోట్లవల్లూరుకు చెందిన రైతు లంక అశోక్ కుమార్ సోమవారం వ్యవసాయాధికారి నాగేశ్వరరావుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తోట్లవల్లూరుకు చెందిన 40 మంది రైతులు రెండు నెలలుగా అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఇంత వరకు పంటల పరిహారం అందలేదని తెలిపారు.

నేడు నగరంలో విస్తృత తనిఖీలు

హెల్మెట్, డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు హోటళ్లకు నోటీసులు

విజయవాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికే సందర్భంలో నగరంలో ఎలాంటి అపశ్రుతులు లేకుండా చూడాలని పోలీసులు భావిస్తున్నారు. హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, ద్విచక్రవాహనదారులు, మద్యంబాబులను అదుపులో పెట్టడానికి పోలీసులు మంగళవారం నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ తనిఖీలు నిర్వహించనున్నారు. రామవరప్పాడు రింగ్, నేతాజీ బ్రిడ్జి, బెంజిసర్కిల్, పీసీఆర్ జంక్షన్, గొల్లపూడి వై జంక్షన్, ఇబ్రహీం పట్నం రింగ్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాలను తనిఖీల కేంద్రాలుగా నిర్ణయించుకున్నారు. వాటితో మరికొన్ని ప్రాంతాల్లో సిబ్బందిని నియమిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలపై చక్కర్లు కొట్టినా, మద్యం తాగి వాహనాలు నడిపినా వెంటనే కేసు నమోదు చేస్తారు. జరిమానాలు విధిస్తారు. హోటళ్లలో పార్టీలు నిర్వహించుకునే వారికోసం ప్రత్యేకంగా డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని ఆయా హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. పార్టీల్లో మద్యం తాగిన వారిని వాహనాలను ఎక్కనివ్వకుండా వాటిని నడపడానికి అదనంగా డ్రైవర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

సంక్రాంతికి సై ● పండక్కి సిద్ధమవుతున్న కోడిపుంజులు ● డిమాండ్‌ను బట్టి ధరలు 6

సంక్రాంతికి.. సై!

పందేలకు కాలుదువ్వుతున్న పుంజులు



మరో రెండు వారాల్లో సంక్రాంతి రానున్న నేపథ్యంలో జిల్లాలోని పల్లెల్లో పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. తెలుగు వారు చేసుకునే అతి పెద్ద పండుగల్లో ఒకటి సంక్రాంతి. పండుగ జరుపుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కుటుంబసభ్యులు, బంధువులు వారి వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. సంక్రాంతికి పిండి వంటలతో పాటు అనాదిగా వస్తున్న కోడి పందేలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. పోటీలకు సై అంటూ పందెం కోళ్లు కాలుదువ్వుతున్నాయి.

రానున్న సంక్రాంతి సంబరాల్లో బరిలోకి దిగి సమరానికి సై అంటూ సిద్ధం అవుతున్న పందెపు కోళ్లు.. కాకి డేగ, కాకి నెమలి, కోడి డేగా, నెమలి పింగళ, కోడి కాకి, సీతువా, అబ్రాస్, రసంగి, పచ్చకాకి మొదలగు రంగుల జాతుల కోళ్లు తగ్గేదే లేదంటూ సమరానికి కాలు దువ్వుతున్నాయి.

డిమాండ్‌ను బట్టి పుంజు ధర

కోడి పుంజు ధర డిమాండ్‌ను బట్టి ఉంటుంది. రూ.10 వేలు నుంచి కోడి రంగు జాతిని బట్టి లక్షల్లో ఉంటుంది. మేలు రకం జాతి పుంజు పెట్టతో గుడ్లను పొందిగిస్తారు. అప్పటి నుంచి 18నెలల పాటు పెంపకందార్లు పుంజును పెంచుతారు. 18 నెలల వచ్చిన పుంజులు సమరానికి సిద్ధం అయినట్లే. పెంపకం సమయంలో కోళ్లకు నెలకు ఒకసారి డీ వార్మింగ్, ఆరునెలలకు ఒకసారి వ్యాక్సిన్, బలానికి మందు బిళ్లలు వేస్తారు. రాగులు, సజ్జలతో పాటు బెల్లం, బాదం వంటి డ్రై ఫ్రూట్స్‌ను పెడతారు. ఉడికించిన మటన్ కైమా, కోడిగుడ్లు తినిపించి బలిష్టంగా తయారు చేస్తారు. చలాకీగా ఉండేందుకు ఈత కొట్టిస్తారు. వేడి నీళ్ల పోతలు, వేడి శాఖలు నడపడం, ఇతర కోళ్లతో పొట్లాడటం వంటివి నిర్వహిస్తారు. వాటిలో పోరాట పటిమ ఉన్న వాటిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో సమరానికి సిద్ధం చేస్తారు. ఈ పందేలకు విశాలమైన తోటలు కావాల్సి ఉంటుంది. తోటల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. ముసుగు పందేలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. కోళ్లను బరిలోకి దింపే ముందు వాటి ముసుగు తొలగించి పందేలు నిర్వహిస్తారు. దొంగలు, వైరస్ లాంటి వాటి నుంచి కోడి పుంజులను కాపాడుకోవడం కష్టమని పెంపకందారులు చెబుతున్నారు. ఒక్కొక్క కోడిని తయారు చేసేందుకు రూ.20 వేలు నుంచి 30 వేలు వరకు ఖర్చు అవుతుందని, అంతా బాగుంటే డబ్బులు వస్తాయని లేకుంటే నష్టం వస్తుందని పేర్కొన్నారు.

కుక్కుట శాస్త్రంపై అవగాహన ముఖ్యం

కోడిపందేల నిర్వాహకులకు కుక్కుట శాస్త్రంపై పూర్తి నమ్మకం ఉంటుంది. ఆ శాస్త్రానికి అనుగుణంగా సమయాన్ని బట్టి ఆయా రంగు జాతుల కోళ్లను బరిలోకి దింపుతారు. చికటి, వెన్నెలకు అనుగుణంగా రంగు జాతులను ఎంపిక చేసి పోటీలు నిర్వహిస్తారు.

(ఆంధ్రజ్యోతి-విస్సన్నపేట)















నూతన ఒరవడితో నిర్మాణాత్మక అభివృద్ధి

- సమష్టిగా పనిచేద్దాం.. జిల్లాను అగ్రపథాన నిలుపుదాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరంలో నూతన ఒరవడితో నిర్మాణాత్మక అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, సమష్టి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ వీసీ హాల్‌లో సోమవారం కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్రాభివృద్ధికి కొత్త సంవత్సరంలో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం కీలక భాగస్వామ్యంతో బుడమేరు వరదల సమయంలో చేసిన కృషి మంచి ఫలితాలు ఇచ్చిందని, సహాయక చర్యలతో పాటు ఆర్థిక సహాయం పంపిణీ వరకు బాధితులకు అండగా నిలవడంలో విజయవంతమయ్యామని పేర్కొన్నారు. ఇదేవిధంగా కొత్త సంవత్సరంలో సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు టీమ్ ఎన్టీఆర్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశంతో రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, 15 శాతం సగటు వృద్ధితో పాటు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పెద్ద ఎత్తున ఉపాధి సృష్టికి వీలుకల్పించే ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సేవా రంగం వృద్ధిలో భాగంగా జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని, కొత్త టూరిజం ప్యాకేజీ రూపకల్పనకు భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. నవ రాజధాని అమరావతికి ముఖద్వారమైన విజయవాడను పరిశుభ్ర, హరిత, సమృద్ధి నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఎన్జీవోలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ల ప్రతినిధులు తదితరుల సూచనలు, ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలతోపాటు అభివృద్ధికి సమప్రాధాన్యమిస్తున్నామని, కొత్త సంవత్సరంలోనూ ఇదే పంథా కొనసాగిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనం తప్పక అందుతుందని స్పష్టం చేశారు. డబ్బు ఆదాతో పాటు ప్రతిఒక్కరినీ పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా నడిపించేందుకు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని కొత్త సంవత్సరంలో మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపే దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రతిజిల్లా అధికారిని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి ప్రధానమని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధికి ఉపాధి కల్పనను అనుసంధానం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. మీడియా నిర్మాణాత్మక సూచనలు చేస్తూ జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



దుర్గగుడి హుండీల ఆదాయం లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఈవో

దుర్గమ్మకు రూ.2.70 కోట్ల ఆదాయం

- 15 రోజులకు హుండీ కానుకల లెక్కింపు

వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలు గడచిన 15 రోజులకుగాను సోమవారం మహామండపంలో ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణలో లెక్కించారు. రూ.2,70,66,162లు నగదు, 210 గ్రాముల బంగారం, 11 కిలోల 240 గ్రాముల వెండి కానుకల రూపంలో సమకూరాయి. యూఎస్‌ఏ డాలర్లు 536, ఆస్ట్రేలియా డాలర్లు 10, కువైట్ దీనార్లు అరబాగం, ఉగాండా షిర్లింగ్స్ 1000, యూరోలు 10, ఇంగ్లాండ్ పౌండ్లు 5, క్వతార్ రియాల్ ఒకటి, యుఏఈ దీర్హమ్స్ 5, స్కాట్‌ల్యాండ్ పౌండ్లు 20, కెనడా డాలర్లు 50, సింగపూర్ డాలర్లు 15 వచ్చాయి. హుండీల లెక్కింపు మంగళవారం కూడా కొనసాగుతుంది. అప్పటికీ మిగిలి ఉంటే జనవరి 2న లెక్కించనున్నారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు, అధికారులు, ఏఈఓలు, ఆలయ సిబ్బంది, పోలీసులు, అమ్మవారి సేవాదారులు తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలు కల్పించగా.. దుర్గమ్మ దర్శనానంతరం లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం, వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

పెండింగ్ నిధులు తెచ్చేందుకు కృషి

- హోంమంత్రిని కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం హోంమంత్రి వంగలపూడి అనితతో సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీసుశాఖకు సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీ-తెలంగాణ విభజన జరిగి పదేళ్లు గడిచినప్పటికీ 118 కీలక శిక్షణ సంస్థల ఏర్పాటు జరగలేదన్నారు. విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన రూ.1150 కోట్ల తాత్కాలిక నిధులను కూడా రాబట్టాల్సి ఉందన్నారు. పోలీసు స్టేషన్లు, జైళ్ల ఆధునికీకరణకు సంబంధించి పెండింగ్ నిధులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కేశినేని శివనాథ్ తెలిపారు. అనంతరం మంత్రి అనితకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించి, వెంకటేశ్వరస్వామి కొండపల్లి బొమ్మను బహూకరించారు. జనవరిలో హోంమంత్రి అనిత నాయకత్వంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి సమస్యలను వివరిస్తామని తెలిపారు. గ్రేహౌండ్స్, అప్పా వంటి కీలక సంస్థలను నెలకొల్పేందుకు కృషి చేస్తామన్నారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి ఐజీ విజయకుమార్, ఈగల్ చీఫ్ ఆర్.కె.రవికృష్ణ, ఎస్‌ఐబి ఎస్పీ గీతాదేవి, జైళ్ల శాఖ అదనపు ఎస్పీ రఘు, ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్, రాష్ట్ర సైనిక వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ బ్రిగేడర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హోంమంత్రి అనితకు వెంకటేశ్వరస్వామి చిత్రపటం ఇస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సర్పంచ్ సునీత

గడువులోగా పరిష్కరించాలి

- అధికారులకు కృష్ణా కలెక్టర్ ఆదేశం

పమిడిముక్కల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికి 'మీకోసం' కార్యక్రమంలో ప్రజల వినతులు, అర్జీలు స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. పమిడిముక్కల మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజలనుంచి వినతులు, అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. పమిడిముక్కల సర్పంచ్ ఎం.సునీత, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నాదెళ్ల సుబ్రమణ్యం, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. పమిడిముక్కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి ప్రణాళిక

- 3న మంత్రి నారా లోకేశ్‌తో ప్రారంభానికి సన్నాహాలు : కృష్ణా జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నుంచి నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నది. దీనిలో భాగంగా సోమవారం మచిలీపట్నం ప్రభుత్వ లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాలను జేసీ గీతాంజలి శర్మ సందర్శించారు. మచిలీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అవకాశాలను జేసీ పరిశీలించారు. 2025 జనవరి 3న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హిందూ కళాశాలలో జరిగే యువకెరటాలు కార్యక్రమానికి అతిథిగా హాజరుకానున్నారు. ఆ రోజు మచిలీపట్నం ఎస్వీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో నిర్మించిన నూతన భవనం ప్రారంభంతో పాటు ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించేందుకు ఏర్పాట్లను జేసీ పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి, ఇంటర్ జిల్లా అధికారి సాల్మన్‌రాజులతో చర్చించారు. మచిలీపట్నం లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాలలో 560



లేడీయాంప్తిల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

మంది బాలికలు విద్యనభ్యసిస్తుండగా.. వారిలో 120 మంది కళాశాల పక్కనే ఉన్న హాస్టల్‌లో భోజనం చేస్తున్నారు. మిగిలిన 440 మందికి కావలసిన బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు సమకూర్చేందుకు ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ మధుసూదనరావు, ఇంటర్ జిల్లా అధికారి సాల్మన్‌రాజు, డీఈవో రామారావు, ఎంఈవో దుర్గాప్రసాద్‌లతో చర్చించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనానికి కావలసిన వస్తువులను సమకూర్చాలన్నారు.

స్టోర్ రూమ్ అపరిశుభ్రతపై జేసీ ఆగ్రహం..

లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును జేసీ పరిశీలించి సంతృప్తి చెందినప్పటికీ స్టోర్‌రూమ్ శుభ్రత లేకుండా ఉండటంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీ విద్యార్థులకు భోజనం పెట్టే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యాశాఖాధికారులు పాఠశాలను సందర్శించినపుడు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించాలని ఆదేశించారు. కళాశాల ప్రాంగణంలో వాచ్‌మెన్ వసతి గృహంలో యువకులు ఉండటంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికలు చదివే ప్రాంగణంలో యువకులు ఉండటం ఏమిటని ప్రశ్నించారు. సరైన పర్యవేక్షణ ఉండాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుందరలక్ష్మికి జేసీ ఆదేశించారు.

పెనమలూరు ఈవోఆర్డీపై గ్రామస్థుడి దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు

పెనమలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న బి.శ్రీనివాసరావుపై గ్రామస్థుడు ముప్పాళ్ల బదరీనారాయణ సోమవారం కార్యాలయంలోనే దాడికి పాల్పడ్డాడు. పెనమలూరు గ్రామ పంచాయతీ అధికారులు, సెక్రటరీలపై తాను ఇచ్చిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారంటూ బదరీనారాయణ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీని ప్రశ్నించారు. నిబంధనల మేరకు విచారణ జరిపి నివేదికను పైఅధికారులకు తెలియపరుస్తామంటూ ఈఓఆర్డీ సమాధానం చెప్పడంతో బదరీ నారాయణ తాను చెప్పిన విధంగా రిపోర్టు తయారు చేయాలని ఒత్తిడి చేసి అసభ్యపదజాలంతో తిడుతూ దాడికి పాల్పడ్డాడని ఈవోఆర్డీ ఆరోపించారు. ఈవోఆర్డీ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు బదరీ నారాయణను అదుపులోకి తీసుకుని అతడిపై కేసు నమోదు చేశారు.



ఈఓఆర్డీ శ్రీనివాసరావు

నామమాత్రపు ప్రీమియంతో పంటల బీమా

వైసీపీ తప్పుడు ప్రచారంపై అచ్చెన్న ఫైర్

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం రైతులకు నామమాత్రపు ప్రీమియంతో పంటల బీమా అమలు చేస్తుంటే.. వైసీపీ కరపత్రం తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'జగన్ పాలనలో రైతులకు రాయితీలు లేవు. ఎరువులు అందలేదు. యంత్ర పరికరాలివ్వలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, అన్నదాతలకు తీరని అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మామిడి రైతులకు కూడా బీమా వర్తింపజేసి, పంటల బీమా సక్రమంగా అమలు చేస్తున్నాం. గతంలో టీడీపీ పాలనలో ఖరీఫ్, రబీ సీజన్లలో బీమా సక్రమంగా అమలు చేయడంతో పాటు పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించాం' అని మంత్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కేంద్రమంత్రిగా అమిత్‌షాకు నైతిక అర్హత లేదు

- నిరసన సభలో వామపక్ష నేతలు

గవర్నర్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్రమంత్రిగా కొనసాగే నైతిక అర్హత అమిత్‌షాకు లేదని వామపక్ష పార్టీల నేతలు స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా సోమవారం ఎంజీ రోడ్డులోని అంబేడ్కర్ 125 అడుగుల న్యాయ మహాశిల్పం వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను కించపర్చడం ద్వారా బీజేపీ నిజస్వరూపం, ఆర్ఎస్ఎస్ ఉద్దేశ్యం ఏమిటో అర్థమౌతోందన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చే రోజే దాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు ఆర్ఎస్ఎస్ ప్రకటించిందన్నారు. టీడీపీ, జేడీయూలపై ఆధారపడి అధికారంలో ఉన్న బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని అన్నారు. అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు తెలుపుతుంటే ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ముందుకు వస్తుంటే ప్రజలు వేలాదిగా తరలివస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ విషయంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజ్యాంగ దినోత్సవం జరుగుతున్న రోజున పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. అంబేడ్కర్‌ను అవమానించినందుకు ప్రజలకు అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్ల తాను ప్రధానమంత్రి కాగలిగానని చెప్పిన నరేంద్ర మోదీ, అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను సమర్థించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, సిపిఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.ప్రసాద్, కె.పోలారి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేత డి.హరినాథ్, వామపక్ష నేతలు అక్కినేని వనజ, రాయప్ప, వెంకటసుబ్బయ్య, జె.జానకిరాములు, ఎస్‌కె ఖాదర్‌బాషా, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతి వనం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నేతలు

విచారణ ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

బియ్యం మాయమైన ఘటన వెలుగులోకి రావడంతో కోటిరెడ్డి ఈ నెల 10వ తేదీన మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు గోడౌన్‌లను తనిఖీ చేసి, అందులో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్‌లలోని రికార్డులు, గోడౌన్ ఆవరణలో ఉన్న వెయింగ్ మిషన్ రికార్డులను స్వాధీనం చేసుకుని, పూర్తిస్థాయి వివరాలు రాబట్టేపనిలో ఉన్నారు. ఈ క్రమంలో గతంలో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్లుగా పనిచేసిన అధికారుల నుంచి కూడా పోలీసులు వివరాలు సేకరించారు. బియ్యం మాయం కేసులో ఏ-2గా ఉన్న గోడౌన్‌ల మేనేజర్ మానస్‌తేజను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

గోడౌన్‌ల మేనేజర్ నోరు విప్పితేనే..

ఇప్పటికే ప్రత్యేక పోలీస్ బృందాలు పేర్ని నాని గోడౌన్ నుంచి బియ్యం లోడ్ చేసిన లారీలు ఎక్కడి వరకు ప్రయాణించాయనే అంశంపై టోల్ గేట్ల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా విచారణ చేస్తున్నారు. ఈ విచారణకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ వాస్తవాలు వెల్లడిస్తేనే ఈ కేసులో అసలు నిందితులు ఎవరు, తెరవెనుక ఉన్న పెద్ద మనుషులు, బియ్యం విక్రయాల్లో ఉన్న వ్యాపారులు, బియ్యం రవాణాకు సహకరించిన వారు ఎవరు, తదితర వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పేర్ని నానికి చెందిన గోడౌన్‌ల నుంచి బియ్యం మాయమైన ఘటనపై ప్రత్యేక పోలీస్ బృందాలు ప్రతి చిన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని విచారణ చేస్తుండటం గమనార్హం.

బియ్యం మాయం కేసులో నలుగురు అరెస్ట్

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో గోడౌన్ మేనేజర్ మానసతేజ, పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, పెడన మండలం నందిగామకు చెందిన మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, బంటుమిల్లి మండలం పెనుమల్లికి చెందిన లారీ డ్రైవర్ బోట్ల మంగారావును మచిలీపట్నం తాలూకా పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరికి మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు.

ఈ-ఏడాది

(5వ పేజీ తరువాయి)

అదేవిధంగా ఉంది.

- మహిళలు, అమ్మాయిలపై ఈ ఏడాది అత్యాచారాలు తగ్గాయి. గడిచిన ఏడాది 16 అత్యాచార కేసులు నమోదు కాగా, ఈసారి 14 కేసులు నమోదయ్యాయి.
- ఈ ఏడాది 1,350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 267 మంది రవాణాదారులను అరెస్టు చేశారు.
- 116 మందిపై ఎన్‌డీపీఎస్ సస్పెక్ట్ షీట్లు తెరిచారు.
- నగరంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా 635 కేసులను పోలీసులు ఛేదించారు.
- వివిధ నేరాల్లో బాధితులు కోల్పోయిన సొత్తులో రూ.56,86,100 రికవరీ చేశారు.

'కొత్త'గా పనిచేస్తాం : ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

ఈ ఏడాది విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా వినియోగించాం. ట్రాఫిక్ నియంత్రణకు అస్త్రం అనే ఏఐ సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తీసుకొచ్చాం. దీనివల్ల నగరంలో ట్రాఫిక్ నిలుపుదల బాగా తగ్గింది. నగరంలో 112 కిలోమీటర్లు ఆగిపోయే ట్రాఫిక్‌ను 73 కిలోమీటర్లకు తగ్గించాం. ఐటీఎంఎస్ పనులు పూర్తికావచ్చాయి. కొత్త సంవత్సరంలో వీఎంఎస్ (వెరియబుల్ మెసేజింగ్ సిస్టం) బోర్డులను ఏర్పాటు చేయబోతున్నాం. ప్రభుత్వం 1,904 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇవికాకుండా మరో 121 సీసీ కెమెరాలు ఉన్నాయి. రాబోయే ఏడాదిలో 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించాం. జనవరిలో మొదటి దశలో 1,500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నాం. అదేవిధంగా ఫేసియల్ రికగ్నైజ్డ్ కెమెరాలను ఏర్పాటు చేసే ప్రణాళికలు తయారు చేశాం. త్వరలో ప్రజల భాగస్వామ్యంతో నగర సురక్ష సమితిని ఏర్పాటుచేసే ఆలోచనలు ఉన్నాయి. కొత్త సంవత్సరంలో క్లౌడ్ పెట్రోలింగ్‌కు మరిన్ని మెరుగులు దిద్దుతాం. ఇప్పటికే మా వద్ద 27 డ్రోన్లు ఉన్నాయి. వాటిని ఎగరవేయడానికి మహిళా పోలీసులకు డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇచ్చాం.

నల్లబ్యాడ్జీలతో లయోలా వాకర్స్ నిరసన



భారతీనగర్: ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం మొండివైఖరిని వ్యతిరేకిస్తూ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ సోమవారం లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



కనకదుర్గా కాలనీ సమీపంలో, పుల్లేటి కాలువ సమీపంలో, కరెన్సీ నగర్‌కాలనీ సమీపంలో మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

పూడికతో అవుట్‌ఫాల్ డ్రెయినేజీ

- చెత్త, వ్యర్థాలతో నిండి..
- పారుదల లేక దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- మూడో డివిజన్ శివారుకాలనీ వాసుల అగచాట్లు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

తూర్పు నియోజకవర్గ పరిధిలోని మూడో డివిజన్‌లోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయినేజీ (మురుగుకాల్వ) పూడికతో శివారు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాగార్జున నగర్, శ్రీరామ చంద్రనగర్, కరెన్సీనగర్, కనకదుర్గ నగర్ తదితర కాలనీల సమీపంలో మురుగు కాల్వ ప్రవహిస్తోంది. ప్రస్తుతం మురుగు కాల్వ పలు చోట్ల చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో నీరు సరిగా ప్రవహించే దారి లేకపోవడంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు వల్ల దోమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా విజృంభిస్తున్నాయి. ఎక్కడ ప్రజలు అనారోగ్యానికి గురవుతారోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

ఎంపీ కేశినేని శివనాథ్



వస్తువులను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్లమెంట్ నియోజకవర్గంలోని రూరల్, అర్బన్ ఎస్‌జీహెచ్ మహిళలు, టీవోఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్‌జీహెచ్ మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులను తయారు చేయటంతో పాటు ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. హోమ్ ఫుడ్స్, పేపర్ బ్యాగ్, బోటిక్స్, ఎంబ్రాయిడరీ క్లస్టర్‌లు ఏర్పాటు చేసేందుకు గ్రూపులుగా ఏర్పడాలని తెలిపారు. క్లస్టర్స్ ఏర్పాటు అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌కు సూచించారు. అవసరమైన వారికి హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ ఇప్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూసీడీ పీవో వెంకటరమణ, జిల్లా అర్బన్ మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ మీనాక్షి ఖడ్గరాజు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ సూయజ్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, మాజీ మేయర్ తాడి శకుంతల పాల్గొన్నారు.

సంజా ఉత్సవ్ సందర్శన

పటమట: వీఎంసీ ఆధ్వర్యంలో మారిస్ స్టెల్లా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సంజా ఉత్సవ్-2024 మేళాను ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి సందర్శించారు. ఉత్సవ్‌లోని అన్ని స్టాల్స్‌ను సందర్శించి, ఉత్పత్తిదారులను అడిగి వాటి వివరాలను తెలుసుకున్నారు. కళావేదిక మీద చిన్నారుల నృత్య ప్రదర్శనను తిలకించారు. చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ స్టాల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయనందుకు వీఎంసీ అధికారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, టీఎన్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, కార్పొరేషన్ యూసీడీ పీవో వెంకట రమణ, ఎన్టీఆర్ జిల్లా అర్బన్ మహిళా సమాఖ్య ప్రెసిడెండ్ మీనాక్షిలు పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్‌లో కిడూస్ గివింగ్ గాలా హ్యాపీ టు షేర్



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

మొగల్రాజపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సిద్ధార్థ నగర్‌లో ఉన్న లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో కిడూస్ గివింగ్ గాలా హ్యాపీ టు షేర్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు కుటుంబ పోషణలో పిల్లలకు కావాల్సినవి ఎలా సమకూర్చుతున్నారో అందుకోసం ఎంత శ్రమ పడుతున్నారో, సాటి మనిషికి సాయం ఎలా చేయాలో అనే విషయాలు పిల్లలకు తెలియడం కోసం ప్రతి పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పారు. స్టాల్స్ సందర్శించి విద్యార్థులను అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపాల్ సుధాప్రవీణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన ఆదాయాన్ని నగరంలో ఉన్న అనాధ, వృద్ధాశ్రమాలకు ఇస్తామని చెప్పారు.

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లెనిన్ సెంటర్‌లోని శ్రీ షిర్డినాగసాయి బాబా, నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో నాగమానసాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

బల్లెంవారి వీధి, మహానాడు రోడ్లను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్



ప్రత్యామ్నాయ రహదారులను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ

ఆటోనగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో వివిధ మార్గాల నుంచి లారీలు ప్రవేశించేందుకు బల్లెంవారి వీధి, మహానాడు రోడ్డు, శక్తి కళ్యాణ మండపం రోడ్లను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్‌తో పాటు గన్నవరం నుంచి మెట్రో కారిడార్ పనులు మొదలవుతాయన్నారు. ఈ పనుల వల్ల నగరంలో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుగుతుందని, ఆటోనగర్‌లోకి లారీలు రావడం కష్టతరమవుతోందన్నారు. ఈ పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించి త్వరితగతిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రజలు సజావుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెడుతున్నట్లు వెల్లడించారు. మురళీనగర్ నుంచి బల్లెంవారి వీధి, గన్నవరం విమానాశ్రయానికి రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, సబ్ కలెక్టర్ కావవూరి చైతన్య, ఈస్ట్ తహసీల్దార్ రోహిణి దేవి, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



లబ్బీపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని గత 15 సంవత్సరాలుగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్టు గొర్తి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. బాడవపేటలో సోమవారం ట్రస్టు, బాడవపేట యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 300 మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్‌లు వినోద్, విజయ్‌కుమార్, బాడవపేట యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు మోహన్ విజయ్, రాజశేఖర్, శాస్త్రి, అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే సామాజిక స్పృహ అవసరం

- సౌత్ ఏసీపీ బంగార్రాజు



విద్యార్థినిని అభినందిస్తున్న ఏసీపీ బంగార్రాజు, డాక్టర్ చైత్ర తదితరులు

కృష్ణలంక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలోని సుధాకర్ ఐడియల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 17వ వార్షికోత్సవం సోమవారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ సౌత్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉడతా బంగార్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు సామాజిక స్పృహను ఎలా పెంచుకోవాలో తెలియజేశారు. మొబైల్, సైబర్ క్రైం పట్ల ఎలా అప్రమత్తంగా వుండాలో తెలిపారు. ప్రత్యేక అతిథిగా నగరంలోని బ్రెస్ట్ సర్జన్, అంకాలజిస్ట్ డాక్టర్ చైత్ర సొంతినేని ముఖ్యమైన ఆహారపు అలవాట్లను తెలియజేశారు. పరీక్షల్లోను, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ జామి సుధాకరరెడ్డి, స్కూల్ డైరెక్టర్ దేవినేని వరలక్ష్మి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, డీన్ సురేష్ కుమార్, ఇన్‌చార్జి కనకదుర్గ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడుతున్న

కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పటమట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ డిపార్టుమెంట్‌లో అక్రమాలకు పాల్పడుతున్న అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని హోటల్ యజమానులతో కలిసి యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గజిటెడ్ ఫుడ్ కంట్రోలర్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబుకు లిఖిత పూర్వక ఫిర్యాదును అందజేశారు. హోటల్ యజమానులు తమ లైసెన్స్ రెన్యూవల్‌కు ఇచ్చిన దరఖాస్తులపై ఆమె, ఆమె భర్త ఫోన్ నెంబర్‌లను నమోదు చేసి లైసెన్సులను జారీ చేస్తుందన్నారు.

ఆ విధంగా చేయడం వల్ల లైసెన్సులు పొందిన హోటల్ యజమానులకు లైసెన్సు ఓటీపీ మెసెజ్‌లు రావడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో హోటళ్ల తనిఖీలు పేరుతో సంబంధిత సిబ్బందిని ఉసిగొల్పి హోటల్ యజమానులను వేధిస్తుందని బెజవాడ నజీర్ ఆరోపించారు. వేధింపులకు భయపడి ఆ ఉద్యోగినికి ముడుపులు సమర్పించాల్సి వస్తుందని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాష్ట్ర టీటీలో కిరణ్‌తేజకు రన్నరప్ టైటిల్



కోచ్‌తో కిరణ్ తేజ

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : కాకినాడలో ఇటీవల జరిగిన ఆంధ్ర రాష్ట్ర(అంతర్ జిల్లాల) టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో టీటీ అసోసియేషన్‌లో శిక్షణ పొందుతున్న పి. కిరణ్‌తేజ సత్తా చాటాడు. అండర్-15 బాలుర టీమ్ ఈవెంట్‌లో రన్నరప్ టైటిల్‌ను వశం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కోచ్‌లు షారూఖ్ అక్రమ్, ఎస్‌కే గౌస్ భాషా, ఏపీటీటీఏ సెక్రటరీ పి విశ్వనాథ్, ప్రెసిడెంట్ కేవీఎస్ ప్రకాష్, జిల్లా సెక్రటరీ బి. బలరామ్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌లు అభినందించారు.

పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల పట్ల పోలీసుల దౌర్జన్య కాండను వ్యతిరేకిస్తూ బెజవాడ బార్ న్యాయవాదుల సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతపురం త్రీ టౌన్ పోలీసు అధికారుల దురుసు ప్రవర్తన వల్ల ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతిచెందిన సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతికి సంఘీభావంగా, జల్లా సుదర్శనరెడ్డిపై పోలీసు అధికారులు దురుసుగా ప్రవర్తించిన తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి ర్యాలీగా ఐదవ నెంబరు రోడ్డు మీదుగా బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని న్యాయవాదుల పట్ల పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ప్రభుత్వాలు అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్, కార్యవర్గసభ్యులు కలతోటి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

అక్రమార్కులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆర్‌ఆర్ గార్డెన్

- లారీలు, ఆటోలు పార్క్ చేసి వదిలేశారు
- ఆటోలను బార్ అండ్ రెస్టారెంట్‌గా మారుస్తున్న జులాయిలు



ఆర్‌ఆర్ గార్డెన్ ప్రాంతంలో నిలిపి ఉన్న లారీలు , స్క్రాప్ ఆటోలు, ఖాళీ మద్యం సీసాల గుట్టలు

(పటమట, ఆంధ్రజ్యోతి)

తూర్పు నియోజకవర్గం పరిధిలోని పదో డివిజన్ టవర్‌లైన్ రోడ్డు ఆర్‌ఆర్ గార్డెన్ ప్రాంతం సాయంత్రం అయితే అక్రమార్కులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆ ప్రాంతంలో కొన్ని నెలలు నుంచి లారీలు, టిప్పర్లు, రోడ్డు మార్జిన్‌ల వెంబడి పార్క్ చేసి వదిలేశారు. దీంతో ఆ ప్రాంత మందుబాబులకు కలిసి వచ్చింది. సాయంత్రం నుంచి మందుబాబులు ఆగి ఉన్న లారీల వెనుక చేరి మద్యం, గంజాయి ఫూటుగా సేవిస్తున్నారు. రాత్రి వేళల్లో ఆ ప్రాంతంలో మహిళలు తిరగాలంటే భయపడుతున్నారు. లారీల పక్కనే పాడైపోయిన స్క్రాప్ ఆటోలను నిలిపి ఉంచారు. ఆగి ఉన్న ఆటోలను జులాయిలు, పోకిరీలు బార్ అండ్ రెస్టారెంట్‌గా ఉపయోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసుల నిఘా కొరవడటంతో పోకిరీలు మరింతగా రెచ్చిపోతున్నారని అంటున్నారు. ఆ ప్రాంతంలో భవన నిర్మాణం చేస్తున్న భవన యజమాని సెంట్రింగ్ బాదులు, ఇసుక గుట్టలు ఆ లారీలు పక్కనే పడవేశాడు. తాగేసి మందు సీసాలు అక్కడే గుట్టలు, గుట్టలుగా పడవేస్తున్నారు. ఆ పక్కనే ఆ ప్రాంతవాసులు వేసిన చెత్త, వ్యర్థాలు గుట్టలతో ఆర్‌ఆర్ గార్డెన్ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. సంబంధిత డివిజన్ శానిటరీ సిబ్బంది వెంటనే వ్యర్థాలను, చెత్తను తొలగించాల్సిందీగా స్థానికులు కోరుతున్నారు.



పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు

మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయండి



ఈ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. చీకటిపడితే ఆర్‌ఆర్ గార్డెన్ ప్రాంతమంతా ఓపెన్ బార్ అండ్ రెస్టారెంట్‌గా మారిపోతోంది. పోలీసు అధికారులు ఇక్కడ గస్తీ పెంచి మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాలి. - **వడ్లమూడి వెంకట్రావు, స్థానికుడు**

గంజాయి రవాణా చేస్తున్న మహిళ అరెస్టు

- నాలుగు కిలోల గంజాయి స్వాధీనం



నిందితురాలిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న మహిళను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రైల్వే స్టేషన్‌లో తనిఖీల్లో జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ నాయకత్వంలో సోమవారం విజయవాడ రైల్వేస్టేషన్ 9వ నెంబరు ప్లాట్‌ఫారంలో గంజాయి బ్యాగ్‌ను కలిగి ఉన్న మహిళను గుర్తించారు. అనుమానాస్పదంగా ఆమె తిరుగుతుండగా పోలీసులు ఆమె బ్యాగ్‌ను తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి లభించింది.

ఒడిస్సా రాష్ట్రంలోని సనహాళ్ల జిల్లాకు చెందిన ప్రమోద్ నాయక్ (41) ఒడిస్సాలో తక్కువ ధరకు లభిస్తున్న గంజాయిని చెన్నైకి తరలించి అక్కడ చిన్న పొట్లాలుగా చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లుగా తెలిపింది. ఆమె విశాఖపట్నం నుంచి టిక్కెట్ లేకుండా లోకమాన్య తిలక్ టెర్మినల్ రైలులో ప్రయాణించి విజయవాడలో దిగింది. చెన్నై వెళ్లటానికి మరో రైలు కోసం వేచి ఉన్న సమయంలో పోలీసులు ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ సీఐ జె.వి.రమణ, ఆర్‌పీఎఫ్ సీఐ ఫతే ఆలీ బేగ్ వివరాలను విలేకరులకు వెల్లడించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శన

వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదిక మీద విశాఖపట్నం, విశాలాక్షి నగర్‌కు చెందిన కూచిపూడి నాగచందన శిష్య బృందం సోమవారం నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం డీఈవో రత్నరాజు కళాకారులను అభినందించి వారికి అమ్మవారి ఫొటో, లడ్డూ ప్రసాదం అందచేశారు.

కొంచెం ఇష్టం

కొంచెం కష్టం

ఎన్టీఆర్, కృష్ణాజిల్లావాసులకు ఈ ఏడాది తీపిచేదుల మేలు కలయికగా మిగిలింది. తొలి ఆరు నెలలు వైసీపీ అరాచక పాలనలో మగ్గిన ప్రజలకు మలి ఆరునెలల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉపశమనం లభించింది. ఎన్నికల ఏడాది కావడంతో తొలి ఆరునెలల్లో వైసీపీ నేతలు చేసిన ఆగడాలకు అంతే లేకుండా పోయింది. ఈ ఏడాది ఏప్రిల్ 2న మూడు రాజధానులపై ర్యాలీ నిర్వహిస్తున్న మొండితోక బ్రదర్స్‌ను ప్రశ్నించినందుకు వారి అనుచరగణం నందిగామలో ఇద్దరిపై దాడి చేశారు. గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న వంశీ ఎన్నికలకు ముందు పలుపురు టీడీపీ నేతలపై దాడులకు తెగబడ్డారు. మచిలీపట్నంలో పేర్ని నాని తనయుడు కిట్టు, ఆయన అనుచరగణం కూడా రెచ్చిపోయింది. తారస్థాయికి చేరిన వైసీపీ ఆగడాలకు ఎట్టకేలకు ప్రజలు ముగింపు పలికారు.

- విజయవాడ - ఆంధ్రజ్యోతి







కూటమి పాలనతో అరాచకానికి స్వస్తి.. అభివృద్ధికి శ్రీకారం!

వైసీపీ అరాచకాలకు ముగింపు

మే 13న జరిగిన ఎన్నికల్లో కూటమి గెలుపు ఖరారైంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. వైసీపీ నేతల ఆగడాలకు ప్రజలు తమ ఓటు హక్కుతో బుద్ధి చెప్పారు. ఎన్నికలకు ముందు మే 7న ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడలో రోడ్ షో చేశారు. దానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. రికార్డు స్థాయి మెజారిటీతో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. జూన్ 13న గన్నవరం మండలం కేసరపల్లి వద్ద సీఎంగా చంద్రబాబు ఆయన మంత్రివర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కృష్ణా జిల్లా నుంచి కొల్లు రవీంద్రకు మంత్రి పదవి దక్కింది.

వెలుగు చూసిన అక్రమాలు

- ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూడటం ప్రారంభయ్యాయి. మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ తనయుడు అగ్రి గోల్డ్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఉదంతంలో ఆగస్టు 13న అరెస్టు అయ్యారు. జూన్ 18న దీన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.
- మరో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని తన సతీమణి పేరుతో ఉన్న గోడౌన్ నుంచి సుమారు 378 టన్నుల బియ్యాన్ని పక్కదారి పట్టించారు. ఈ ఉదంతాన్ని డిసెంబరు 10న ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ రెండు ఉదంతాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించాయి.
- ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు పెనుదుమారాన్నే రేపింది. తప్పుడు కేసులో జెత్వానీని ఇరికించిన ఉదంతంలో పలువురు ఐపీఎస్‌లు సస్పెన్షన్‌కు గురయ్యారు. వైసీపీ హయాంలోని ప్రభుత్వ పెద్దలు కూడా ఈ కేసులో పాత్రధారులుగా ఉన్నారు.
- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కె.శాంతి వివాదం రాష్ట్రవ్యాప్తంగా పెనుదుమారం రేపింది. ఆమె అవినీతిపై ఈ ఏడాది జూన్, జూలైలో ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో ఆమెను సస్పెండ్ చేశారు. తర్వాత ఆమె భర్త మదన్ రంగప్రవేశం చేసి శాంతికి పుట్టిన బిడ్డ తనది కాదంటూ ఏకంగా వైసీపీ ఎంపీ విజయసాయిపై ఆరోపణలు చేశారు.





డ్రోన్ సమ్మిట్‌లో డ్రోన్‌ను ఎగురవేస్తున్న సీఎం చంద్రబాబు



బుడమేరు పొంగడంతో నగరంలోని చొచ్చుకొచ్చిన వరద నీరు



పీడబ్ల్యుడీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం



గత ఏడాది సంచలనం రేకెత్తించిన కేసులో బాధితురాలు, సినీ నటి కాదంబరీ జత్వానీ



డిల్లీరావు



రాజాబాబు

2024 - రౌండప్

బుడమేరు మిగిల్చిన విషాదం

ఆగస్టు 30, 31న విజయవాడ నగరాన్ని వరుణుడు ముంచెత్తాడు. 50 ఏళ్లలో ఎన్నడూ కురవనంత వర్షం కురిసింది. ఓ వైపు ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో 10 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వచ్చింది. మరోవైపు బుడమేరు కట్టలు తెంచుకుని నగరంపై పడటంతో నగరం జలదిగ్బంధం అయింది. సుమారు లక్షన్నర మంది వరద ప్రభావానికి గురయ్యారు. వేల కోట్ల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. భారీ ఎత్తున పంట నష్టం ఏర్పడింది. ఇంత విపత్తులోనూ వైసీపీ తన కుట్రలను షరా మామూలుగా అమలు చేసింది. ప్రకాశం బ్యారేజీ గేట్లను డ్యామేజీ చేసేందుకు మూడు బోట్లను గొలుసులతో కట్టి ఆ పార్టీ నేతలు వరద నీటిలో వదిలేశారు. మరోవైపు సీఎం చంద్రబాబు విజయవాడ కలెక్టరేట్‌లోనే మకాం పెట్టి 10 రోజులపాటు వరద పనులను పర్యవేక్షించారు. విజయవాడ నగరాన్ని గాడినపెట్టిన అనంతరమే ఆయన అక్కడి నుంచి కదిలారు. ఈ వరదల బీభత్సానికి ప్రారంభమైన నాటి నుంచి ఒక్కరోజు కూడా మూతపడని చిట్టినగర్‌లోని విజయ డెయిరీ వరదల కారణంగా నెల రోజులపాటు మూతపడింది.

జంప్‌జిలానీలు..

ఎన్నికల ముందు పలువురు వైసీపీ నేతలు టీడీపీ పంచన చేరగా ఎన్నికల అనంతరం కొంత మంది కూటమి పంచన చేరారు. వైసీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరి, మైలవరం ఎమ్మెల్యేగా చేసిన వసంత కృష్ణ ప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యేగా చేసిన కె. పార్థసారథి ఎన్నికలకు ముందు వైసీపీని వీడి టీడీపీ, జనసేనల్లో చేరారు. టీడీపీ నేత మండలి బుద్ధ ప్రసాద్ జనసేనలో చేరి ఆ పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. టీడీపీకి చెందిన కేశినేని నాని, నల్లగట్ల స్వామిదాసు వైసీపీలో చేరారు. ఆ పార్టీ తరఫున విజయవాడ ఎంపీగా ఒకరు, తిరువూరు ఎమ్మెల్యేగా మరొకరు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. జగ్గయ్యపేట నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసిన సామినేని ఉదయభాను ఎన్నికల అనంతరం సెప్టెంబరు 19న వైసీపీకి గుడ్‌బై చెప్పి, జనసేనలో చేరారు. సెప్టెంబరు 12న జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర వైసీపీకి రాజీనామా చేశారు. మరుసటి రోజే టీడీపీలో చేరారు. దీంతో జగ్గయ్యపేట మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలో చేరింది.

కూటమి ప్రభుత్వం.. అభివృద్ధికి ఊతం

వైసీపీ హయాంలో కుంటుపడిన అభివృద్ధి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే గాడినపడింది. పెండింగ్‌లోని తూర్పు బైపాస్‌కు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మహానాడు జంక్షన్ నుంచి నిడమనూరు వరకు అతిపెద్ద ఫ్లై ఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. దీన్ని మెట్రో ఎలివేటెడ్ కమ్ ఫ్లై ఓవర్‌గా నిర్మించనున్నారు. విజయవాడలో లైట్ మెట్రో ఆశలు చిగురించాయి. పనులు చురుగ్గా సాగుతున్నాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పనులు పట్టాలెక్కనున్నాయి. నాగాయలంక మండలంలోని గుల్లలమోదలో మిస్సైల్ టెస్టింగ్ రేంజి నిర్మాణానికి కేంద్రం అనుమతిచ్చింది. ఇది దేశంలోనే రెండో క్షిపణి పరీక్ష కేంద్రం. అమరావతి నుంచి దేశంలోని కీలక ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పిస్తూ ఎర్రుపాలెం - నంబూరుకు రైల్వే లైన్‌కు కేంద్రం ఓకే చెప్పింది. దీంతో ఎన్టీఆర్ జిల్లాలోని పరిటాలకు మహర్దశ కలగనుంది. లాజిస్టిక్ హబ్‌గా రూపుదిద్దుకోనుంది. అక్టోబరు 29న భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్ దేవ్ విజయవాడ వచ్చారు. అమరావతి, విజయవాడ ప్రాంతాల్లో గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేసేందుకు చంద్రబాబుతో చర్చలు జరిపారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతి పునర్నిర్మాణానికి ఊతమిస్తూ రూ.15వేల కోట్ల ఆర్థికసాయం ప్రకటించారు. మచిలీపట్నం వైద్యకళాశాలకు అక్టోబరు 21న పింగళి వెంకయ్య పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 132ను జారీ చేసింది. సెప్టెంబరు 11న కృష్ణా నదికి నవహారతులు ట్రయల్ రన్ నిర్వహించారు. వైసీపీ హయాంలో అటకెక్కిన ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించింది.

కొత్త ప్రభుత్వం.. నయా అధికారులు

ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో జిల్లా అధికారుల బదిలీలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. వీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన స్వప్నిల్ దినకర్‌ను జూలై 3న బదిలీ చేశారు. ఆయన స్థానంలో ధ్యాన చంద్ర కొత్త కమిషనర్‌గా వచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన డిల్లీరావును బదిలీ చేసి ఆయన స్థానంలో జూలై 28న సృజనను నియమించారు. అక్టోబరు 17న ఆమె డీవోపీటీ ఆదేశాలతో తెలంగాణకు వెళ్లిపోయారు. ఆమె స్థానంలో కొద్ది రోజులు జేసీ నిధి మీనా ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఉన్నారు. ఆ తర్వాత లక్ష్మీశ కలెక్టర్‌గా వచ్చారు. విజయవాడ సీపీగా జూలైలో పీహెచ్‌డీ రామకృష్ణ స్థానంలో ఎస్వీ రాజశేఖర్ బాబు వచ్చారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన రాజాబాబుపై ఏప్రిల్‌లో వేటు వేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకుగాను ఆయనపై కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో ఆయనపై వేటు పడింది. ఆయన స్థానంలో బాలాజీని కలెక్టర్‌గా నియమించారు.



పవన్‌కు వివరాలను చెబుతున్న మనోహరనాయుడు, గోళ్ల నారాయణరావు

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వచ్చే నెల 2 నుంచి జరగబోయే పుస్తక మహోత్సవం వివరాలను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు మనోహరనాయుడు, గోళ్ల నారాయణరావు ఆయనను సోమవారం కలిశారు. పుస్తక ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనల వంటి అంశాల గురించి డిప్యూటీ సీఎంకు తెలిపారు. ఈ బుక్ ఫెస్టివల్ సాహిత్య ప్రేమికులకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని, సాహిత్యాన్ని ప్రోత్సహించే దిశగా విశేషమైన రీతిలో కొనసాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవాల్సిందిగా పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. దీనికి ఆయన అంగీకరించారు.

చలసాని పేరుతో వైసీపీ ఫేక్ ఐడీ

- తప్పుడు ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు
- కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు

చిట్టినగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శాశ్వత సభ్యత్వం ఉన్న తనపై బురద చల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరిట ఫేక్ ఐడీ కార్డుని సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సోమవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులుగా సోషల్ మీడియా గ్రూపులలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరిట ఫేక్‌ఐడీ కార్డుని సృష్టించిన తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. 1987 నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా ఉన్నానని, పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పలు పదవులు నిర్వహించానన్నారు. తనకు ఎలాంటి సంబంధం లేని వైసీపీలో సభ్యుడిగా తన ఫొటో, తన వ్యక్తిగత వివరాలతో ఒక ఫేక్ ఐడీ కార్డును సృష్టించి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్నారన్నారు. తన వ్యక్తిగత, సామాజిక ప్రతిష్టకు భంగం కలిగేలా ఫేక్ ఐడీ కార్డును వివిధ గ్రూపులకు ప్రచారం చేస్తూ కొంతమంది వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఇటువంటి అసత్య ప్రచారులు చేసేవారిపై తగిన చర్యలు తీసుకుంటామని చలసాని హెచ్చరించారు.

చంద్రబాబు ఇంటిపై దాడిచేసిన వారందరికీ శిక్ష

వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో సోమవారం ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ సీఐడీ విచారణకు హాజరయ్యారు. మంగళగిరిలోని సీఐడీ కార్యాలయంలో అధికారుల ముందు హాజరుకాగా, సీఐడీ అధికారులు ఆయన నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆరోజు జరిగిన సంఘటన దృశ్యాలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను రాకేష్ సీఐడీ అధికారులకు అందించారు. ఆ సంఘటనలో డూండీ రాకేష్ గాయపడ్డారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఏ ఒక్కరూ కూడా చట్టం నుంచి తప్పించుకోలేరని, అందరికీ శిక్ష పడుతుందని హెచ్చరించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల

తుది జాబితా విడుదల

- 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు
- అత్యధికంగా గుంటూరులో... అత్యల్పంగా ఏలూరులో ఓటర్లు

ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పోలింగ్ బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఏలూరు	20	9858	6218	1	16077
కృష్ణా	76	35378	27807	5	63190
ఎన్టీఆర్	101	45540	32685	13	78238
గుంటూరు	118	62277	45318	18	107613
బాపట్ల	28	15292	9150	5	24447
పల్నాడు	73	37831	19129	4	56964
మొత్తం	416	206176	140307	46	346529

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విడుదల చేశారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఫైనల్ లిస్టుని పబ్లిష్ చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆ జాబితాని అందజేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ ఓటర్ల లిస్టులను ప్రచురించారు. ఈసీ నిబంధనల మేరకు ఈ నెల 9వరకు వచ్చిన క్లెయిమ్‌లన్నింటిని విచారించి అర్హత కలిగిన వారికి ఓటుహక్కు కల్పించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక మరో 3 నెలల్లో జరగనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తాజా ఓటరు నమోదు ప్రక్రియని అక్టోబరు నెలలో ప్రారంభించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తుని సచివాలయాల సిబ్బంది ద్వారా క్షేత్ర పరిశీలన చేయించి ఏఈఆర్‌వోల రిమార్కులతో ఈఆర్‌వోకు నివేదించారు. వాటిని ఈఆర్‌వో ఎస్ షేక్ ఖాజావలి ఆమోదించారు. తిరస్కరించిన వాటికి గల కారణాలను కూడా పరిశీలించి ఆమోదం తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు కల్పించారు. ఇందులో పురుషులు 2 లక్షల 6 వేల 176, స్త్రీలు లక్ష 40 వేల 307, ఇతరులు 46 మంది ఉన్నారు. ఇందుకోసం 416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఓటరు నమోదు ప్రక్రియ అనేది నామినేషన్ల దాఖలు వరకు జరుగుతుందని ఈఆర్‌వో ఖాజావలి తెలిపారు. అయితే ఇప్పటి నుంచి ఓటుహక్కు కల్పించే వారి పేర్లు ఆయా పోలింగ్ బూత్‌ల ఓటరు జాబితాల్లో సప్లిమెంట్‌లుగా చేరుస్తామన్నారు.

మన్మోహన్ దహన ప్రదేశంపై చింతా అభ్యంతరం



ధర్నాచౌక్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): అనాథలు, బిచ్చగాళ్లను దహనం చేసే ప్రదేశంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను దహనం చేయడం దురదృష్టకరమని, ఈ చర్య దేశానికి, దేశ ప్రజలకు అవమానమని దీనికి కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లిన ఆయనకు ఢిల్లీలో అర ఎకరం స్థలం కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రధానిగా ఆయన పదేళ్ల నిజాయితీగా ఈ దేశానికి సేవలందించారని కొనియాడారు. ఉపాధిహామీ చట్టం, మిడ్‌డే మీల్స్, ఓబీసీలకు 27 శాతం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కు సోనియా గాంధీ, మన్మోహన్‌కే దక్కుతుందన్నారు. అంబేడ్కర్ గురించి అమిత్‌షా అవమానకంగా మాట్లాడటాన్ని ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై దళితులు అసంతృప్తిగా ఉన్నారన్నారు. అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు 5 సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చింతా మోహన్ డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలి

ధర్నాచౌక్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ) రాష్ట్రకార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగింది. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత, ఊరికి దూరంగా ఉన్న పీహెచ్‌సీల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, హెడ్ క్వార్టర్స్‌లో 24 గంటల పని చేసేలా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించడం జరిగింది. 2011 నుంచి ఇప్పటి వరకు ఒక్క పర్మినెంట్ పోస్టింగ్ అనేది స్టాఫ్ నర్సులకు జరగలేదని ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా శాంతకుమారి, జాయింట్ సెక్రటరీలుగా వరలక్ష్మి, జ్యోతి, పద్మజాను ఎన్నుకున్నారు. అధ్యక్షప్రధానకార్యదర్శులు రాధ, ఎస్.కోటమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాన్సన్, వైస్ ప్రెసిడెంట్ మంగేష్ వివిధ జిల్లా నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు ఎస్‌బీఐ కిట్లు



సామగ్రిని అందజేస్తున్న లక్ష్మీరెడ్డి

ధర్నాచౌక్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు ఎస్‌బీఐ సీఎస్ఆర్ యాక్టివిటీస్ ఆఫ్ గ్రేడింగ్ అంగన్వాడీ కేంద్ర అమరావతి సర్కిల్, మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు రకాల సామగ్రిని ఉచితంగా సోమవారం అందజేశారు. పిల్లలకు అవసరమైన వంట సామగ్రి, ఎల్‌సీడీ టీవీ కిడ్స్, చిల్డ్రన్స్ ప్లేయింగ్ కిడ్స్, వాటర్ ఫిల్టర్, పలు ఆట వస్తువులను ఎస్‌బీఐ సీఎస్ఆర్ యాక్టివిటీస్ ఆఫ్ గ్రేడింగ్ చైర్మన్ లక్ష్మీరెడ్డి చేతుల మీదు గా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఈకార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ఐసీడీఎస్ విజయవాడ అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు వి.విజయ, వి.నాగమణి, అంగన్వాడీ కేంద్ర సిబ్బంది, గిరిపురం అంగన్వాడీ కార్యకర్తలు సునీత, కళావతి, పద్మ, సుజాత పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ వరప్రసాద్ మృతి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎన్ఆర్ఎస్ వరప్రసాద్ ఆకస్మికంగా మరణించారు. అనారోగ్యంతో ఐదు రోజులుగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించారు. ఆయన అంత్యక్రియలను సోమవారం నున్నలో నిర్వహించారు. ఆయన స్థాపించిన వేద గంగోత్రి ఫౌండేషన్ ద్వారా సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించేవారు. రెండు, మూడుసార్లు రాష్ట్రస్థాయి నాటక పోటీలను నిర్వహించారు. ఈ సంస్థ ద్వారా అన్నదానాలు చేపట్టారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేఏ పాల్‌కు వ్యక్తిగత న్యాయవాదిగా వ్యవహరించారు. మా, మూవీ డైరెక్టర్ల అసోసియేషన్‌కు న్యాయసలహాదారుడిగా ఉన్నారు. సుమారుగా 40 చిత్రాల్లో నటించారు. ఆయన అంత్యక్రియలకు సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, రాజేంద్రకుమార్, దర్శకుడు రాజా వన్నెంరెడ్డి, గౌతం రాజు హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.మహేశ్వరరావు, ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు, ప్రభుత్వ న్యాయవాది సాయికృష్ణ, బాల భాస్కర్ ఆయన పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో వరప్రసాద్ సంతాప సభను కౌతా పూర్ణానందసత్రంలో నిర్వహించారు. పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్‌రాజు, జయప్రభ, జోషి, జయంతి చక్రవర్తి, చింతకాయల చిట్టిబాబు, దామోదర్ గణపతి, ప్రబల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
9
నవ్య డాక్టర్
మంగళవారం • 31 డిసెంబరు 2024





కొత్త సంవత్సరం

ఆరోగ్యంగా అడుగేద్దాం!

కొత్త సంవత్సరంలో సరికొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని మనందరం కోరుకుంటాం. అయితే ఆ ప్రయత్నానికి అడ్డొచ్చే ఆరోగ్య అవరోధాలను తెలివిగా అధిగమించాలి. అందుకోసం కొన్ని చిట్కాలు పాటించాలి.

దురలవాట్లను వదిలించుకోవాలన్నా, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నా, కొత్త సంవత్సరానికి మించిన గొప్ప సందర్భం మరొకటి ఉండదు. అధిక బరువు తగ్గాలనీ, వ్యాయామం చేయాలనీ, ఆరోగ్యకరమైన ఆహారశైలిని అనుసరించాలనీ... ఇలా కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోయే ముందు ఎన్నో తీర్మానాలు చేసుకుంటాం. అయితే కేవలం కొద్ది మంది మాత్రమే ఆ తీర్మానాలకు కట్టుబడి ఫలితాలను పొందగలుగుతారు. ప్రతి ఒక్కరూ ఎంచుకున్న ఆరోగ్య లక్ష్యాలను అందుకోవాలంటే, అందుకు కొన్ని సూత్రాలు పాటించాలి. అవేంటో తెలుసుకుందాం!

> పొట్ట నుంచి మెదడుకు సంకేతాలు అందడానికి 20 నిమిషాల సమయం పడుతుంది. కాబట్టి పొట్ట నిండిందనే భావన కలగడాని కంటే ముందే భోజనం ముగిస్తే, అనవసరపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా ఉంటాయి.

బరువు ఇలా తగ్గొచ్చు

శరీర బరువులో ఐదు నుంచి పది శాతం తగ్గినా గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి తీవ్ర రుగ్మతల ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. ట్రెండ్‌లో ఉన్న రకరకాల డైట్స్ తాత్కాలికంగా బరువు తగ్గించవచ్చు. కానీ శాశ్వత ఫలితం దక్కాలంటే ఒక క్రమ పద్ధతిలో వారానికి ఒక కిలో చొప్పున బరువు తగ్గించుకునే నియమాన్ని పెట్టుకోవాలి. అయితే బరువు తగ్గాలనే గట్టి పట్టుదల ఉన్నప్పుడు, తినే ఆహారంలో కూడా పరిమితి పాటించాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి.

ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు

కొత్త సంవత్సరం జంక్ ఫుడ్ మానేసి, పోషకభరితమైన ఆహారమే తినాలనే నియమం పెట్టుకుంటే, ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? ఎంత తింటున్నాం? అనే అంశాల మీద దృష్టి పెట్టాలి. ఈ రోజు సుష్టుగా తినేసి, మరుసటి రోజు ఉపవాసం ఉందాం అనుకుంటే పొరపాటు. పరిపూర్ణ ఆరోగ్యం కోసం నిర్దిష్టమైన ఆహారపుటలవాట్లను అనుసరించాలి అనుకున్నప్పుడు ప్రతి రోజూ అదే నియమాన్ని పాటించాలి. సరిపడా మోతాదులో పండ్లు, కూరగాయలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. వీటితో మాత్రమే తక్కువ క్యాలరీలు, తక్కువ కొవ్వులు, ఎక్కువ పీచు, విటమిన్లు, ఖనిజలవణాలు ఉంటాయి. అలాగే ఆహారం తినేటప్పుడు హడాహుడి ఏమాత్రం పనికి రాదు. పదార్థాలను ఆస్వాదిస్తూ, నెమ్మదిగా తినడం అలవాటు చేసుకోవాలి. భోంచేసేటప్పుడు టీవి, మొబైల్ ఫోన్ వాడకం మానేయాలి. పొట్ట నుంచి మెదడుకు సంకేతాలు అందడానికి 20 నిమిషాల సమయం పడుతుంది. కాబట్టి పొట్ట నిండిందనే భావన కలగడాని కంటే ముందే భోజనం ముగిస్తే, అనవసరపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా ఉంటాయి.

తక్కువ కూర్చోవాలి, ఎక్కువ కదలాలి

ఇప్పటివరకూ వ్యాయామం జోలికి వెళ్లనివాళ్లు, కొత్త సంవత్సరంలో జిమ్‌లో చేరిపోయి ఏకబిగిన వ్యాయామాలు చేయడం మొదలుపెడితే, ఆ క్రమం అలాగే ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చు. కాబట్టి కొత్త ఏడాది శరీరాన్ని చురుగ్గా ఉంచాలనే నియమం పెట్టుకోవాలి. వ్యాయామం చేయడమే కాకుండా, ఇంటికి దూరంగా వాహనాన్ని పార్క్ చేసి ఇంటికి నడిచి వెళ్లడం, లిఫ్టుకు బదులుగా మెట్లను ఉపయోగించడం, చిన్న చిన్న దూరాలకు నడకనే ఎంచుకోవడం లాంటివి చేయాలి. ప్రతి శరీరక కదలికకూ ఎంతో కొంత ప్రయోజనం ఉంటుంది. కాబట్టి కొన్ని నిమిషాలు తీరిక దొరికినా దాన్ని ఏదో ఒక చిన్నపాటి శరీరక శ్రమకు కేటాయించాలి. ఇల్లు సర్దడం, వాహనాలు కడగడం లాంటి పనులు కూడా వ్యాయమాలే!

వార్షిక పరీక్షలు

ఆరోగ్యంగా ఉన్నంత మాత్రాన వ్యాధులు దరి చేరవు అనుకుంటే పొరపాటు. వయసు పైబడే కొద్దీ శరీరం ఎన్నో మార్పులకు లోనవుతూ ఉంటుంది. వ్యాధినిరోధకశక్తి తగ్గడం, హార్మోన్ల స్రావాలు అదుపు తప్పడం, అంతర్గత ఆరోగ్య వ్యవస్థలు క్రమం తప్పడం లాంటి ఎన్నో మార్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. కాబట్టి ప్రతి ఏటా వైద్యులను కలుస్తూ, వయసుకు తగిన ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. కుటుంబ చరిత్రతో పాటు అప్పటికే ఉన్న రుగ్మతల తీవ్రతలను అంచనా వేసే పరీక్షలు చేయించుకోవాలి. ఇలా పరీక్షలు చేయించుకోవడం వల్ల, ముంచుకొచ్చే ఆరోగ్య ముప్పులను ముందస్తుగానే పసిగట్టగలుగుతాం. ఇలా తొలి దశల్లోనే వ్యాధులను కనిపెట్టగలిగితే చికిత్స కూడా ప్రభావవంతం, సులభతరం అవుతుంది.

ఒత్తిడి ఇలా చిత్తు

పరిపూర్ణమైన మానసిక, శరీరక ఆరోగ్యాల కోసం ఒత్తిడిని అదుపులో ఎలా ఉంచుకోవాలో తెలుసుకోవాలి. ఒత్తిడి అదుపు తప్పితే, శ్వాస వ్యాయామాలతో పాటు, నడక, సంగీతం వినడం, నచ్చిన పని చేయడం లాంటి వాటితో ఒత్తిడి ప్రభావం నుంచి బయటపడవచ్చు. తీవ్రమైన ఒత్తిడి ఆరోగ్యాన్ని కుదేలు చేస్తుంది. కాబట్టి ఒత్తిడిని ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి. అలాగే ఒత్తిడితో పెరిగే రక్తపోటు మీద ఓ కన్నేసి ఉంచాలి. నిద్రలేమి, ఒంటి నొప్పులు కూడా ఒత్తిడి తాలూకు దుష్ప్రభావాలే!

కంటి నిండా నిద్ర

కంటి నిండా నిద్రపోవడం ద్వారా వ్యాధినిరోధక శక్తి మెరుగు పడుతుంది. మెదడుకు, శరీరానికి సరిపడా విశ్రాంతి దొరికి, కొత్త శక్తిని పుంజుకుంటాయి. కాబట్టి కంటి నిండా నిద్రపట్టడానికి తోడ్పడే అలవాట్లను అలవరుచుకుని, నిద్రకు దూరం చేసే అలవాట్లకు స్వస్తి పలకాలి. నిద్రకు రెండు గంటల ముందు టీవీ, సెల్‌ఫోన్ వాడకం మానేయాలి. సౌకర్యవంతమైన పడక, వెలుతురు చొరబడని పరదాలు పడగ్గదిలో ఏర్పాటు చేసుకోవాలి. నిద్రాభంగం కలగడానికి వీల్లేని వాతావరణాన్ని పడగ్గదిలో కల్పించుకోవాలి. నిద్ర పట్టని సందర్భాల్లో పుస్తకం చదవాలే తప్ప, సెల్‌ఫోన్ అందుకోకూడదు. కమ్మని నిద్ర కోసం గోరువెచ్చని పాలు తాగవచ్చు. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేసినా ఫలితం ఉంటుంది.

ఎముకల ఆరోగ్యం

చలి ముదిరి పాకాన పడే సమయంలో కీళ్ల నొప్పులు విపరీతంగా పెరిగిపోతాయి. కదల్చడానికి వీల్లేకుండా బిగుసుకుపోతూ బాధించే కీళ్ల సమస్యలను ఈ కాలంలో ఎలా ఎదుర్కోవాలో తెలుసుకుందాం!

చలి పులికి కీళ్లు బలి

చలి కాలంలో చర్మం అడుగున రక్తనాళాలు కుంచించుకుపోయి, కీళ్లకు రక్తప్రసరణ తగ్గుతుంది. ఫలితంగా రక్తం ద్వారా కీళ్లకు అవసరమైన పోషకాలు అందకపోవడం వల్ల, మృదులాస్థి కుంచించుకుపోయి కీళ్లు బిగుసుకుంటాయి. ఇలాంటి ఇబ్బంది ఆస్టియో ఆర్థ్రయిటిస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ ఉన్నవాళ్లకు మరింత ఎక్కువ. ఈ సమస్యలన్నీ శీతాకాలంలో చలివల్ల ఎక్కువ అవుతాయి కాబట్టి ఈ సమస్యను వైద్య పరిభాషలో 'రేనాడ్స్ ఫినామినా' అని అంటారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఈ కాలంలో శరీర కదలికలు తగ్గడంతో రక్తప్రసరణ కూడా తగ్గిపోయి, చేతి వేళ్లు, మోకాళ్లు, మోచేతుల్లోని కీళ్లు పాక్షికంగా బిగుసుకుపోవడం, కదలికలు కొంత కష్టం కావడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. అదే సమయంలో స్వల్పంగా నొప్పులూ పెరుగుతాయి. ఈ కాలంలో వేధించే కీళ్ల నొప్పుల వెనక ఇతర కారణాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- **ఎసి:** ఆఫీసులు, సినిమా హాళ్లు... ఇలా ఎయిర్ కండిషనర్ల చల్లదనాన్ని చలికాలంలోనూ తప్పించుకోలేం! కానీ కీళ్ల నొప్పులు పెరగకుండా ఉండాలంటే ఎసిలకు దూరంగా ఉండాలి.
- **ఎండ సోకాలి:** ఆహారం ద్వారా అందే క్యాల్షియం శరీరం శోషించుకోవడానికి సరిపడా విటమిన్ డి అవసరం. ఇందుకోసం రోజు మొత్తంలో కొంతసేపైనా చర్మానికి ఎండ సోకేలా చూసుకోవాలి.
- **స్టిరాయిడ్లు, యాంటీబయాటిక్స్:** వీటి వాడకం వల్ల ఎముకలు గుల్లబారతాయి. వైద్యుల పర్యవేక్షణ లేకుండా, వైద్యులు సూచించకుండా వీటిని వాడకూడదు.


నొప్పులు తగ్గాలంటే?

- చలికి విరుగుడు వేడి కాబట్టి, చలితో పెరిగే నొప్పులు తగ్గాలంటే వెచ్చదనాన్ని పెంచాలి. ఇందుకు హీటర్లు, స్వెటర్లు వాడవచ్చు
- గోరువెచ్చని నీళ్లలో ఉప్పు వేసి కాళ్లు, చేతులు ముంచి వేళ్లు కదిలించినా ఫలితం ఉంటుంది
- చల్లని వాతావరణం, ఎసిలకు దూరంగా ఉండాలి
- ఎండ సోకేలా చూసుకుంటున్నా, కాలుష్యం కారణంగా సూర్యకిరణాలు సూటిగా చర్మానికి తగలవు. ఫలితంగా చర్మంలో సింథసిస్ సక్రమంగా జరగక, సరిపడా విటమిన్ డి తయారవదు. కాబట్టి వైద్యుల సూచన మేరకు విటమిన్ డి సప్లిమెంట్లు వాడుకోవాలి
- నొప్పులు భరించలేనంతగా ఉంటే, వైద్యుల పర్యవేక్షణలో స్టిరాయిడ్లు వాడవచ్చు
- చేతి వేళ్లలో నొప్పులు ఉన్నవాళ్లు హ్యాపీ బాల్ నొక్కే వ్యాయామం చేయాలి
- గ్రిప్పర్స్, ఎలాస్టిక్ గ్యాడ్జెట్స్ వాడాలి



మోకీలు అరుగుదల ఉంటే?

- మెత్తని సోఫాల్లో కూర్చోకూడదు. సోఫాలో కూర్చున్నప్పుడు మోకాలు 90 డిగ్రీల కోణంలో ముడుచుకుంటుంది. ఈ కోణంలో, మోకాళ్ల మీద భారం మోపుతూ లేచే ప్రయత్నం చేస్తే కీళ్ల అరుగుదల పెరుగుతుంది.
- ట్రెడ్‌మిల్, జుంబా, ఏరోబిక్స్‌కు బదులు మెత్తని పచ్చిక మీద నడక, సైకిల్ తొక్కడం, క్రాస్ ట్రైనర్ మొదలైన వ్యాయామాలు చేయాలి.
- మెత్తని బూట్లు వాడాలి
- ఈత, కీళ్లకు అనువైన వ్యాయామం
- నేల, బల్లల మీద పడుకోకూడదు
- బరువును అదుపులో ఉంచుకోవాలి.
- వైద్యులు సూచించిన ఫిజియోథెరపీ చేయాలి



కీళ్ల నొప్పుల్లో రకాలు

- **ఆస్టియో ఆర్థ్రయిటిస్:** పెరిగే వయసుతోపాటు, బరువు పెరగడం వల్ల, లేదా అంతకుముందు జరిగిన ప్రమాదాల్లో కీళ్ల దెబ్బతిని మొదలయ్యే కీళ్ల నొప్పులివి
- **రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్:** రోగనిరోధక వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల మొదలయ్యే కీళ్ల నొప్పులివి
- **గౌటీ ఆర్థ్రయిటిస్:** రక్తంలో యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు
- **సెప్టిక్ ఆర్థ్రయిటిస్:** ఇది చిన్నపిల్లల్లో సహజం. పిల్లలకు ఏదో ఒక సమయంలో చెవి, ముక్కు, లేదా ఛాతీలో ఇన్‌ఫెక్షన్ వస్తూ ఉంటుంది. ఆ సమయంలోనే ప్రమాదవశాత్తూ కిందపడి ఎముకలకు దెబ్బలు తగిలించుకుంటే, ఆ ప్రదేశంలో రక్తం గడ్డ కడుతుంది. ఆ రక్తం శరీరంలో మరో చోట ఉన్న ఇన్‌ఫెక్షన్‌ను ఆకర్షించి కీలుకు కీడు చేస్తుంది.

అవలోకనం



జన్యుపరమైన బధిర పిల్లలకు వినికిడిశక్తిని తిరిగి తీసుకురావడం మొదలు స్కిజోఫ్రీనియాకు కొత్త మందు వరకూ 2024 సంవత్సరంలో వైద్యరంగం ఎన్నో పురోగతులను సాధించింది. వాటి గురించి మరింత లోతుగా తెలుసుకుందాం!

వైద్య పురోగతుల బాటలో...

కొత్త మందుల అభివృద్ధి, చికిత్సా విధానాల పరంగా 2014లో వైద్య రంగం ఎంతో పురోగతిని సాధించింది. ఆటోఇమ్యూన్ వ్యాధికి కారణాన్ని కనుగొంది. చివరి దశకు చేరుకున్న అవయవ వైఫల్యానికి అత్యాధునిక ఔషధాన్ని అభివృద్ధి చేసి, సదరు రోగుల్లో ఆశలు చిగురింపజేసింది. ఇలా వైద్యరంగం సాధించిన మరిన్ని పురోగతులు ఏవంటే..

బధిర పిల్లల్లో కొత్త ఆశలు

వంశపారంపర్యంగా వినికిడిలోపాన్ని వెంట తెచ్చుకున్న పిల్లలు జన్యు థెరపీ ద్వారా ఆ లోపాన్ని అధిగమించగలుగుతున్నట్టు ది లాన్సెట్ అనే మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన ఒక వైద్య ప్రయోగం ఫలితం పేర్కొంటోంది. బోస్టన్‌లోని ఒక ఆస్పత్రిలో జన్యుపరమైన వ్యాధి మూలంగా వినికిడి శక్తిని కోల్పోయిన ఆరుగురు పిల్లల మీద పరిశోధకులు ప్రయోగాలు చేపట్టారు. జన్యు పరివర్తన ఫలితంగా చెవి నుంచి మెదడుకు శబ్ద సందేశాలు ప్రసారం కాలేని పరిస్థితి నెలకొన్నప్పుడు 'డిఎఫ్ఎన్‌బి9' అనే వినికిడి లోపం తలెత్తుతుంది. పనిచేసే జన్యు వెర్షన్‌ను మోసుకెళ్లే వైరస్‌ను లోపలి చెవిలో ప్రవేశపెట్టడం ద్వారా, వినికిడి లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసినప్పుడు, 26 వారాల తదనంతరం ఆరుగురిలో ఐదుగురు పిల్లలు వినికిడి శక్తిని తిరిగి పొందగలిగారు. ఇప్పటివరకూ ఇలాంటి వినికిడిలోపం కలిగిన పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్స్ ఒక్కటే ఏకైక ప్రత్యామ్నాయంగా ఉండేది. కానీ తాజా పురోగతితో పిల్లలు వినికిడి శక్తిని పొందడంతో పాటు, మాట్లాడగలుగుతారు. ఈ ప్రయోగ విజయంతో ఇతరత్రా జన్యుపరమైన కారణాల వల్ల తలెత్తే వినికిడి శక్తి లోపాలను సరిదిద్దే చికిత్సలకు మార్గం సుగమం అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు.

జన్యు పరివర్తన ఫలితంగా చెవి నుంచి మెదడుకు శబ్ద సందేశాలు ప్రసారం కాలేని పరిస్థితి నెలకొన్నప్పుడు 'డిఎఫ్ఎన్‌బి9' అనే వినికిడి లోపం తలెత్తుతుంది. పనిచేసే జన్యు వెర్షన్‌ను మోసుకెళ్లే వైరస్‌ను లోపలి చెవిలో ప్రవేశపెట్టడం ద్వారా, వినికిడి లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసినప్పుడు, 26 వారాల తదనంతరం ఆరుగురిలో ఐదుగురు పిల్లలు వినికిడి శక్తిని తిరిగి పొందగలిగారు.

పంది మూత్రపిండ మార్పిడి

2024 మార్చిలో, మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లోని సర్జన్లు, ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా జన్యుపరంగా సరిదిద్దిన పంది మూత్రపిండాన్ని విజయవంతంగా మనిషికి అమర్చగలిగారు. మూత్రపిండాలు విఫలమైనప్పుడు మూత్రపిండాల మార్పిడిని వైద్యులు ఎంచుకుంటూ ఉంటారు. అయితే అవయవాల కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితులో పంది మూత్రపిండాల్ని అమర్చే వెసులుబాటును వైద్యులు ప్రయోగాత్మకంగా పరిశీలించడం జరిగింది. అయితే ఇదే ఏడాది మేలో మూత్రపిండం స్వీకర్త ప్రాణాలు కోల్పోయినప్పటికీ, మూత్రపిండ మార్పిడి వల్లే అతను ప్రాణాలు కోల్పోయాడని నిర్ధారించే ఎలాంటి ఆధారాలు లేవని వైద్యులు ప్రకటించారు. అయితే కొత్త అవయవాల కోసం వేచి చూస్తున్న రోగులకు చికిత్సను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అవయవ మార్పిడిలో భాగంగా జంతు అవయవాలను ఉపయోగించినప్పుడు, రోగులకు అందించే ఉత్తమ సంరక్షణ గురించి తాము తెలుసుకోగలిగినట్టు, ఎమ్‌జిహెచ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ మెడికల్ డైరెక్టర్, డాక్టర్ లెనార్డో రీలా వివరించారు.

లూపస్ కారణం తెలిసింది

లూపస్ రుగ్మతలో శరీర రోగనిరోధక వ్యవస్థ, పొరపాటున సొంత ఆరోగ్య కణాలు, కణజాలాల మీద దాడికి పాల్పడుతూ ఇన్‌ఫ్లమేషన్‌ను కలిగిస్తూ, అవయవాలు, వ్యవస్థలను దెబ్బతీస్తూ ఉంటుంది. బర్మింగ్‌హ్యామ్ అండ్ విమెన్స్ హాస్పిటల్ అండ్ నార్త్‌వెస్టర్న్ మెడిసిన్‌కు చెందిన వైద్యుల బృందం, ఇలాంటి ఆటోఇమ్యూన్ లూపస్ వ్యాధికి అసలు కారణాన్నీ, దాన్ని సరిదిద్దే మార్గాన్నీ కనుగొంది. 19 మంది లూపస్ రోగులు, 19 మంది ఆరోగ్యకరమైన వ్యక్తుల రక్త నమూనాలను సరిపోల్చిన పరిశోధకులు, లూపస్ రోగులు ఉత్పత్తి చేసే టి కణాల్లో అసమతౌల్యాలున్నట్టు గుర్తించారు. వ్యాధికి స్పందించే శరీర వ్యాధినిరోధక స్పందనలో టి సెల్స్ అనే ఒక రకం తెల్ల రక్తకణాలు కీలక పాత్ర పోషిస్తూ ఉంటాయి. ఈ కణాల అసమతౌల్యాలను సరిదిద్దే నిర్దిష్ట మీడియేటర్లను కనిపెట్టగలిగినట్టు పరిశోధకులు చెప్తున్నారు.

కొత్త రకం స్కిజోఫ్రీనియా మందు

గత సెప్టెంబరులో ఎఫ్‌డిఎ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) 30 ఏళ్లకు స్కిజోఫ్రీనియాతో బాధపడే రోగుల కోసం ఒక కొత్త తరం ఔషధాన్ని ఆమోదించింది. కొబెన్‌ఫీ, అనే ఈ మాత్ర చిత్తభ్రమ, మతిభ్రమణం లాంటి స్కిజోఫ్రీనియా లక్షణాల నియంత్రణకు తోడ్పడినట్టు వైద్య ప్రయోగాల్లో నిరూపణ అయింది. ఏళ్ల తరబడి శ్రమకోర్చి కనుగొన్న స్కిజోఫ్రీనియా మొదటి తరం మందులు, డోపమైన్ రిసెప్టార్లను అడ్డుకోవడం ద్వారా సైకోసిస్‌ను నియంత్రించగలుగుతున్నాయి. అయితే ఇలా డోపమైన్ రిసెప్టార్లను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అడ్డుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలను భరించవలసి వస్తోంది. ఈ మందులు, రోగుల శక్తిని సన్నగిల్లేలా చేయడంతో పాటు, మానసిక కుంగుబాటుకు లోను చేసి, వారిలో పార్కిన్సోనియన్ దుష్ప్రభావాలను కూడా కనబరుస్తున్నాయి. కానీ అధునాతనమైన కొబెన్‌ఫీ ఔషధం డోపమైన్ వ్యవస్థ మీద ఎలాంటి ప్రభావం కనబరచకపోవడం విశేషం. కాబట్టి వేలమంది స్కిజోఫ్రీనియా రోగులకు ఈ మందును సూచించే ముందు, దీని ప్రభావాన్ని నిర్ధారించుకోవడంతో పాటు, వీలైనంత తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండేలా ఔషధాన్ని పర్యవేక్షించవలసిన అవసరం ఉందని వైద్యులు భావిస్తున్నారు.

ముత్యాల ముగ్గు

15 చుక్కలు, 5 వరసలు
5 వచ్చేవరకు, సరిచుక్క





రాధిక
వర్ని, నిజామాబాద్

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: features@andhrajyothy.com

అప్రమత్తం

చలికి పెరిగే గుండెపోటు ముప్పు

మిగతా కాలాలతో పోలిస్తే, చలి కాలంలో గుండెపోటు ముప్పు 53% పెరుగుతుంది. కుంచించుకుపోయిన రక్తనాళాలతో శరీరానికి వెచ్చదనాన్ని సమకూర్చే క్రమంలో శరీరం ఒత్తిడికి లోనవుతుంది. అంతే కాకుండా ఈ కాలంలో శారీకక శ్రమ కొరవడడం, క్యాలరీలు ఎక్కువ కలిగి ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవడం లాంటి కారణాలు కూడా గుండె పోటు ముప్పును అదనంగా తోడవుతాయి. కాబట్టి ఈ కాలంలో గుండె జబ్బు రోగులు, గుండెను సురక్షితంగా ఉంచుకోవడం కోసం విపరీతమైన చలి నుంచి రక్షణ పొందుతూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకునే ప్రయత్నం చేయాలి. గుండె మీద ఒత్తిడిని నివారించడం కోసం శరీరం వెచ్చబడే, చల్లబడే ప్రక్రి



యల్లో ఒక క్రమాన్ని పాటించాలి. ఒకేసారి చల్లని వాతావరణంలో నుంచి వేడి వాతావరణంలోకి, లేదా వేడి వాతావరణంలో నుంచి చల్లని వాతావరణంలోకి వెళ్లకూడదు. అలాగే ఈ కాలంలో దొరికే ఆకుకూరలు, పుల్లని పండ్లు, ఒమేగా3 ఫ్యాట్స్ కలిగి ఉండే వాల్‌నట్స్, అవిసె గింజలు తీసుకోవాలి. నూనెలో వేయించిన అల్పాహారాలు, తీయని పానీయాలు మానేయాలి. రక్తపోటును పరీక్షించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో మెలుగుతూ ఉండాలి. ఛాతీ నొప్పి, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది, విపరీతంగా చమట పట్టడం, అలసట మొదలైన లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

అవగాహన

క్యాన్సర్ కారకాలు ఇవే!

క్యాన్సర్ గురించి మనకెన్నో అపోహలున్నాయి. ఏం తింటే క్యాన్సర్ వస్తుందో, ఏం తినకుండా ఉంటే క్యాన్సర్ నుంచి తప్పించుకోవచ్చో నిరంతరం పరిశోధిస్తూనే ఉంటాం. అయితే క్యాన్సర్ నుంచి ప్రాణాలతో బయటపడిన రోగులను అధ్యయనం చేసిన నికోల్



యాండ్రూస్ అనే ఒక ప్రముఖ డైటీషియన్ మద్యం, ప్రాసెస్ చేసిన మాంసాలే ప్రధాన క్యాన్సర్ కారకాలనే విషయాన్ని వెల్లడించింది. ఆంకాలజీలో స్పెషలైజేషన్ చేసిన ఈ డైటీషియన్, మాంసం పాడైపోకుండా ఉండడం కోసం, వాటి రంగు మారకుండా ఉండడం కోసం జోడించే నైట్రైట్స్, నైట్రేట్స్ వల్లే ప్రాసెస్ మాంసం క్యాన్సర్ కారకంగా మారుతోందని స్పష్టం చేస్తోంది. అలాగే అత్యధిక తాపమానాల్లో మాంసాన్ని వండడం వల్ల, డిఎన్ఎను పాడు చేసే హెటిరోసైక్లిక్ అమైన్స్ మాంసాల్లోకి చేరుకుంటాయనీ, వీటి మూలంగా క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఆమె పేర్కొంటోంది. అలాగే చక్కెరను ప్రధాన క్యాన్సర్ కారకంగా భావిస్తూ ఉంటాం. కానీ పరిమితంగా తిన్నంత కాలం చక్కెరతో క్యాన్సర్ ముప్పు ఉండదని కూడా ఆమె అంటోంది.

రేవతి మృతికి అల్లు అర్జున్‌నే కారణం

- అతని బెయిల్ పిటిషన్‌పై పోలీసుల కౌంటర్
- ముగిసిన విచారణ... తీర్పు వచ్చే నెల 3న

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై నాంపల్లిలోని రెండో మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో విచారణ పూర్తయింది. ఈ బెయిల్ పిటిషన్‌పై చిక్కడపల్లి పోలీసులు సోమవారం కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ), అర్జున్ న్యాయవాది నిరంజన్ రెడ్డి మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. జడ్జి ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును వచ్చే నెల 3వ తేదీకి వాయిదా వేశారు. ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై ఉన్న అల్లు అర్జున్ సాధారణ బెయిల్ కోసం ఈ నెల 27న నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై తొలుత సమయం కోరిన పోలీసులు, తాజాగా కౌంటర్ దాఖలు చేశారు. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతికి అల్లు అర్జున్‌నే ప్రధాన కారణమని పీపీ గట్టిగా వాదించారు. ఆ సమయంలో అతను థియేటర్‌కు రావడం వల్లే తొక్కిసలాట జరిగిందని, అతనికి బెయిల్ ఇస్తే తన పలుకుబడితో సాక్షులను ప్రభావితం చేస్తాడన్నారు. అంతేకాక విచారణకు కూడా సహకరించడని, కాబట్టి అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. తొలుత నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ సంధ్య థియేటర్ ఘటనతో అల్లు అర్జున్‌కు ఎలాంటి సంబంధం లేదని, అందుచేత తొక్కిసలాటలో రేవతి మరణానికి కారణమంటూ అతనిపై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు వర్తించవని వాదించారు. అతనికి వ్యతిరేకంగా పోలీసులు సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదు కాబట్టే హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందని పేర్కొన్నారు.

శ్రీతేజకు మళ్లీ వెంటిలేటర్‌పై చికిత్స

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజకు మళ్లీ వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించాల్సిన అవసరం ఏర్పడిందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. శ్రీతేజకు మొదట్లో వెంటిలేటర్‌తో చికిత్స అందించగా కాస్త కోలుకోవడంతో దాన్ని తొలగించారు. మళ్లీ అతని ఆరోగ్యం పరిస్థితి కాస్త ఇబ్బందికరంగా మారడంతో రెండు రోజుల నుంచి వెంటిలేటర్ ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

పాఠశాలల్లో సోషల్ ఆడిట్

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీచేశారు. పాఠశాలల్లో అన్ని రికార్డులు, రిజిస్టర్‌లు ఆడిట్‌కు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని డీఈవోలను ఆదేశించారు. ఏపీ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ అడ్ ట్రాన్స్‌పరెన్సీ(ఏపీఎస్ఎస్ఏఏటీ) ద్వారా ఈ ఆడిట్ జరుగుతుందని తెలిపారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా పాఠశాల స్థాయి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు.

రఘురామ కేసులో ప్రైవేటు వ్యక్తికి నోటీసులు

- ఆయన విజయ్‌పాల్‌కు సన్నిహితుడు?

ఒంగోలు క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ హింస కేసులో ఒక ప్రైవేటు వ్యక్తిని విచారించనున్నారు. జనవరి 3న ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని కామేపల్లి తులసిబాబు అనే వ్యక్తికి విచారణాధికారి అయిన ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్ నోటీసులు ఇచ్చారు. అతను ఈ కేసులో అరెస్టు అయిన రిటైర్డ్ సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌కు సన్నిహితుడనే ప్రచారం ఉంది. అదేవిధంగా తులసిబాబు అనే వ్యక్తి తనను కొట్టిన వారిలో ఉన్నాడని, గుండెలపై కూర్చున్నాడని మాజీ ఎంపీ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఆరోపించారు. సదరు తులసిబాబు గుంటూరు జిల్లాతో పాటు గుడివాడ తదితర ప్రాంతాల్లో ఉంటూ విజయ్‌పాల్‌కు సన్నిహితంగా మెలుగుతుంటాడని ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో తులసిబాబును విచారించాలని ఎస్పీ దామోదర్ నిర్ణయించారు.

2025 కొత్త సంవత్సరం
కొత్త ఆశలు.. ఆకాంక్షలు

స్పేస్ టూరిజానికి రెక్కలు.. మరిన్ని అద్భుతాలు సృష్టించనున్న ఏఐ
శాటిలైట్ టోల్‌గేట్ వ్యవస్థ అమల్లోకి?.. కాస్తంత తగ్గనున్న భూతాపం!

గడియారంలో సెకన్ల ముల్లులా కాలం వేగంగా కరిగిపోయింది. నూతన సంవత్సర వేడుకల జ్ఞాపకాలు ఇంకా మదిలో మెదులుతుండగానే.. ఏడాది గడిచిపోయింది! 2024 కాలగర్భంలో కలిసిపోయి 2025 మన ముంగిటికి వచ్చేసింది. ఉగాది పచ్చడిలో రకరకాల రుచుల్లా.. గడిచిన ఏడాది కాలంలో కొన్ని తీపిజ్ఞాపకాలు.. కొన్ని చేదు అనుభవాలు.. కొన్ని అనూహ్య ఘటనలు.. కొన్ని సంచలనాలు! ఏదేమైనా అవన్నీ గతం. ఆ గతానికి చుక్క పెట్టి.. కొత్త ఏడాదికి స్వాగతం చెప్పే సమయం ఆసన్నమైంది. రాబోయే సంవత్సరంలో వివిధ రంగాల భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే అంశంపై సంబంధిత రంగాల నిపుణులకు ఆశాజనకమైన ఆలోచనలు, అంచనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం..



విద్యుత్తు వాహనాల జోరు



ఇప్పటికే మనదేశంలో విద్యుత్తు వాహనాలకు (ఈవీ) డిమాండు బాగా పెరిగింది. కొత్త సంవత్సరంలో ఈవీల సంఖ్య ఇంకా పెరుగుతుందని వాహనరంగ నిపుణులు చెబుతున్నారు. మారుతీ నుంచి మెర్సిడిస్ దాకా.. అన్ని శ్రేణుల్లోని కార్ల కంపెనీలూ విద్యుత్తు వాహనాలకు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా కొత్త మోడళ్లను మార్కెట్లోకి దించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక్క 2025లోనే అన్ని కంపెనీలవీ కలిపి కొత్తగా 19 ఈవీలు రోడ్లపైకి రాబోతున్నాయి.

ప్రయాణించిన దూరానికే టోల్ రుసుము



దేశంలో టోల్‌గేట్ల వద్ద రద్దీని ఫాస్టాగ్‌తో తగ్గించిన కేంద్ర ప్రభుత్వం.. శాటిలైట్ టోల్‌గేట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే! పైలట్ ప్రాజెక్టు కింద.. ఇప్పటికే ఎన్‌హెచ్-275 కర్ణాటకలో బెంగళూరు-మైసూరు నడుమ, హరియాణాలో ఎన్‌హెచ్-709పై పానిపట్-హిసార్ నడుమ ఈ టోల్‌గేట్ వ్యవస్థను పరీక్షించి చూశారు. ఈ పద్ధతిలో.. హైవేపై ఎంత దూరం ప్రయాణించారో అంతదూరానికి మాత్రమే టోల్ వసూలు చేస్తారు. ఎంపిక చేసిన జాతీయ రహదారులపై.. జీపీఎస్ వ్యవస్థ ఉన్న వాహనాలు రోజూ 20 కిలోమీటర్ల మేర ఉచితంగా ప్రయాణించే వీలు కల్పిస్తారు. ఈ విధానం 2025లో దేశవ్యాప్తంగా అమలు చేస్తారని అంచనా.

జన్యు సవరణ పంటలు!



బయోటెక్నాలజీ రంగంలో పురోగతి వ్యవసాయానికి చేస్తున్న మేలు అంతా ఇంతా కాదు! ఇప్పటికే దాని ఫలాలను మనం అనుభవిస్తున్నాం. అయితే.. 2025లో ఈ రంగంలో మరింత విప్లవాత్మక మార్పులు సంభవించే అవకాశం ఉందని, క్రిస్పర్ జన్యు సవరణ ప్రక్రియ ద్వారా.. కరువుకాటకాలను తట్టుకునే పంటలను సృష్టించవచ్చని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.


కృత్రిమ మేధ విశ్వరూపం

రెండేళ్ల క్రితం ప్రపంచానికి పరిచయమై 'ఇంతింతై వటుడింతై..' అన్నట్టుగా ఎదిగి దాల్చి 2024లో సామాన్య జనాల ఫోన్లలోకీ అందుబాటులోకి వచ్చేసిన జనరేటివ్ ఏఐ కొత్త సంవత్సరంలో మరిన్ని కొత్త రంగాలకు విస్తరించి.. విశ్వరూపం దాలుస్తుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. మన ఎదుర్కొనే రోజువారీ సమస్యలు చాలావాటిని కృత్రిమ మేధ పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. 2025 ఫిబ్రవరి 10-11 తేదీల్లో ఫ్రాన్స్‌లో జరిగే 'ఏఐ యాక్షన్ సమ్మిట్'లో.. కృత్రిమ మేధను ప్రజా శ్రేయస్సు కోసం వినియోగించే విధానాలపై చర్చించనున్నారు. మరోవైపు.. ఇన్నాళ్లుగా కృత్రిమ మేధ పరిశోధనల కోసం వేలాది కోట్ల రూపాయలు ధారపోసిన సంస్థల్లో ఒక దిగ్గజ సంస్థ కొత్త ఏడాదిలో తన పరిశోధనలకు ముగింపు పలుకుతుందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



- సెంట్రల్ డెస్క్

భూతాపం రివర్స్?



ఇప్పటిదాకా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాలుగా 2023, 2024 నమోదైన సంగతి తెలిసిందే! కానీ.. 2025 ఇందుకు భిన్నంగా ఉండబోతోందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. లానినా (పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు తగ్గడం) కారణంగా భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత కొంత తగ్గుతుందని వారు అంచనా వేస్తున్నారు. పారిశ్రామిక యుగానికి ముందు భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీలు. మానవుల జీవనశైలి, పారిశ్రామికీకరణ వల్ల పెరిగిపోయిన కర్బన ఉద్గారాల విడుదల కారణంగా భూతాపం పెరిగి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రపంచదేశాలన్నీ కలిసి 2015లో పారిస్‌లో సమావేశమై.. భూతాపం పారిశ్రామిక యుగానికి ముందుతో పోలిస్తే 1.5 డిగ్రీలు మించకుండా ఒప్పందం చేసుకున్నారు. కానీ, భూతాపం 2023లోనే ఆ 1.5 డిగ్రీల పరిమితిని దాటేసిందని శాస్త్రజ్ఞులు ఇటీవల ప్రకటించారు. కానీ, 2025లో లానినా వల్ల మళ్లీ భూతాపం ఆ 1.5 డిగ్రీల పరిధిలోపునకు వస్తుందని అభిప్రాయపడుతున్నారు. అంతమాత్రాన ఎండాకాలంలో ఎండలు తగ్గుతాయని చెప్పలేమని.. కొత్త ఏడాదిలోనూ వేసవి ఉష్ణోగ్రతలు భయపెడతాయని హెచ్చరిస్తున్నారు.

మూడో ప్రపంచ యుద్ధ ముప్పు?

కొత్త ఏడాదిలో చాలావరకూ శుభసూచకాలే కనిపిస్తున్నా.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రాంతీయ యుద్ధాలు, వాటి వెనుక పలు దేశాల ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం మాత్రం భయపెడుతున్నాయి. 2022 ఫిబ్రవరిలో మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది! రష్యాను ప్రతిఘటించడంలో ఉక్రెయిన్‌కు అమెరికా, యూరప్ దేశాలు ఇప్పటికీ సహకరిస్తూనే ఉన్నాయి. అలా సహకారం అందిస్తున్న నాటో దేశాలపైనా దాడికి వెనకాడబోమని రష్యా ఇప్పటికే హెచ్చరించడం గమనార్హం. మరోవైపు.. 2023 అక్టోబరులో హమాస్ తమ దేశంపై చేసిన దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధ జ్వాలలు సుదూరాలకు విస్తరిస్తున్నాయి. హమాస్‌తోపాటు.. పాలస్తీనాకు అండగా రంగంలోకి దిగిన హౌతీలు (యెమెన్), హిజ్బుల్లా అగ్రనేతలు పలువురిని ఇజ్రాయెల్ చంపేసింది. దీంతో వారందరికీ అండగా ఉన్న ఇరాన్.. ఇజ్రాయెల్‌పై 180కి పైగా క్షిపణులతో దాడి చేయడం, దానికి ప్రతిగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడి సైనిక స్థావరాలను నాశనం చేయడం.. మరోవైపు సిరియాలో రాజధాని డమాస్కస్‌కు కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్యంత కీలకమైన మౌంట్ హెర్మన్‌పై పట్టు సాధించడం తదితర పరిణామాలతో ఆ ప్రాంతమంతా రగులుతోంది. ఈ యుద్ధాలు ఆయా ప్రాంతాలకు/దేశాలకే పరిమితం కాక.. ఘర్షణ వాతావరణం మరింత పెరిగి మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందన్న ఆందోళన చాలా మందిలో వ్యక్తమవుతోంది.





అంతరిక్ష పర్యాటకానికి రెక్కలు!

ఇన్నాళ్లుగా శిక్షణ పొందిన వ్యోమగాములకు మాత్రమే సాధ్యమైన రోదసి యానం.. ఆ కోరిక ఉన్న సంపన్నులకు 2025లో అందుబాటులోకి రానుంది. స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్, వర్జిన్ గెలాక్టిక్, ఓరియన్ స్పాన్ తదితర కంపెనీలు.. భూమికి 80 నుంచి 100 కిలోమీటర్ల ఎత్తున ఉండే కర్మన్ లైన్ దాకా తీసుకెళ్లే ప్యాకేజీలను రూపొందిస్తున్నాయి. ఆ ప్యాకేజీల ద్వారా ఎంచక్కా రోదసిలోకి వెళ్లిరావొచ్చు.

చిత్రజ్యోతి
SINCE 1965

కన్నప్ప కోసం నెమలి



మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో హీరోయిన్ ఎవరనేది సోమవారం ప్రకటించారు. ఇందులో చెంచు రాణి నెమలిగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'అందంలో సహజం. తెగింపులో సాహసం, ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకు సర్వస్వం' అంటూ నెమలి పాత్రను పరిచయం చేశారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ప్రీతి భరతనాట్యంలో ప్రసిద్ధురాలు. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదలవుతుంది.



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను నిర్మాత దిల్ రాజు సోమవారం మంగళగిరిలో కలిశారు. విజయవాడలో నిర్వహించే 'గేమ్‌ఛేంజర్' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు రావాలని పవన్‌ను ఆహ్వానించగా, ఆయన అంగీకారం తెలిపారు. జనవరి 4 లేదా 5 తేదీల్లో ఈ ఫంక్షన్ జరుగుతుంది.

గాయకుడిగా మరోసారి



హీరో సిద్ధార్థ్‌కు అప్పుడప్పుడు పాటలు పాడడం ఓ సరదా. తాను నటించే సినిమాల్లోనే కాకుండా ఇతర హీరోల చిత్రాలకు కూడా వీలు చూసుకుని పాటలు పాడుతుంటారు. ఆడియన్స్ కూడా ఆ పాటల్ని బాగా ఎంజాయ్ చేశారు. ఇంతవరకూ తొమ్మిది పాటలు పాడిన సిద్ధార్థ్ ఇప్పుడు పదో సారి 'ఇట్స్ ఓకే గురూ' చిత్రం కోసం 'నా శ్వాస నువ్వై పోయావే' అంటూ ఓ పాట పాడారు. మోహిత్ రెహ్మానియక్ స్వరాలు అందించారు. చరణ్ సాయి, ఉషశ్రీ జంటగా నటించిన 'ఇట్స్ ఓకే గురూ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. మణికంఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తామని నిర్మాతలు సురేశ్ అనపురపు, బస్వ గోవర్ధన గౌడ్ చెప్పారు.

48 గంటల్లోనే ఓకే చేశారు!



మెగాస్టార్ చిరంజీవి ఇటీవలే 'దసరా' ఫేమ్, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఓ సినిమాను అంగీకరించిన సంగతి తెలిసిందే. వీరి యాడిక్ట్ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ గురించి శ్రీకాంత్ ఓదెల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. "చిరంజీవి చిత్రాలు చూస్తూ పెరిగాను. ఆయన వల్లే సినిమాలపై మక్కువ ఏర్పడింది. ఆయనతో సినిమా చేయడాన్ని నమ్మలేకపోతున్నాను. ఈ సినిమా కచ్చితంగా వైవిధ్యంగా ఉంటుంది. వింటేజ్ చిరును చూస్తారని చెప్పను గానీ.. ఆయన పాత్ర మాత్రం సరికొత్తగా ఉంటుంది. ఆయన బాడీ లాంగ్వేజ్‌కు తగిన చిత్రమిది. చిరంజీవి కారవాన్‌లో ఉన్నంతవరకే ఆయన అభిమానిని. చిరంజీవి సెట్స్‌లో అడుగుపెట్టాక ఆయనని నా సినిమాలో పాత్రలాగే చూస్తా. ఈ సినిమా స్ర్కిప్టును 48 గంటల్లోనే ఫైనల్ చేసేశాం. సినిమాల పట్ల ఆయన చూపించే ఉత్సుకత ఎంతో స్ఫూర్తినిస్తుంది. ఈ ప్రాసెస్ అంతా నాకు పట్టలేనంత ఆనందాన్నిచ్చింది" అని పేర్కొన్నారు. ఈ సినిమాకు నాని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో "హింసలోనే ఆయన తన శాంతిని వెతుక్కుంటాడు" అని పేర్కొన్నారు. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నానితో 'ప్యారడైజ్' సినిమాను చేస్తున్నారు శ్రీకాంత్. ఈ సినిమా పూర్తయ్యాక చిరుతో చేసే సినిమా పట్టాలెక్కనుంది.



అది మా అదృష్టం

చిత్ర పరిశ్రమకు అక్కినేని నాగేశ్వరరావు చేసిన కృషిని ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించడంపై నాగచైతన్య దంపతులు స్పందించారు. ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'అక్కినేని నాగేశ్వరరావు కళా నైపుణ్యాన్ని, తెలుగు సినిమా పరిశ్రమకు ఆయన చేసిన కృషిని మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. మీ నుంచి ప్రశంసలు పొందడం మా అదృష్టం. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ నాగచైతన్య, శోభిత పోస్టులు పెట్టారు.

సల్మాన్‌తో పెళ్లి.. పెదవి విప్పిన సంగీత!



సల్మాన్ ఖాన్‌తో ప్రేమ, పెళ్లి విషయంపై గతంలో ఎంతో ప్రచారం జరిగినా, ఎందరు అడిగినా స్పందించని బాలీవుడ్ మాజీ నటి సంగీత బిజ్లాని ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు పెదవి విప్పారు. 'నిజమే.. సల్మాన్ ఖాన్‌తో నా పెళ్లి జరగాల్సింది.. కానీ అనివార్య పరిస్థితుల కారణంగా అది ఆగిపోయింది' అని వెల్లడించారు. మ్యూజిక్ రియాల్టీ షో ఇండియన్ ఐడల్‌కు హాజరైన సంగీత తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. సల్మాన్‌తో పెళ్లి ఆగిపోయిన విషయాన్ని మాత్రమే వెల్లడించిన ఆమె దాని గురించి ఇంకేమీ చెప్పాలనుకోవడం లేదని తెలిపారు. 'ఓ నటితో నా పెళ్లి జరగాల్సింది. శుభలేఖలు కూడా ప్రింట్ చేశాం. కానీ ఆ పెళ్లి ఆగిపోయింది' అని సల్మాన్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని ఇప్పుడు అందరూ గుర్తు చేసుకుంటున్నారు. ఆ నటి ఎవరో అప్పుడు సల్మాన్ చెప్పలేదు. ఓహో సంగీత గురించే సల్మాన్ అలా చెప్పాడన్న మాట అని అందరూ అంటున్నారు.

లైలా కోసం కలం పట్టిన విశ్వక్



విశ్వక్ సేన్ రెండు విభిన్న పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లైలా'. ఇందులో ఆయన లేడీ గెటప్‌లో నటిస్తుండడం ఓ విశేషమైతే.. ఇప్పుడు ఈ సినిమా కోసం కలం పట్టి పాట రాయడం మరో విశేషం. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. 'మోడల్ మోడల్ సోనూ మోడల్' అంటూ సాగే ఈ పాటలో విశ్వక్ అమ్మాయిల మనసులను ఎలా గెలిచాడో ఆసక్తికరంగా చూపించారు. విశ్వక్ సేన్ రాసిన ఈ పాటను నారాయణ్ రవిశంకర్, రేష్మ శ్యామ్ ఆలపించారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించారు.

ఇన్ ప్రోగ్రెస్

ఓ రైతు భావోద్వేగ ప్రయాణం



బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో దయా దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'బాపు'. రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మాతలు. ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఎగుర్ల, అవసరాల శ్రీనివాస్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. హాయిగా డైనింగ్ చైర్‌లో కూర్చున్న ఓ తండ్రి చుట్టూ ఒక కుటుంబం గుమిగూడి, అతనికి ఇష్టమైన వంటకాలను వడ్డించడం పోస్టర్‌లో కనిపిస్తోంది. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతోన్న ఓ రైతు భావోద్వేగ ప్రయాణం ఈ చిత్ర కథ అని మేకర్స్ తెలిపారు.

తండ్రీ కొడుకుల సెంటిమెంట్



తమిళంలో కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రధారులుగా, గణేశ్ కె.బాబు దర్శకత్వంలో తెరకెక్కి సూపర్ హిట్ అయిన చిత్రం 'డా..డా'. తెలుగులో 'పా..పా' టైటిల్‌తో జేకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై నీరజ కోట జనవరి 3న విడుదల చేస్తున్నారు. 'తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో ఘన విజయం సాధించింది. 'పా..పా' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు' అని నిర్మాత అన్నారు.

జనసేనలోకి జయమంగళ, గంజి చిరంజీవి


పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన గంజి చిరంజీవి, రాధ

కైకలూరు, మంగళగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ, కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ జనసేన పార్టీ తీర్థం తీసుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయ భాను, మాజీ ఎమ్మెల్సీ బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జయమంగళకు పవన్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ నేత, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, రాధ దంపతులు కూడా జనసేనలో చేరారు. వైసీపీలో తన పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5,402 కొత్త పింఛన్లు

▸▸ భర్త చనిపోతే... ఆ పెన్షన్ భార్యకు: మంత్రి కొండపల్లి



అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద అందించే సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీలో ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసిందని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. 'ఆరేడు నెలకు ఒక సారి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి పలికాం. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛను ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చాం. దీనిని స్పౌజ్ కేటగిరీగా గుర్తిస్తూ పెన్షన్ మంజూరు చేస్తున్నాం. సీఎం చంద్రబాబు నవంబరు 1న శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి పంపిణీ చేస్తున్నాం. అందులో భాగంగా 5,402 మందికి కొత్తగా పింఛన్లు ఇస్తున్నాం. వారికి డిసెంబరు 31న రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నాం. గత 3నెలల వ్యవధిలో వివిధ రకాల కారణాలతో పెన్షన్ తీసుకోకుండా ఉన్న 50 వేల మందికి సైతం బకాయిలతో సహా అందించనున్నాం' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

లక్ష ఇళ్లకు త్వరలో ప్రారంభోత్సవాలు

▸▸ మంత్రి పార్థసారథి



అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వీటిని త్వరలోనే ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించే కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏదో ఒక జిల్లాలో పాల్గొంటారని, మిగిలిన జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందిస్తారని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో పేదల ఇళ్ల నిర్మాణంపై మంత్రి సమీక్షించారు.

బీసీలకు చంద్రబాబు పెద్దపీట: బుద్దా

విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీలకు మేలు జరుగుతుందని మరోసారి రుజువైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ హయాంలో సీఎస్ నుంచి కానిస్టేబుల్ దాకా ఒకే సామాజికవర్గం ఉంటే ఇప్పుడు డీజీపీ, సీఎస్ తదితర కీలక పోస్టుల్లో ఉన్నవారంతా బీసీలేనన్నారు. సీఎస్‌గా బీసీని నియమించటంతో టీడీపీతోనే బీసీలకు మేలు జరుగుతుందని స్పష్టమైందని తెలిపారు.

జలంతో జయం

(మొదటి పేజీ తరువాయి)


సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉన్నతాధికారులు

ఈ ప్రాజెక్టు గురించి సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో మీడియాకు ఆయన వివరించారు. బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ రాయలసీమకు గేట్‌వేగా మారుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికే గేమ్ చేంజర్ అవుతుందని చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ పథకం గురించి వివరించానన్నారు. దీనికి ఇప్పటి ధరల ప్రకారం రూ.80,112 కోట్లవుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం అందించే ప్రతిపాదనల ఆధారంగా.. ప్రాజెక్టుకు నిధులు ఎలా విడుదల చేయాలో ఆలోచిస్తామని ఆమె చెప్పారన్నారు. ఈ పథకాన్ని మరో పదేళ్లు ఆలస్యం చేస్తే .. ఖర్చు మూడింతలు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు కలసి హైబ్రిడ్ విధానంలో అమలు చేయాలన్న యోచనలో ఉన్నామని ఆమెకు చెప్పినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల కొత్తగా ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. ఇంకా ఏం చెప్పారంటే..

నిర్మాణం ఇలా..

తెలుగుతల్లికి జలహారతి ప్రాజెక్టును మూడు దశల్లో చేపడతాం. గోదావరి జలాలను తొలి దశలో రూ.13,511 కోట్లతో 187 కిలోమీటర్ల మేర పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోస్తాం. ఇందుకోసం కుడికాలువను 38,000 క్యూసెక్కుల స్థాయికి విస్తరిస్తాం. మార్గమధ్యంలో ఒక లిఫ్టును నిర్మిస్తాం. పది సొరంగాలను నిర్మిస్తాం. అక్కడి నుంచి రెండో దశలో రూ.28,560 కోట్ల అంచనా వ్యయంతో బొల్లాపల్లి రిజర్వాయరులోకి 150 టీఎంసీలు ఎత్తిపోస్తారు. ఇందుకోసం కాలువను 24 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరిస్తాం. ఆరు లిఫ్టులు పెట్టి 84 కిలోమీటర్ల మేర జలాలు తరలిస్తాం. మూడో దశలో రూ.38,014 కోట్లతో బొల్లాపల్లి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు రోజుకు రెండు టీఎంసీల చొప్పున 300 టీఎంసీలు ఎత్తిపోస్తాం. మూడు లిఫ్టులతో 108.4 కిలోమీటర్లు తీసుకెళ్తాం. మొత్తంగా పది లిఫ్టులతో 368 కిలోమీటర్ల వరకు గోదావరి జలాలను తరలిస్తాం. 48,000 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంటుంది. రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును కేంద్రమే పూర్తిగా భరించేలా లేదు. అందువల్ల కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో హైబ్రిడ్ విధానంలో నిర్మిస్తాం. మూడు నెలల్లో ఈ పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)తో కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతాం. అక్కడి నుంచి అనుమతి వచ్చాక ఇంకో 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తాం. ఈ ప్రాజెక్టులో భాగంగా గ్రీన్ ఎనర్జీ అమలు దిశగా పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్, సౌర విద్యుత్, పవన విద్యుత్ పథకాలను అమలు చేస్తాం. బొల్లాపల్లి నుంచి వెలిగొండకు కూడా తరలిస్తాం.

గోదావరి-కావేరితో లాభం లేదు

కేంద్రం ప్రతిపాదించిన గోదావరి-కావేరి అనుసంధాన పథకం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం లేదు. మన రాష్ట్రంలోని నదులను అనుసంధానిస్తే ఆంధ్రను సస్యశ్యామలం చేయవచ్చు. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం వాటిలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి ఒకటో తేదీకి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండడం రికార్డు. తెలుగు రాష్ట్రాల్లో 90 శాతం ప్రాజెక్టులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి.

ఎల్లుండి డయాఫ్రం వాల్ పనులు

పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పనులు జనవరి రెండో తేదీన ప్రారంభమవుతాయి. ప్రాజెక్టు క్షేత్రంలో చేపట్టే ఈ కార్యక్రమంలో నేనూ పాల్గొంటా.

గేరు మార్చబోతున్నాం!

▸▸ పాలనలో వేగానికి తగ్గట్లే అధికారులు పనిచేయాలి: సీఎం

కొత్త సంవత్సరం నుంచి పాలనలో గేరు మార్చబోతున్నామని, వేగం పెంచుతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ వేగానికి తగట్లుగా అధికారులంతా పని చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని సేకరించి, వారు తమ పనితీరు మెరుగు పరచుకోవాలన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్టీజీఎస్)పై ఆయన సమీక్ష జరిపారు. 'రాష్ట్రంలో ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తూ పాలన కొనసాగాలి. అధికారులు తమ పనితీరుతో ప్రజల్ని మెప్పించాలి. అప్పుడే జనరంజక పాలన సాకారమవుతుంది. రాష్ట్రంలోని ఆర్టీసీ బస్టాండ్లు, దేవాలయాలు, ఆస్పత్రుల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుతున్న సేవలపై అభిప్రాయాలు సేకరించాలి. పింఛన్ల పంపిణీని జీపీఎస్ ద్వారా తెలుసుకోవాలి. మద్యం బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇకపై ప్రతి సోమవారం రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సమీక్ష ఉంటుంది. ఉచిత ఇసుక విధానం సక్రమ అమలుకు రీచ్‌ల్లో సీసీ కెమేరాలు, వాహనాలకు జీపీఎస్ ద్వారా పర్యవేక్షణ జరగాలి. ఎప్పటికప్పుడు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. ఎప్పుడూ లేని విధంగా బడ్జెట్‌లో ఒక్క ఆరోగ్య రంగానికే రూ.18 వేల కోట్లు కేటాయించాం. ఆ స్థాయిలోనే ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలి. రాష్ట్రంలో రూ.860 కోట్లతో జరుగుతున్న రోడ్ల మరమ్మతులపైనా అభిప్రాయాలు సేకరించాలి. రాష్ట్రంలో డ్రోన్ల సేవలు ఎవరెవరికి అవసరమో వివరాలు సేకరించాలి. డ్రోన్లు వినియోగం అందుబాటులోకి తెస్తే.. సమయంతో పాటు అదనపు ఖర్చు తగ్గుతుంది. ఇక నుంచి టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పాటు ఆడిట్ కూడా ఉంటుంది' అని స్పష్టం చేశారు.

> ఎప్పుడైనా కూలగొట్టడం చాలా తేలిక. నిర్మించడం చాలా కష్టం. గత ఐదేళ్లూ ప్రతి రంగాన్నీ భ్రష్టు పట్టించుకుంటూ వెళ్లారు. 6నెలలుగా నేను రాత్రింబవళ్లూ పనిచేస్తూ అధికారులకు మార్గదర్శకత్వం ఇస్తూ అవసరమైన చోట టెక్నాలజీని వాడుతున్నా ఇంకా బాగు చేయలేకపోతున్నాను.
> - సీఎం చంద్రబాబు

నేను బాగు చేయడం.. వాళ్లొచ్చి నాశనం చేయడం!

▸▸ మళ్లీ నేనొచ్చి రిపేర్ చేయడం.. ప్రతిసారీ ఇదే తంతు

▸▸ సీఎం చంద్రబాబు ఆవేదన

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'నేను ముఖ్యమంత్రిగా ఉండగా బాగు చేయడం.. నా తర్వాత వాళ్లు వచ్చి నాశనం చేయడం... ఆ తర్వాత మళ్లీ నేనొచ్చి బాగు చేయడం... ప్రతిసారీ ఇదే తంతు నడుస్తోంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సోమవారమిక్కడ సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు ఎత్తిపోతల పథకాల దుస్థితి గురించి ప్రస్తావన వచ్చింది. 'రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల కింద పది లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పుడు 5లక్షల ఎకరాలకు విఎంచి సాగు కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో వాటిని పట్టించుకునే దిక్కులేక.. నిర్వహణ లేక మూలపడ్డాయి. ఆర్థికం సహా ప్రభుత్వ వ్యవస్థలను కుప్పకూల్చిపోయారు. ఇంత ఘోరమైన పరిస్థితిని నేనెప్పుడూ చూడలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలు చేస్తామని ముందు ప్రకటనలు చేసి తర్వాత వాయిదా వేస్తూ వైసీపీ అధినేత జగన్ తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రశ్నించినప్పుడు.. విశ్వసనీయత, నిలకడ లేని వ్యక్తుల తీరు అంతే ఉంటుందని ఆయన బదులిచ్చారు. 'కొంత మంది నాయకులకు లోలోపల రహస్య ఎజెండాలు ఉంటాయి. పారదర్శకత ఉండదు. మేమేదైనా చేయాల్సి వస్తే సాధ్యాసాధ్యాలు చూసి అన్నీ అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. వాళ్లకు అది పట్టదు. తాము చెప్పిందే వాస్తవమని ప్రజలను నమ్మించాలని చూస్తారు' అని చెప్పారు. దేశంలో రైతాంగంపై రుణ భారం మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందన్నారు. వారి నెలా బయటపడేయాలి.. ఆదాయమెలా పెంచాలి.. వ్యవసాయాన్ని ఎలా లాభసాటిగా మార్చాలో తీవ్రంగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

విద్యుత్ ధర 4.80కి తగ్గిస్తాం

విద్యుత్ కొనుగోలు రేటు ప్రస్తుతం యూనిట్ రూ.5.18గా ఉంది. దానిని ఈ ఏడాది 4.80కి తగ్గించేందుకు కసరత్తు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ కుసుమ్ పథకం కింద సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిని గ్రిడ్‌కు అనుసంధానం చేయబోతున్నాం. సూర్య ఘర్ పథకం కింద వీలైనన్ని ఇళ్ల పై కప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసి అక్కడ మిగులు విద్యుత్ కూడా గ్రిడ్‌కు తీసుకురావాలని అనుకుంటున్నాం. వీటి వల్ల కొంత మేర విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతుంది.

4 దక్షిణాది నగరాలను కలుపుతూ బుల్లెట్ రైలు

నాలుగు దక్షిణాది నగరాలైన బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతిలో కలిపి నాలుగు కోట్ల జనాభా ఉంది. ఈ నాలుగు నగరాలను కలుపుతూ బుల్లెట్ రైలు కావాలని రైల్వే మంత్రిని కోరాను. బుల్లెట్ రైలు వస్తే ఒక నగరం నుంచి మరో నగరానికి గంటలో వెళ్లవచ్చు. వీటన్నింటికి మధ్యలో అమరావతి ఉన్నందువల్ల అమరావతి మీదుగా ఒక సర్క్యూట్ ఏర్పాటు చేయవచ్చని సూచించా.

చంద్రబాబు సంపద 931 కోట్లు

దేశంలో సంపన్న సీఎం ఆయనే
ముఖ్యమంత్రి మమత ఆస్తి 15 లక్షలే
ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 30: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే అత్యంత సంపన్న సీఎం అని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. ఆయన కుటుంబానికి రూ.931 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు తెలిపింది. అదేసమయంలో ఆయనకు రూ.10కోట్ల అప్పు ఉందని వెల్లడించింది. సీఎంల ఆస్తులు, అప్పులపై సోమవారం ఏడీఆర్ ఒక నివేదిక విడుదల చేసింది. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యంత తక్కువ ఆస్తులున్నది బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకే అని... ఆమె వద్ద రూ.15 లక్షల ఆస్తే ఉందని ఏడీఆర్ పేర్కొంది. మొత్తంగా కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సగటు సంపద రూ.52.59 కోట్లుగా ఉందని నివేదిక వివరించింది. అంతేకాదు, సీఎంల సగటు వ్యక్తిగత ఆదాయం రూ.13,64,310గా పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 31 మంది సీఎంల సంపద రూ.1,630 కోట్లు. రూ.332 కోట్ల సంపదతో అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమాఖండు ధనికుల్లో రెండోస్థానంలో ఉన్నారు. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షల సంపదతో పేద ముఖ్యమంత్రుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. 13 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. హత్యాయత్నం, కిడ్నాప్, ముడుపులు, నేరపూరిత కుట్రలకు పాల్పడడం వంటి కేసులు ఎదుర్కొంటున్న వారు 10 మంది ఉన్నారు.

ఉగాది నుంచి ఉచితం

(మొదటి పేజీ తరువాయి)

రోజుకు ఎంత దూరం ప్రయాణించినా టికెట్ కొనాల్సిన అవసరం ఉండదు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు.. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. 'మహిళలకు ఇచ్చిన హామీల్లో ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని ఇప్పటికే అమలు చేశాం. ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేయాలి. సంక్రాంతి నుంచి మొదలు పెడదాం' అని చంద్రబాబు అన్నారు. అయితే ఇప్పటికిప్పుడు ఉచిత ప్రయాణాన్ని అమలు చేయాలంటే 3,500 బస్సులు, 11,500 మంది సిబ్బంది అవసరమని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్పారు. కనీసం రెండువేలు కొత్త బస్సులు లేదా అద్దె బస్సులు లేకుండా ఉచిత ప్రయాణం హామీ అమలు చేయలేమన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో సరాసరి 69 శాతం వరకూ ఉందని, మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే 94 శాతానికి పెరుగుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఉచిత ప్రయాణం అమలుతో ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.265 కోట్ల భారం పడే అవకాశం ఉందన్నారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతో పాటు పంజాబ్, ఢిల్లీలో ఉచిత బస్సు ప్రయాణం ను సీఎంకు వివరించారు.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

2న కర్ణాటకకు మంత్రుల బృందం

జనవరి 2న హోంశాఖ మంత్రి అనిత, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఆర్టీసీ అధికారుల బృందంతో కలిసి కర్ణాటకకు అధ్యయనానికి వెళుతున్నట్లు సీఎంకు మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఉచిత ప్రయాణం అమలుపై ఎదురైన సవాళ్లు, ఇబ్బందుల గురించి చర్చించినట్లు తెలిపారు. త్వరలో తమిళనాడుకు కూడా వెళ్లి అధ్యయనం చేశాక పూర్తిస్థాయి నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

5,600 బస్సులు కొనాలి

ఆర్టీసీలో కొత్త బస్సుల కొనుగోలులో విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సమీక్షలో సీఎం ఆదేశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం నేరుగా రాష్ట్ర రవాణా కార్పొరేషన్లకు సబ్సిడీ ఇవ్వట్లేదని, గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) కింద ఇస్తోందని అధికారులు చెప్పారు. అలా తీసుకుంటే అన్నీ అద్దె బస్సులే అవుతాయని, ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న సిబ్బంది సేవలు నిరుపయోగంగా మారే అవకాశముందని వివరించారు. కేంద్ర సబ్సిడీతో సంబంధం లేకుండా మనమే ఎలక్ట్రానిక్ వాహనాలు కొనుగోలు చేస్తే వాటికి రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 42 డిపోలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. రాబోయే రెండేళ్లలో 5,608 బస్సులను కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. మొత్తం అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికతో మరోమారు రావాలని ఆర్టీసీ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఉగాది నాటికి హామీ అమలయ్యేలా చూడాలన్నారు.

ప్రభుత్వానికి ఎంత భారమంటే..

- పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే ప్రభుత్వంపై నెలకు రూ.265 కోట్లు చొప్పున ఏడాదికి 3,182 కోట్ల రూపాయలు అదనపు భారం పడనుంది.
- ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం అమలు చేస్తే నెలకు రూ.177 కోట్ల చొప్పున ఏడాదికి 2,112 కోట్లు భరించాల్సి ఉంటుంది.

కొత్తగా 9 భారీ ప్రాజెక్టులు

▸▸ రాష్ట్రానికి మరో రూ.1.82 లక్షల కోట్ల పెట్టుబడులు

▸▸ 2.63 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

▸▸ ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

▸▸ చంద్రబాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

▸▸ సకాలంలో ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశం

▸▸ రాష్ట్రానికి మరింతగా పెట్టుబడులను ఆకర్షించాలని నిర్దేశం

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తదితర దిగ్గజ పారిశ్రామిక సంస్థలు సహా పలు కంపెనీలు రాష్ట్రంలో మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్న 9 ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం తెలిపింది. ఈ కొత్త ప్రాజెక్టుల ద్వారా 2,63,411 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలో వివిధ సంస్థలు ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుల గురించి సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం నిర్వహించారు. వాటిపై చర్చించి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న పారిశ్రామిక సంస్థలకు భూ కేటాయింపులతో పాటు అవసరమైన మౌలిక వసతులను శరవేగంగా కల్పించాలని, అదే సమయంలో ఒప్పందం ప్రకారం నిర్దిష్ట సమయంలో ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాల ద్వారా మరింతగా పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. తాజా ప్రాజెక్టులు, వాటి పెట్టుబడులు, తద్వారా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి అధికారులు సీఎంకు వివరించారు. గత నెల 19న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపిన వివిధ ప్రాజెక్టుల పురోగతి గురించి కూడా చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ

నెల్లూరు జిల్లా రామాయపట్నంలో 6వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో భారీ రిఫైనరీని బీపీసీఎల్ ఏర్పాటు చేయనుంది. 2,400 మందికి ఉపాధి కలుగుతుంది. 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రో కెమికల్స్ యూనిట్స్, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే 20 ఏళ్లలో రాష్ట్రానికి రూ.88,747 కోట్ల ఆదాయం లభిస్తుంది. 2029లోగా ప్రాజెక్టు పూర్తయ్యేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

విశాఖలో టీసీఎస్

విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) రూ. 80 కోట్ల పెట్టుబడితో కార్యాలయాన్ని పెట్టనుంది. ఇందులో 2వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి.

సత్యసాయి జిల్లాలో ఆజాద్ మొబిలిటీ ఇండియా ప్రాజెక్టు

శ్రీసత్యసాయి జిల్లా గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ 70.71 ఎకరాల్లో ఎలక్ట్రిక్ త్రీవీలర్, ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల గ్రీన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. రూ.1,046 కోట్ల పెట్టుబడితో వచ్చే ఆరేళ్లలో మూడు దశలుగా ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది. ఇందులో 2,381 మందికి ఉపాధి కలుగుతుంది.

రాంబిల్లిలో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ యూనిట్

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 106 ఎకరాల విస్తీర్ణంలో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీఎఫ్/ పర్టికల్ బోర్డు ప్లాంట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను నెలకొల్పనుంది. రూ.1,174 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌లో 1,500 మందికి ఉపాధి లభిస్తుంది.

క్లిక్ అయిన క్లీన్ ఎనర్జీ పాలసీ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన క్లీన్ ఎనర్జీ పాలసీ వల్ల పలు సంస్థలు భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. కొత్తగా ఐదు సంస్థలు రూ.83 వేల కోట్ల పెట్టుబడితో వివిధ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నాయి. దీంతో క్లీన్ ఎనర్జీ రంగంలోనే రెండున్నర లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా తయారీ

ఏఎం గ్రీన్ అమ్మోనియా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కాకినాడలో 592 ఎకరాల్లో మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత అమ్మోనియా తయారీ కేంద్రంను రూ.12,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రంలో 2,600 మందికి ఉపాధి కలుగనుంది.

జాన్ కోకిరిల్ గ్రీన్‌కో..

కాకినాడలోని 40 ఎకరాల్లో జాన్ కోకిరిల్ గ్రీన్‌కో హైడ్రోజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2 గిగావాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను రూ.2 వేల కోట్లతో స్థాపించనుంది. ఇక్కడ 500 మందికి ఉపాధి కలుగుతుంది.

కర్నూలు జిల్లాలో టాటా పవర్..

టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ కర్నూలు జిల్లాలోని హోసూరు, పెద్ద హుల్తిల్లో మొత్తం 1,800 ఎకరాల్లో రూ.2 వేల కోట్ల పెట్టుబడితో 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. ఇందులో 1,380 మందికి ఉపాధి లభిస్తుంది.

కడప, నంద్యాల జిల్లాల్లో క్లీన్ ఎనర్జీ..

కడప జిల్లాలోని మైలవరం, కొండాపురం, నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్లలో మొత్తం 1,080 ఎకరాల్లో 119 మెగావాట్ల పవన శక్తి, 130 మెగావాట్ల సౌర శక్తి హైబ్రీడ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. వీటిలో 650 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రిలయన్స్ ఇండస్ట్రీస్ బయోగ్యాస్ ప్లాంట్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రాష్ట్రంలో తాజాగా రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రమంతటా 5 లక్షల ఎకరాల్లో 11 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. వీటిలో 2.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. 2028 కల్లా ఈ ప్రాజెక్టు పూర్తికానుందని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.4,095 కోట్ల ఆదాయం రానుందని అధికారులు సీఎంకు వివరించారు.

మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో ప్రధాన నిందితుడు గౌతమ్‌తేజ్ అరెస్టు

చిత్తూరు, మదనపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసులో ప్రధాన నిందితుడు, సీనియర్ అసిస్టెంట్ గోరంట్ల గౌతమ్‌తేజ్‌ను సోమవారం పలమనేరులో అరెస్టు చేసిన పోలీసులు, చిత్తూరు సీఐడీ కోర్టుకు తరలించారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఈ ఏడాది జూలై 21న రాత్రి మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి రికార్డులన్నీ దగ్ధమైన విషయం తెలిసిందే. ప్రమాదం జరగడానికి ముందు అక్కడ పనిచేసిన ఆర్డీవో, ఇతర అధికారులను పోలీసులు వారం రోజుల పాటు విచారించారు. తదుపరి విచారణ కోసం ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. గౌతమ్‌తేజ్‌ను అరెస్టు చేసి చిత్తూరు సీఐడీ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐడీ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్టు విషయాన్ని గౌతమ్‌తేజ్ కుటుంబ సభ్యులకూ తెలియజేసినట్లు అందులో పేర్కొన్నారు. తండ్రి మరణించంతో కారుణ్య నియామకం పొందిన గౌతమ్‌తేజ్.. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేశారు. అప్పట్లో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందే అభ్యర్థుల వద్ద ఇతను డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు.


ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు విజ్ఞప్తులు అందజేస్తున్న మందకృష్ణ మాదిగ

రిజర్వేషన్ ఫలాలు మాదిగలకు దక్కట్లేదు

▸▸ ఐక్యత పేరుతో మా అవకాశాలను దోచుకుంటున్నారు

▸▸ ఎస్సీ వర్గీకరణతోనే అన్ని వర్గాలకూ న్యాయం: మంద కృష్ణ

గుంటూరు తూర్పు, గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు ఉమ్మడిగా దక్కడం లేదని, ఐక్యత పేరుతో మాదిగల అవకాశాలనూ మాలలు అందుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఐక్యత అనేది ఒక బూటకమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం గుంటూరు జిల్లాకు విచ్చేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ప్రజలు, వివిధ కులసంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. ఎస్సీ వర్గీకరణతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందంటూ మంద కృష్ణమాదిగ తన అభిప్రాయాన్ని కమిషన్‌కు తెలిపారు. 'ఎస్సీలంటూనే మాదిగలకు సాంఘిక సమానత్వం లేకుండా చేశారు. వారి జనాభా కంటే అధికంగా మాలలు రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తున్నారు. ఇతరుల వాటా మాకొద్దు. అదే సమయంలో మా వాటా మాకు ఇవ్వాలి. మాల, మాదిగ పల్లెలు పక్కపక్కనే ఉన్నా ఇచ్చిపుచ్చుకోవడం లేదు. సచివాలయాల్లో మాదిగల సంఖ్య తగ్గించే విధంగా కుట్ర జరుగుతోంది. మా బంధువులను కూడా మాలలుగా మారుస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలి' అని పేర్కొన్నారు. కాగా, ఎస్సీ ఉప కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై శాఖల వారీగా సమగ్ర వివరాలను కచ్చితమైన అంకెలతో అందించాలని కమిషన్ చైర్మన్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

పరీక్ష పేపర్ లీక్ చేసింది సోషల్ టీచరే

▸▸ కోనసీమ జిల్లా ఎంఈవో, టీచర్ అరెస్టు.. రిమాండ్

విజయవాడ, ద్రాక్షారామ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఎస్ఏ(సమ్మేటివ్ అసెస్‌మెంట్) 1 పరీక్షల్లో గణితం ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. లీక్‌కు కారకులైన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండల విద్యాశాఖాధికారితోపాటు ఉపాధ్యాయుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వీరిని విజయవాడ కోర్టులో సోమవారం హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఈనెల 16న జరగాల్సిన గణితం పరీక్ష ప్రశ్నాపత్రం అంతకుముందే లీకైన విషయం తెలిసిందే. దీనిపై ఏపీఎస్‌సీఈఆర్టీ పరిపాలనాధికారి ఎం.అరుణ్ కుమార్ విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేసిన సైబర్‌క్రైం పోలీసులు.. రామచంద్రాపురానికి చెందిన సుబ్బారావు ఆ మండలంలోని జడ్పీ హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా గుర్తించారు. ప్రశ్నపత్రాలను ఏరోజుకారోజు ఎమ్మార్సీకి వెళ్లి తీసుకువస్తారు. ఈ క్రమంలో ఆయన 14న ఎస్ఏ1 ప్రశ్నాపత్రాలు తీసుకురావడానికి ఎంఈవో శ్రీనివాసరావుతో కలసి ఎమ్మార్సీకి వెళ్లారు. ఆరోజు జరగాల్సిన ప్రశ్నపత్రాలను తీసుకున్నారు. ఇదే సమయంలో రెండు రోజుల తర్వాత జరిగే గణితం ప్రశ్నపత్రాల కట్టలో ఒక దానిని కూడా సుబ్బారావు తీసుకున్నారు. గణితం ప్రశ్నపత్రాన్ని ఓ విద్యార్థినికి ఇచ్చారు. ఆ బాలిక దానిని టెలిగ్రామ్ చానల్‌లో అప్‌లోడ్ చేసింది. ఆ వెంటనే ఓ యూట్యూబ్ చానల్‌లో ప్రత్యక్షమైంది. ఆ టెలిగ్రాం చానల్ రామచంద్రపురం విద్యార్థినిదిగా గుర్తించారు.

'అపుస్మా' అధ్యక్షుడిగా తులసీ విష్ణుప్రసాద్

కొల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా-ఏపీయుఎస్ఎంఎ) రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీరామా రూరల్ అకాడమీ చైర్మన్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం ఇక్కడి కేఎల్ యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.వి.రమణారెడ్డి, అసోసియేట్ ఉపాధ్యక్షుడిగా జేఎస్‌పీ బాలాజీ, జూనియర్ ఉపాధ్యక్షుడిగా ఎం.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎం.కృష్ణ, మరో 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అపుస్మా మాజీ అధ్యక్షుడు, రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలని సూచించారు.

రఘురామ ఇంప్లీడ్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు, నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌లో తనను ప్రతివాదిగా చేర్చుకొని వాదనలు వినిపించేందుకు అనుమతించాలని కోరుతూ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. పిటిషన్‌పై విచారణను ఈనెల 31కి వాయిదా వేసింది.

సజ్జల భార్గవపై తొందరపాటు చర్యలొద్దు

- మధ్యంతర ఉత్తర్వులు మరోవారం పొడిగింపు

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టేలా ప్రోత్సహించారనే ఆరోపణలతో రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన 9 కేసుల్లో వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరో వారం రోజులు పొడిగించింది. తదుపరి విచారణను జనవరి 7కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ ఆడిట్ కంపెనీపై కేసు వివరాలు సమర్పించండి

- కాకినాడ సెజ్ కేసులో సీఐడీకి హైకోర్టు ఆదేశం

కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వాటాలను అరబిందోకు బదలాయింపు వ్యవహారంలో పీకేఎఫ్ శ్రీధ ర్ అండ్ సంతానం ఎల్ఎల్‌పీ ఆడిట్ కంపెనీపై నమోదు చేసిన కేసు వివరాలను తమ ముందు ఉంచాలని సీఐడీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకైనా సంస్థ విషయంతో తొందరపాటు చర్యలు తీసుకోకుండా సీఐడీని నిలువరించాలన్న పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. విచారణను జనవరి 2కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

పీఆర్ ఉద్యోగులకు ఒక రోజు ముందే జీతం

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులందరికీ జీతాలు జనవరి 1 రాక ముందే విడుదల చేశారు. స్లాట్‌ను ఒక రోజు ముందే ఇవ్వడంతో మంగళవారం ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ కానున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలంటే ఠంచనుగా 1న పడతాయన్న నానుడి ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాల విడుదల అనేది ఫలానా తేదీ అనేది లేకుండా పోయింది. ఈ నెల జీతం మరుసటి నెలలో ఇవ్వడం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం జరిగేది. దీంతో ఉద్యోగులు ప్రతి నెలా మొదటి వారంలో జీతాలిస్తే చాలన్న ధోరణికి వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకటో తేదీ జీతాలకు భరోసా దక్కింది. ముఖ్యంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసే సిబ్బందికి వీలైనంత మేరకు 1న జీతాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

కన్యాకుమారిలో అద్దాల వంతెన

- రూ.37 కోట్లతో వివేకానంద మండపం, తిరువళ్లువర్ విగ్రహం మధ్య నిర్మాణం
- ప్రారంభించిన తమిళనాడు సీఎం స్టాలిన్



వంతెనను ప్రారంభించి, దానిపై నడుస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన తమిళనాడులోని కన్యాకుమారిలో రూ.37 కోట్లతో నిర్మించిన ఫైబర్ గ్లాస్ వంతెనను సీఎం ఎంకే స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. దీని పొడవు 77 మీటర్లు, వెడల్పు 10 మీటర్లు ఉంటుంది. వివేకానంద స్మారక మండపం, 133 అడుగుల ఎత్తయిన తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాలను కలిపేలా ఈ వంతెనను నిర్మించారు. కన్యాకుమారి తీరంలో వివేకానంద స్మారక మండపానికి 77 మీటర్ల దూరంలో 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి జనవరి 1వ తేదీకి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడు ప్రభుత్వం రెండు రోజులపాటు రజతోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఫైబర్ గ్లాస్ వంతెనను స్టాలిన్ ప్రారంభించారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన జ్ఞాన స్తూపాన్ని కూడా సీఎం ప్రారంభించారు. ఈ వేడుకలలో మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు, ఎంపీలు టీఆర్‌బాలు, ఎ.రాజా, కనిమొళి తదితరులు పాల్గొన్నారు.



ఇక నెలలో 14 రోజులు జనంలోనే..

- జనసేనలో పనితీరే ప్రామాణికంగా పదవులు..
- ఆరు నెలల మా పాలన సంతృప్తిని ఇచ్చింది
- వైసీపీకి,మాకు భూమికి, నింగికి ఉన్నంత తేడా
- మీడియాతో పవన్ కల్యాణ్ చిట్‌చాట్

అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్యాలయాల్లో కూర్చొని ప్రజల సమస్యలకు పరిష్కారాలు వెతకాలని చూస్తే గందరగోళానికి గురవుతామనీ, అందుకే జిల్లాల పర్యటనకు సిద్ధం అవుతున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నెలలో 14 రోజులు జిల్లాల్లో ప్రజల మధ్య ఉండాలని అనుకుంటున్నానని ఆయన వివరించారు. సోమవారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మీడియాప్రతినిధులతో పవన్ కల్యాణ్ చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి పంచాయతీల్లోనేఉందని, ఆ శాఖను చూడటం వరంగా భావిస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. "అక్కడెక్కడో ఉంటాడు... ఏం వస్తాడులే' అనే నిర్లక్ష్యం పోగొట్టడానికే కడప జిల్లాకు వెళ్లాను. అవసరమైతే ఎంత దూరమైనా వస్తాననే గట్టి సంకేతం అందించాను. ఉద్యోగి ఎవరనేది కాదు.. దాడి జరిగితే వెళ్లి పరామర్శిస్తాను" అని ఆయన తెలిపారు. "రోడ్ల నిర్మాణంలో నాణ్యత ఉండటం లేదని, సర్పంచ్‌లు పట్టించుకోవడం లేదని ఏజెన్సీ ప్రాంత పర్యటనలో నాకు చెప్పారు. వేసిన రోడ్లను తనిఖీ చేసి వెనక్కి రావడం కాదు.. అక్కడే క్యాంప్ ఆఫీస్ పెట్టుకుని ప్రత్యక్షంగా ప్రజల సమస్యలు తెలుసుకోవాలని అనుకుంటున్నాను. దానివల్ల మెటీరియల్ పక్కదారి పట్టకుండా ఉంటుంది. అధికారుల్లో జవాబుదారితనం నెలకొంటుంది." అని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

అయినా.. ముందుకే..

"రాష్ట్రంలో పాలనావ్యవస్థలను వైసీపీ చిందరవందర చేసింది. రాష్ట్రాన్ని ఆర్థికంగా నలిపేసింది. పని సంస్కృతిని పాడు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లోనూ మేం ఆరు నెలల పాలనను పూర్తి చేయగలిగాం. ఏదీ ఆగకుండా అందించగలుగుతున్నాం. పాలన విషయంలో వైసీపీకి, మాకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంది. రాష్ట్రంలో ఆనాడుతప్పులు జరుగుతుంటే ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారని కలెక్టర్లను ప్రశ్నిస్తే వారి వద్ద సమాధానం లేదు. అప్పుడు చెప్పడానికి భయపడ్డారు.. ఇప్పుడు మేం అడిగితే 'మేం అధికారులం.. ఏం చేయగలం' అని అంటున్నారు లోపం ఎక్కడనేది అధికారులు బయటకు చెప్పకపోయినా.. తమ అంతరాత్మను ప్రశ్నించుకోవాలి. పాలనా యంత్రాంగంలో స్పందన తగ్గిపోతోందని సీఎం చంద్రబాబు చెప్పిన మాట నిజమే"

భార్య పేరు మీద గోదాము ఎందుకు పెట్టారు?

"ఆయన (మాజీ మంత్రి పేర్ని నానిని ఉద్దేశించి) సతీమణి పేరుతో గోదాము ఎందుకు పెట్టారు. అదేగనుక తన పేరుతో రేషన్ బియ్యం గోదాం నిర్వహిస్తే ఆయనపైనే కేసు పెట్టేవారు. తప్పు చేయకపోతే బియ్యం ఎలా మాయం అయ్యాయి? ఇది చాలా పెద్ద స్కామ్. ఆయన సతీమణిపై కేసు పెట్టకపోతే మరి ఏం చేయాలి? 'మాజీ మంత్రి సతీమణి అయితే వదిలేస్తారా' అంటూ మళ్లీ మీడియానే రాస్తుంది. తప్పు చేయకపోతే రూ.కోటిన్నర కడతామని ఆయన ఎందుకు ఆఫర్ చేశారు?"

పనితీరే ప్రామాణికం..

"రాజకీయాల్లో పని తీరే ప్రామాణికం. నాగబాబు నా సోదరుడు కాకపోయినా.. ఆయన పని ఆధారంగా తప్పక అవకాశం ఇచ్చేవాడిని. నాకు బంధుప్రీతి ఉంటే.. హరిప్రసాద్‌ని కాదని నాగబాబుకే మొదట ఎమ్మెల్సీ పదవి ఇచ్చేవాడిని. నాగబాబును గత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి కూడా.. బీజేపీతో పొత్తు కారణంగా చివరి నిమిషంలో తప్పించాం. అప్పుడు ఆయన చేసిన త్యాగాన్ని గుర్తించి రాజ్యసభకు పంపాలనుకున్నాం. కానీ, అదీ కుదరలేదు. నాగబాబును ముందుగా ఎమ్మెల్సీని చేస్తాం. మంత్రి పదవి విషయం తర్వాత చర్చిస్తాం. మా ఎమ్మెల్యే పంతం నానాజీ ఉదంతంలో 15 నిమిషాల్లో స్పందించాం. ఆయన వెంటనే డాక్టర్‌కు క్షమాపణ చెప్పారు. ఆయనపై కేసుకూడా నమోదైంది"

లౌకికవాదం ముసుగులో..

"దేశంలో సెక్యులరిజం కేవలం హిందువులకేనా? సెక్యులరిజం ముసుగులో చాలా మంది చాలా రకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. 15 నిమిషాలు పోలీసులు కళ్లు మూసుకుంటే హైదరాబాద్‌లో హిందువు అంటూ లేకుండా చేస్తామని కొందరు ప్రకటన చేసే.. ఒక్క కమ్యూనిస్టు నాయకుడు కూడా మాట్లాడలేదు. అదే ఇతర మతాల వారి మనోభావాలను దెబ్బ తీస్తే మాత్రం వామపక్షవాదులు హిందువుల మీద పడిపోతారు. సెక్యూలరిజం అనేది అన్ని మతాలకూ సమానంగా వర్తించాలి" అని పవన్ కల్యాణ్ తెలిపారు.



గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు

(మొదటి పేజీ తరువాయి)

ఎంజాయ్ చేయడం కాదు.. అభిమానులకు భరోసా కల్పించడం. తొక్కిసలాట ఘటన బాధాకరమైనది. అల్లు అర్జున్ థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఆయనకు సిబ్బంది చెప్పి ఉండాల్సింది. సంఘటన జరిగిన వెంటనే బాధితుల కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి వారిని ఓదార్చాల్సిన అవసరం ఉంది. హీరో తరఫున ఎవరో ఒకరు వెళ్లి ఉంటే సమస్య పెద్దది అయ్యేది కాదు. మా ప్రమేయం లేకుండా తప్పు జరిగిపోయిందని చెప్పి, క్షమాపణలు కోరాల్సింది. ఓదార్చే సమయంలో ఒక్కసారి మనం తిట్లు కూడా తినాల్సి వస్తుంది. సినిమా నిర్మాత, డైరెక్టర్ పరామర్శించ లేదు. అదే పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. సమస్య పరిష్కారంలో టీమ్ ఫెయిలైంది. హీరోపైనే నిందలు వేయడం కూడా కరెక్టు కాదు. దీనిని టీమ్‌గా తీసుకోవాలి. సినిమానే కాదు సమస్యనూ టీమ్‌గా తీసుకోవాలి. సమస్యను హీరోపై పెట్టి ఒంటరి వ్యక్తిని చేసేశారు. అది కరెక్టుగా అనిపించలేదు. ఆ తర్వాత జరిగిన వ్యవహారంలో అల్లు అర్జున్‌ను ఎవరూ సరిగా గైడ్ చేయలేదు" అని పవన్ అన్నారు.

రేవంత్ కక్షసాధింపులకు పోలేదు

'సినిమా చూడడానికి వచ్చి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. పోలీసులను మనం ప్రశ్నించలేం. నేను థియేటర్‌కు వెళ్లను. చిరంజీవి కూడా ముసుగు వేసుకుని థియేటర్‌కు వెళ్లేవారు. అభిమానులు భారీ వస్తారు కాబట్టి, హీరో థియేటర్‌కు వెళ్లే సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటన తర్వాత సీఎం హోదాలో రేవంత్ రెడ్డి స్పందించారు. అక్కడ ఎవరున్నా రేవంత్‌రెడ్డి అలానే చేసేవారు. రేవంత్ రెడ్డి ఆ సినిమాకు అన్ని రకాలుగా సహకరించారు. బెనిఫిట్ షో అవకాశం కల్పించారు. టికెట్ల రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారు. జగన్‌లా నిలిపేసి, కక్షసాధింపు చేయలేదు..' అని పవన్ అన్నారు.

క్రమశిక్షణ ఉండాలి

'సినిమా పరిశ్రమ పని విధానం మార్చుకోవాలి. క్రమశిక్షణ, స్థిరత్వం ఉండాలి. పర్యాటక శాఖకు పరిశ్రమ హోదా కల్పించాం. అలానే సినిమా పరిశ్రమకు హోదా రావాలంటే కొన్ని మార్పులు జరగాలి. దీనిపై అందరూ ఆలోచించాలి. విశాఖ, విజయనగరం, పాపికొండలులో చాలా అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయి. మంచి సినిమాలు రావాలంటే మౌలిక సదుపాయాలు ఉండాలి. స్టోరీ, కల్చర్ చెప్పే సిని పాఠశాలలు ఏపీలో ఏర్పాటు చేయాలి' అని పవన్ అన్నారు.

మిగిలేది 'కిక్కే'!



(మొదటి పేజీ తరువాయి)

తెస్తామన్న కూటమి ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంది. మద్యంపై పన్నులను పునర్వ్యవస్థీకరించి 'క్వార్టర్ రూ.99కే మద్యం అందుబాటులోకి తెచ్చింది. అలాగే మరో పదకొండు రకాల బ్రాండ్ల ధరలను తగ్గించేలా ఇప్పటికే చర్యలు తీసుకుంది. దీంతో గత ప్రభుత్వంతో పోలిస్తే అమ్మకాలు పెరిగినా ఆదాయం తగ్గింది. తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పేద వినియోగదారులు అటువైపు మళ్లారు. ఫలితంగా వారి జేబులు ఖాళీ అయ్యే ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పడింది.

ఇదీ వ్యత్యాసం

2023 డిసెంబరులో 25,83,530 కేసుల లిక్కర్, 6,24,377 కేసుల బీరు విక్రయించారు. దాని విలువ రూ.2,185కోట్లు. ఈ ఏడాది డిసెంబరులో 30,46,362 కేసుల లిక్కర్, 9,11,815 కేసుల బీరు అమ్మారు. దీని విలువ రూ.2,236కోట్లు. గతేడాదితో పోలిస్తే 4,62,832 కేసుల లిక్కర్, 2,87,438 కేసుల బీరు అమ్మకాలు పెరిగాయి. అంటే 18శాతం లిక్కర్, 45శాతం బీరు అమ్మకాలు పెరిగాయి. కానీ విలువ పరంగా చూస్తే మాత్రం కేవలం రూ.51(2.4శాతం) కోట్లు మాత్రమే పెరిగింది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా తగ్గిపోయింది. మద్యం అమ్మకపు విలువలో 75శాతానికి పైగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఇది మారకపోయినా ప్రభుత్వం ముందుగానే పన్నులను పునర్వ్యవస్థీకరించడంతో మద్యం ధరలు తగ్గాయి. కేవలం రూ.99కే క్వార్టర్ మద్యాన్ని తీసుకురావడంతో వాటిలో వచ్చే పన్నులు భారీగా తగ్గిపోయాయి. అలాగే రూ.120 నుంచి రూ.150 మధ్య ధరలున్న మద్యంపైనా తక్కువ ఆదాయమే వస్తోంది.

నిషేధం చేయకుండా ఆదాయం

గత వైసీపీ ప్రభుత్వం మద్యపాన నిషేధం విషయంలో ప్రజలను మోసం చేసింది. అధికారంలోకి వచ్చాక దశలవారీగా మద్య నిషేధం చేస్తామన్న నాటి ప్రభుత్వం, అందులో భాగమేనంటూ ధరలు భారీగా పెంచింది. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత ఒకేసారి ధరలు రెట్టింపు చేసింది. అయితే అదంతా ప్రజల కోసమేనని, మద్యం తాగకూడదనే ఉద్దేశంతో ఆ స్థాయిలో రేట్లు పెంచినట్లు నాటి వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ధరలు రెట్టింపు కంటే ఎక్కువ పెరగడంతో అమ్మకాలు పడిపోయాయి. వాస్తవానికి అది జరగాలనే కోరుకున్నట్టు అప్పటి ప్రభుత్వం చెప్పింది. కానీ ఒకేసారి అమ్మకాలు పడిపోవడంతో ఆదాయం కూడా పడిపోయింది. మద్యం ఆదాయంపై ఎక్కువగా ఆధారపడిన జగన్ ప్రభుత్వం... చెప్పిన మాటపై నిలబడకుండా పెంచిన ధరలను క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. ధర ఎక్కువైనా ప్రజలు కొనుగోలు చేయగలరు అనే స్థాయి వరకు వాటిని తగ్గించింది. అలా మద్య నిషేధం చేయకుండా, ధరలు అందుబాటులో ఉంచకుండా, మధ్యస్థంగా ధరలు పెంచి దోపిడీ చేసింది. ప్రభుత్వం మారాక ఆ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది.

నేడు, రేపు అర్ధరాత్రి వరకూ మద్యం

- రాత్రి 1 గంట వరకు సమయం పెంపు

నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాల సమయాన్ని ఎక్సైజ్ శాఖ పెంచింది. మద్యం షాపులు, బార్లు, క్లబ్‌లు, ఈవెంట్లకు రాత్రి ఒంటిగంట వరకు అనుమతిచ్చింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేయనుంది. సాధారణంగా రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయి. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం వినియోగం ఎక్కువగా ఉంటుంది. షాపులు, బార్లు అందుబాటులో లేకపోతే మందుబాబులు బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేస్తున్నారు. అక్కడ ఒక్కో సీసాపై అదనంగా రూ.50కి పైగా వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు పైవిధంగా నిర్ణయం తీసుకున్నారు.

గంట గంటకో ఫొటో!

- చెక్‌పోస్టులు, మొబైల్ పార్టీలు పంపాలి
- న్యూఇయర్ సందర్భంగా ఎక్సైజ్ తనిఖీలు

నూతన సంవత్సరం సందర్భంగా బయటి రాష్ట్రాల మద్యం(ఎన్‌డీపీఎల్) రాష్ట్రంలోకి రాకుండా ఎక్సైజ్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. మంగళవారం ఉదయం నుంచి 2 రోజులపాటు సరిహద్దుల్లోని చెక్‌పోస్టులు, బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను అప్రమత్తం చేసింది. ఎక్కడా ఎన్‌డీపీఎల్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా తనిఖీలు చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలు జారీచేశారు. ప్రతి గంటకూ తనిఖీలు చేసి ఫొటోలు ఎక్సైజ్ వాట్సాప్ గ్రూపులో ప్రతి చెక్‌పోస్టు, మొబైల్‌పార్టీ పెట్టాలని స్పష్టంచేశారు. షిఫ్టుల వారీగా రాత్రీ పగలు తనిఖీలు కొనసాగుతాయన్నారు. అలాగే, న్యూఇయర్ పేరుతో అదనపు వసూళ్లు చేసేవారిపైనా నిఘా పెట్టారు.

1.67 కోట్లు చెల్లించండి!

- రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని జయసుధకు మళ్లీ నోటీసులు
- రెండో విడత చెల్లింపునకు జేసీ ఆదేశం

మచిలీపట్నం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం మండలం పొట్లపాలెంలోని గోడౌన్ నుంచి పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని భార్య, గోడౌన్ యజమాని జయసుధకు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం నోటీసులు జారీచేశారు. పౌరసరఫరాల శాఖకు మరో రూ.1,67,22,893 చెల్లించాలని అందులో ఆదేశించారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచగా.. సోమవారం వెలుగు చూసింది. ఈ మొత్తాన్ని 3 రోజుల్లోపు చెల్లించాలని అందులో పేర్కొన్నారు. పేర్ని జయసుధ పేరుతో ఉన్న గోడౌన్‌లో 3,78,866 కిలోల పీడీఎస్ బియ్యం మాయమైనట్లుగా అధికారులు మూడు విడతలుగా చేసిన పరిశీలన అనంతరం లెక్క చూపారు. కిలోకు రూ.44.58 ఖరీదుగా చూపి, మాయమైన బియ్యం మొత్తానికి పౌరసరఫరాల శాఖ ఎండీ సూచనల మేరకు రెట్టింపు మొత్తంలో రూ.3,37,79,693 చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఇప్పటికే రూ.1.70,56,800 చెల్లించారని, మిగిలిన రూ.1,67,22,893 చెల్లించాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

ముందస్తు బెయిల్ మంజూరు: పీడీఎస్ బియ్యం మాయం కేసులో పేర్ని జయసుధకు ముందస్తు బెయిల్ మంజూరైంది. తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి సుజాత సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. జయసుధ తరఫున న్యాయవాది వరదరాజులు, ప్రాసిక్యూషన్ తరఫున లంకే వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు ప్రశ్నలు వేశారు. ప్ర తి నెలా జరగాల్సిన గోడౌన్ల తనిఖీ చేశా రా లేదా? అందుకు సంబంధించిన రికార్డులు ఎక్కడున్నాయి? పౌర సరఫరాల శాఖ నుంచి ఎప్పుడెప్పుడు, ఎంత మేర బియ్యాన్ని పొట్లపాలెంలోని గోడౌన్‌కు ఇచ్చారు? ఆ రికార్డులను ఎందు కు సమర్పించ లేదు? అని ప్రశ్నించారు. దీంతోపాటు గోడౌన్ యజమాని, మేనేజర్, పౌర సరఫరాల శాఖ అధికారుల సమక్షంలో స్టాక్ వివరాల ను తనిఖీ చేయాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించిన రికార్డులు ఎందుకు సమర్పించలేదని, గోడౌన్ యజమాని, మేనేజర్‌పైనే కేసు నమోదు చేశారని, పౌరసరఫరాల శాఖ అధికారులపై ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.